సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శనివారం, 14.02.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 115
పేజీలు: 12 వెల: రూ. 5


## ఆసీస్ ఓటమి

ICC MEN'S T20 WORLD CUP INDIA & SRI LANKA 2026

### ఆసీస్‌ను కూల్చిన జింబాబ్వే



- ముజారాబాని మెరుపులు.. ఆస్ట్రేలియా పతనం
- బెన్నెట్ హాఫ్ సెంచరీతో బలమైన స్కోర్
- 19 ఏళ్ల తర్వాత చరిత్ర తిరగరాసిన జింబాబ్వే
- ఇక కెనడాను చిత్తు చేసిన యూఏఈ
- యూఎస్ఏతో నెదర్లాండ్ పోరు
- గ్రూప్ సమీకరణాలు రసవత్తరం

11

## బండి సంజయ్ వన్ మ్యాన్ షో

### కరీంనగర్ కంచుకోటపై బండి ముద్ర

09

- క్షేత్రస్థాయిలో అలుపెరుగని శ్రమతో విజయాన్ని మలిచిన సంజయ్
- అభ్యర్థుల ఎంపికలో ఖచ్చితత్వం.. గెలుపు గుర్రాలపై బలమైన పట్టుదల
- కార్యకర్తలలో నూతన ఉత్సాహం నింపిన నాయకత్వ శైలి
- వ్యూహ ప్రతివ్యూహాలతో ప్రత్యర్థులను మట్టికరిపించిన బీజేపీ ఎంపీ

"రాజకీయంలో గెలుపు గుర్రాలు ఎప్పుడూ వేగంగా పరిగెడతాయి, కానీ ఆ గుర్రాలను సరైన దిశలో నడిపే సారథి గట్టివాడైతేనే అది విజయం' అవుతుంది. కరీంనగర్ గడ్డపై బండి సంజయ్ కుమార్ సాధించిన ఈ విజయం అక్షరాలా ఒక నాయకుడి వ్యక్తిగత పట్టుదలకు, అలుపెరుగని క్షేత్రస్థాయి పోరాటానికి నిలువెత్తు నిదర్శనం. కేంద్ర మంత్రిగా ఢిల్లీ బాధ్యతలు చూస్తూనే, గల్లీ రాజకీయాల్లో అజేయుడిగా నిలిచిన సంజయ్.. ఈ ఎన్నికలను కేవలం పార్టీ పోరాటంగా కాకుండా, తన భుజస్కంధాలపై మోసిన 'వన్ మ్యాన్ షో'గా మార్చేశారు."



## హైదరాబాద్‌పై కాషాయ జెండా ఎగరేస్తాం

### కేంద్ర మంత్రి బండి సంజయ్

- ఒవైసీ కళ్లలో ఆనందం కోసమే జీహెచ్ఎంసీ ముక్కలు
- రేవంత్ రెడ్డి పాలిట అదే మరణ శాసనం కాబోతోంది
- తెలంగాణలో బీజేపీ తొలిసారి కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేశాం
- కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు పట్టించుకోలేదు

03



## ప్రజా పాలనకు పట్టం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



- ప్రజల విశ్వాసమే విజయానికి బలం
- మున్సిపల్ ఫలితాలు అభివృద్ధికి మద్దతు ఇచ్చిన ప్రజలు
- మధిరలో 22లో 21 సీట్ల విజయం.. చరిత్ర సృష్టించిన భట్టి

03

## కాంగ్రెస్,బీఆర్ఎస్‌కు గట్టిపోటీ ఇచ్చాం

### బీజేపీరాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఊహించని షాక్ ఇవ్వబోతున్నాం
- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఓటు షేర్ భారీగా పెరిగింది
- బీఆర్ఎస్ పరిస్థితి దిగజారుతోంది

03

## కాంగ్రెస్‌కు కారే ప్రత్యామ్నాయం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



- పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు తమ తీర్పుతో స్పష్టత ఇచ్చారు
- ఇదే ఉత్సాహంతో జడ్పీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తలబడతాం
- వీరోచితంగా పోరాడిన బీఆర్ఎస్ కార్యకర్తలకు ధన్యవాదాలు
- కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధం
- గద్వాలలో ఒక్క ఓటుతో గెలిచాం

03

# ప్రజాపాలనకు ప్రజామోదం

## పురపోరులో చెయ్యికే జై కొట్టిన జనం



- 'పుర'పోరులో చెయ్యికే జై కొట్టిన జనం
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టం
- నాలుగు కార్పొరేషన్లు, 64 పుర పీఠాలు 'హస్తా'గతం
- కార్పొరేషన్లలో ఖాతా తెరవని బీఆర్ఎస్
- 13 మున్సిపాలిటీలకే పరిమితమైన గులాబీ పార్టీ
- రెండు కార్పొరేషన్లలో వికసించిన కమలం
- 38 స్థానాల్లో హంగ్
- కింగ్ మేకర్లుగా ఇండిపెండెంట్ అభ్యర్థులు
- కొత్తగూడెం కార్పొరేషన్ లో ఎగిరిన ఎర్రజెండా
- వడ్డేపల్లి పీఠం ఏఐఎఫ్‌బి పరం
- స్వతంత్రులు, ఇతర పార్టీ అభ్యర్థులకు ప్రధాన పార్టీల గాలం
- విజేతలు చేజారకుండా క్యాంపులకు తరలింపు
- 'క్యాతనపల్లి'ఫలితాల్లో మంత్రి వివేక్ కు ఎదురుదెబ్బ
- మాజీ ఎమ్మెల్సీ కవితకు ఏఐఎఫ్‌బి షాక్

| | |
|---|---|
| కార్పొరేషన్లు | : 07 |
| కాంగ్రెస్ గెలిచినవి | : 04 |
| (నల్గొండ, మహబూబ్ నగర్, రామగుండం. మంచిర్యాల) | |
| బీజేపీ గెలిచినవి | : 02 |
| సీపీఐ | : 01 (కొత్తగూడెం) |
| మున్సిపాలిటీలు | : 116 |
| కాంగ్రెస్ | : 64 |
| బీఆర్ఎస్ | : 15 |
| ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ | : 01 |
| వార్డుల వారీగా.. | |
| కాంగ్రెస్ | : 1346 |
| బీజేపీ | : 261 |
| బీఆర్ఎస్ | : 723 |
| స్వతంత్రులు | : 252 |

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. ఎన్నికలు జరిగిన ఏడు కార్పొరేషన్లకు గాను నాలుగు, 116 పురపాలికల్లో 90 పుర పీఠాలను కైవసం చేసుకున్నది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ కేవలం 12 మున్సిపాలిటీల్లో మాత్రమే తన ప్రభావాన్ని చూపింది. బీజేపీ సైతం నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో ఆధిక్యత ప్రదర్శిస్తూ.. నారాయణపేట మున్సిపాలిటీని కైవసం చేసుకున్నది. ఇటు ఎంఐఎం సైతం భైంసా మున్సిపాలిటీపై పార్టీ జెండా ఎగురవేసింది. 123 కేంద్రాల్లో లెక్కింపు చేపట్టగా..మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కించారు. అనంతరం సాధారణ ఓట్ల లెక్కింపు జరిగింది. 144 సెక్షన్ మధ్య పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

**37 స్థానాల్లో హంగ్..**
**ప్రధాన పార్టీలకు తప్పని ఇబ్బందులు**

మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ప్రధాన పార్టీలకు స్వతంత్ర అభ్యర్థుల రూపంలో కొత్త తలనొప్పులు వచ్చి పడ్డాయి. ఆయా మున్సిపాలిటీల్లో తమ పార్టీ అభ్యర్థులు గెలిచినప్పటికీ.. విజయానికి కావాల్సిన సీట్లు రాకపోవడంతో.. ఇప్పుడు ఆ పార్టీలకు స్వతంత్రుల మద్దతు అవసరమైంది. ఈ నేపథ్యంలోనే ఇండిపెండెంట్లుగా పోటీ చేసి గెలిచిన వారికి బాగా డిమాండ్ పెరిగింది. దీంతో వాళ్లు.. తమకు ఏ పార్టీ అయితే ఛైర్మన్ పదవి ఇస్తుందో ఆ పార్టీకే మద్దతు తెలుపుతామని గొంతెమ్మ కోరికలు కోరుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 37కి పైగా మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన ప్యాజిక్ ఫిగర్ దక్కలేదు. దీంతో ఎలాగైనా మున్సిపల్ చైర్మన్ పీఠం కైవసం చేసుకునేందుకు ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీ అభ్యర్థులను తమ వైపు తిప్పుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. పలుకోట్ల స్వతంత్ర అభ్యర్థులను క్యాంపులకు తరలించే ప్రయత్నం చేయగా ప్రత్యర్థులు అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయా మున్సిపా మిగతా 02లో

## కాంగ్రెస్‌కు రెబల్స్ దెబ్బ

### హంగ్ మున్సిపాలిటీల్లో టెన్షన్

హంగ్ మున్సిపాలిటీల్లో ఇండిపెండెంట్లే కింగ్ మేకర్లు

టికెట్ల అసంతృప్తి.. స్వతంత్రులుగా గెలిచిన కాంగ్రెస్ నేతలు

- జనగామ నుంచి అలంపూర్ వరకు స్పష్టమైన మెజారిటీ లేక గందరగోళం
- గెలిచినా గందరగోళం.. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాల వెల్లడి
- మజ్లిస్ మ్యాజిక్.. మైనారిటీ ఓటు బ్యాంకుపై పట్టు పెంపు
- ఎక్స్-అఫీషియో ఓట్లతో కాంగ్రెస్‌కు ఆశలు
- చైర్మన్ పదవుల కోసం బేరసారాలు.. క్యాంప్ రాజకీయాలకు శ్రీకారం
- ఎమ్మెల్యేల పట్టు తగ్గిందా?.. పట్టణ ఓటర్ల కొత్త తీర్పు
- ఫిబ్రవరి 16 చైర్మన్ ఎన్నికల దాకా రాజకీయ ఉత్కంఠ

02

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం చూపించినప్పటికీ, రెబల్ అభ్యర్థుల రూపంలో ఎదురైన అంతర్గత తిరుగుబాటు ఆ పార్టీకి కొత్త సవాలుగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా పలు మున్సిపాలిటీల్లో హంగ్ పరిస్థితులు నెలకొనడంతో స్వతంత్రుల మద్దతుపై అధికార పార్టీ ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో క్యాంప్ రాజకీయాలు వేడెక్కుతూ చైర్మన్ పీఠాల కోసం బేరసారాలు రాజకీయ ఉత్కంఠను మరింత పెంచుతున్నాయి.

## గులాబీ అంతర్మథనం

02

### లోకల్ వైఫల్యం తేటతెల్లం

స్థానిక నేతలకు వదిలేసిన అధిష్టానం, పట్టు సాధించలేకపోయిన బీఆర్ఎస్ ఇద్దరు కీలక నేతలకే పరిమితం



## ఎవరి చేతికి అధికారం?

### హంగ్ మున్సిపాలిటీల్లో ఎవరికి అడ్వాంటేజ్?

10

- స్వతంత్రులు అధికార పార్టీకే జై కొడతారా?
- మెజారిటీ లేకున్నా మేయర్ పీఠాలపై కాంగ్రెస్ దృష్టి.. వ్యూహాలు వేగం!
- ఇండిపెండెంట్ల మద్దతు, ఎక్స్ అఫీషియో ఓట్లతో అధికారానికి దగ్గరలో కాంగ్రెస్
- హంగ్ ఫలితాల్లో 'హస్తం'కు లాభం.. రెబల్స్ తిరిగి గూటికి?
- ఫిరాయింపులు, మద్దతులతో మున్సిపల్ పీఠాలపై ఆధిపత్యం కోసం పార్టీల పోటీ




## రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు

### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో కమిటీ




- ప్రభుత్వం-జర్నలిస్టు సంఘాల ప్రతినిధులకు సమాన ప్రాధాన్యం
- ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫొటో, మహిళా జర్నలిస్టులకు సభ్యత్వం
- అక్రిడిటేషన్ కార్డుల జారీ బాధ్యత స్టేట్ కమిటీకి అప్పగింత

03

## కుర్చీ కోసం డీల్ పాలిటిక్స్




- మున్సిపాలిటీల్లో స్వతంత్రుల హవా
- ఒక్క సీటుతో కీలక పాత్ర
- మద్దతు కోసం పార్టీల పరుగులు
- గొంతెమ్మ కోరికలు మొదలు

10



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 14.02.2026
www.mudranews.in | @mudranews



**తెలుగుదేశం పార్టీ -TDP**

ఆంధ్రప్రదేశ్‌లో బలమైన కేడర్, అభివృద్ధి అజెండాతో ముందుకు సాగుతోంది. తెలంగాణలో కూడా మళ్లీ పుంజుకునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నది.

## విజయం ప్రజలకు అంకితం :సీఎం రేవంత్ రెడ్డి

మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితం అన్నారు. పార్టీ పట్ల వారికి ఉన్న అనంతమైన అభిమానానికి నిదర్శనమన్నారు. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితమన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం విడుదలైన మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేద – మధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని చెప్పారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతూ.. భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌లను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజాపాలనకు.. ప్రజామోదం

(మొదటి పేజీ తరువాయి)
లిటీల్లో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. దీంతో భారీగా మోహరించిన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

**తారాస్థాయికి క్యాంపు రాజకీయాలు**

మున్సిపల్ ఎన్నికల్లో క్యాంపుల రాజకీయాలు ఇప్పటికే తారస్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే గెలిచిన వారు చేజారిపోకుండా ఉండేందుకు అన్ని పార్టీలు తమ అభ్యర్థులను క్యాంపులకు తరలించాయి. ఎవరికీ తెలియకుండా రహస్య ప్రాంతాలకు తీసుకెళ్లాయి. ఇక హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో మెజారిటీ మార్కును అందుకునేందుకు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు గాలం వేస్తున్నాయి. తమ పార్టీకి మద్దతు తెలిపిన వారికి భారీగా ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. ఏది అడిగినా చేసే విధంగా వారిని బుజ్జగిస్తూ.. తమ వైపు లాక్కునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే.. ఇదే అదునుగా భావిస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థులు.. గొంతెమ్మ కోరికలకు తెరలేపుతున్నారు. తమకు మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమ మద్దతు కావాలంటే.. తామే మున్సిపల్ ఛైర్మన్ కుర్చీలో కూర్చుంటామని తేల్చి చెబుతున్నారు. దీంతో ఆయా పార్టీలు తలలు పట్టుకుంటున్నాయి. ఇన్ని రోజులు తమ పార్టీ కోసం పనిచేసి.. తమ పార్టీ గుర్తు మీద ఎన్నికల్లో పోటీ చేసి కౌన్సిలర్లుగా గెలిచిన వారిని కాదని.. ఇప్పుడు మద్దతు తెలిపిన వ్యక్తికి మున్సిపల్ ఛైర్మన్ పదవిని ఎలా కట్టబెడతామని అయోమయంలో పడ్డాయి. ఒకవేళ వారికి మున్సిపల్ ఛైర్మన్ పదవిని అప్పగించినా.. ఆ తర్వాత తమ పార్టీ నుంచి జంప్ అయితే పరిస్థితి ఏంటి అనే ఆలోచనలో ప్రధాన పార్టీలు పడ్డాయి. అంతమందిని గెలిపించుకున్నా.. మెజార్టీ మార్కును అందుకోకపోవడంతో.. ఆయా మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పరిస్థితి చాలా దారుణంగా మారింది. దాదాపు ఇప్పటివరకు వెల్లడైన ఫలితాలను బట్టి చూస్తుంటే.. రాష్ట్రవ్యాప్తంగా 37 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. దీంతో ఆ మున్సిపాలిటీ పరిధిలో జోరుగా అభ్యర్థులను కొనుగోలు చేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉదాహరణకు.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అలియాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో మొత్తం 11 మంది ఇండిపెండెంట్లు పోటీ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ధీటుగా ప్రచారం చేసిన ఏడో వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్.. తన సీటులో గెలుపొందారు. అలియాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా.. అందులో కాంగ్రెస్ పార్టీ 8 వార్డులు.. బీఆర్ఎస్ 7 వార్డులు, బీజేపీ 3 వార్డులు.. ఒక వార్డులో బీఎస్పీ విజయం సాధించాయి. ఎవరికీ స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన గాదె వెంకటేష్ మద్దతు కీలకంగా మారింది. దీంతో ఆయనను ఒప్పించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నాలు చేయగా.. మున్సిపల్ ఛైర్మన్ పదవిని తనకు ఏ పార్టీ ఇస్తే వారికే తాను మద్దతు తెలుపుతానని గాదె వెంకటేష్ తేల్చి చెప్పడంతో పార్టీలకు పెద్ద షాక్ తగిలినట్లయింది. మరోవైపు.. జనగామ మున్సిపాలిటీలోనూ ఇదే రకమైన పరిస్థితి నెలకొంది. జనగామలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సమాన వార్డుల్లో విజయం సాధించగా.. 15వ వార్డులో గెలిచిన స్వతంత్ర అభ్యర్థి పాండు మద్దతు రెండు పార్టీలకు కీలకంగా మారింది. దీంతో అతడి మద్దతు పొందేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు.. పాండును తమ వాహనాల్లో ఎక్కించుకుని తీసుకెళ్లేందుకు ఘర్షణకు దిగడంతో అక్కడ ఉద్రిక్తత చెలరేగింది. అయితే తనకు మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇస్తానంటేనే ఏ పార్టీకైనా మద్దతు పలుకుతానని చెప్పడంతో వారు షాక్‌కు గురయ్యారు. మరోవైపు 23వ వార్డు అభ్యర్థిని బీఆర్ఎస్ నేతలు క్యాంప్‌నకు తరలిస్తుండగా స్థానిక ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అడ్డుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి.. ఎంపీ చామలను ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రెచ్చిపోవడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది.

**వివేక్ కు ఎదురుదెబ్బ..**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు మంత్రి వివేక్ వెంకటస్వామికి ఊహించని షాక్ ఇచ్చాయి. ఆయన సొంత నియోజకవర్గ పరిధిలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. ఆ స్థానాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు ముందస్తు పొత్తుతో ఎన్నికలకు వెళ్లటం కలిసి వచ్చింది. క్యాతనపల్లిలో మొత్తం 22 వార్డులు ఉండగా.. ఈ రెండు పార్టీలు 14 వార్డులు కైవసం చేసుకున్నాయి. దీంతో వారికి మున్సిపల్ పీఠం దక్కించుకోవడం ఈజీ అయింది. బీఆర్ఎస్ 10 వార్డులు, కాంగ్రెస్ 7 వార్డులు, సీపీఐ 4 వార్డులు, ఇండిపెండెంట్ ఒక వార్డులో విజయం సాధించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపాలిటీలో కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి.

**కొడంగల్ లో కాంగ్రెస్**

సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. కొడంగల్ మున్సిపాలిటీలోని మొత్తం 12 వార్డులకు గాను కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకుని ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కేవలం ఒక్కో వార్డు కే పరిమితం అయ్యాయి.

**దుబ్బాక 3వ వార్డులో లక్కీడ్రా..**

సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలో హోరాహోరీగా సాగిన ఎన్నికల పోరులో 3వ వార్డులో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొంది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి ఇరు పార్టీల మధ్య ఆధిక్యం దోబూచులాడింది. చివరకు లెక్కింపు పూర్తయ్యే సరికి ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో అధికారులు అశ్చర్యపోయారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఎక్కడా చిన్న తప్పు కూడా జరగకూడదన్న ఉద్దేశంతో ఎన్నికల అధికారులు రెండుసార్లు రీ–కౌంటింగ్ నిర్వహించారు. అయితే, రెండోసారి లెక్కించినా ఫలితంలో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో ఎన్నికల నిబంధనల ప్రకారం.. ఓట్లు సమానంగా వచ్చిన నేపథ్యంలో విజేతను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయాలని నిర్ణయించారు. అనంతరం అధికారులు చిన్న స్లిప్పులపై ఇద్దరు



అభ్యర్థుల పేర్లు రాసి ఓ బాక్సులో వేసి డ్రా తీయగా బీఆర్ఎస్ అభ్యర్థి పేరు రావడంతో అధికారులు ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటించారు.

**ట్రాన్స్‌జెండర్ గెలుపు**

నల్లగొండ జిల్లాలోని చిట్యాల మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో ఒకటో వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ట్రాన్స్‌జెండర్ నాగిళ్ల సుధాకర్... కాంగ్రెస్ బలపరిచిన సీపీఎం అభ్యర్థి జిట్ట నగేష్‌పై 109 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రాజకీయ నేపథ్యం, పార్టీల అండదండలు లేకపోయినా ప్రజల మద్దతుతో ప్రధాన పార్టీల అభ్యర్థులను ఓడించిన సుధాకర్.. ఓటు వేసిన వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

**జనసేన భోణి**

సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డు నుంచి జనసేన పార్టీ తరఫున పోటీ చేసిన ఆరూరి విజయలక్ష్మీ ఘన విజయం సాధించారు. ఆమె తన సమీప ప్రత్యర్థిపై 60 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రాష్ట్రవ్యాప్తంగా హస్తం పార్టీ అభ్యర్థులు జయభేరీ మోగిస్తున్న వేళ.. నేరేడుచర్ల 14వ వార్డులో అటు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను కాదని.. జనసేన పార్టీ అభ్యర్థికి ఓటర్లు పట్టం కట్టడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచనలంగా మారింది. ఈ విజయంతో జనసేన పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం వచ్చినట్లయింది. ఈసారి తెలంగాణ మున్సిపల్ ఎన్నికల బరిలో జనసేన పార్టీ 336 స్థానాల్లో తమ అభ్యర్థులను నిలిపింది.

**చిక్కుల్లో ఎమ్మెల్యేలు**

మున్సిపల్ ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత.. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు చిక్కుల్లో పడ్డారు. మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల ఎంపికలో కీలకమైన ఎక్స్ అఫిషియో ఓటు వీరి మెడకు చుట్టుకుంది. సాంకేతికంగా వీరంతా ఇంకా బీఆర్ఎస్ సభ్యులుగానే కొనసాగుతున్నారని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేసిన నేపథ్యంలో.. బీఆర్ఎస్ అధిష్టానం వీరికి షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. మేయర్, ఛైర్మన్ ఎన్నికల సమయంలో వీరందరికీ పార్టీ విప్ జారీ చేయాలని కేటీఆర్ ఇప్పటికే నిర్ణయించారు. బీఆర్ఎస్ విప్ జారీ చేస్తే పార్టీ మారిన ఎమ్మెల్యేల పరిస్థితి 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' అన్న చందంగా మారనుంది. విప్ పాటిస్తే కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేయాల్సి ఉంటుంది. ఒకవేళ విప్ బేఖాతరు చేస్తే పార్టీ ఆదేశాలను ధిక్కరించినందుకు వారిపై అనర్హత వేటు వేసేందుకు బీఆర్ఎస్‌కు బలమైన చట్టపరమైన ఆధారం లభించనుంది.

**జగిత్యాలలో జీవన్ రెడ్డి హవా**

జగిత్యాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కకపోవడంతో రెబల్స్‌గా, స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి అనుచరులు ఏకంగా 14 వార్డుల్లో విజయం సాధించి 'కింగ్ మేకర్లు'గా నిలిచారు. దీంతో జగిత్యాల మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవడంలో వీరి మద్దతు అత్యంత కీలకంగా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ కేవలం 12 స్థానాలకే పరిమితం కాగా, బీఆర్ఎస్, బీజేపీలు నామమాత్రపు స్థానాలకే పరిమితమయ్యాయి. ఎంఐఎం రెండు వార్డుల్లో తన ఉనికిని చాటుకుంది. ఇప్పుడు ఈ స్వతంత్ర అభ్యర్థులు ఏ పార్టీకి మద్దతు ఇస్తారనే దానిపై మున్సిపల్ చైర్మన్ పీఠం ఆధారపడి ఉంది.

**పోలీస్ భార్య విజయం**

సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపాలిటీలో విధుల నుంచి సస్పెండ్ అయిన పోలీస్ కానిస్టేబుల్ భార్య విజయం సాధించింది. పట్టణంలోని రెండో వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిపై 223 ఓట్ల మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి గీతాంజలి గెలిచారు. గీతాంజలి బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తుందని ఆమె భర్తను ఉన్నతాధికారులు విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

### కొత్తగూడెంలో ఎగిరిన ఎర్రజెండా..

భద్రాద్రి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో అనూహ్య ఫలితం వెలువడింది. సీపీఐ పార్టీ కొత్తగూడెం కార్పొరేషన్‌ను కైవసం చేసుకుంది. కొత్తగూడెంలో మొత్తం 47 డివిజన్లు ఉండగా.. సీపీఐ 25, కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 4, బీజేపీ 1, సీపీఎం 1, ఇండిపెండెంట్ 2 అభ్యర్థులు విజయం సాధించారు. రాష్ట్రమంతా కాంగ్రెస్ హవా కొనసాగుతున్న తరుణంలో కొత్తగూడెంలో ఎర్రజెండా రెపరెపలు ఆడటం వామపక్ష శ్రేణులకు ఎక్కడలేని ఉత్సాహాన్ని ఇచ్చింది.

### కవితకు ఏఐఎఫ్‌బీ షాక్..

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జాగృతి అధ్యక్షురాలు కవితకు షాక్ ఇచ్చింది. కవిత మద్దతు ఇచ్చిన ఆ పార్టీ అభ్యర్థులు మొత్తం పది వార్డులకు ఎనిమిది చోట్ల సింహం గుర్తుపై గెలిచి సత్తా చాటారు. ఫలితాలు వెలువడ్డాకా ఏఐఎఫ్ బి నాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. వడ్డేపల్లిలో తమ గెలుపునకు జాగృతికి ఎలాంటి సంబంధం లేదన్నారు. తాము పార్టీ నుండి బీఫాం తీసుకోవడానికి వెళ్లినపుడు కవిత తమకు జాగృతి కండువా కప్పారన్నారు. అంతే తప్ప ఆమె తమకు మద్దతుగా ప్రచారానికి వచ్చింది లేదన్నారు. ప్రచారంలో ఆమె కండువా మేము వేసుకున్నది లేదని స్పష్టం చేశారు. ఆరోజు తర్వాత ఆమెతో తాము మాట్లాడనే లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదుగుతానని శపథం చేసిన కవిత తన పార్టీ ఇంకా సిద్ధంగా లేకపోవడంతో ఏఐఎఫ్‌బీ పార్టీకి మద్దతు తెలిపారు. దీంతో అక్కడ ఆ పార్టీ గెలుపొందగా జాగృతి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఇంతలో తమ పార్టీ గెలుపునకు కవితకు ఎలాంటి సంబంధం లేదని వడ్డేపల్లి శ్రీనివాస్ ప్లేట్ ఫిరాయించడం హాట్ టాపిక్ గా మారింది.

సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఓటర్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి షాక్ ఇచ్చి బీఆర్ఎస్ కు పట్టం కట్టారు. మొత్తం 39 వార్డులకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 27 స్థానాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్... మున్సిపల్ పీఠాన్ని దక్కించుకుంది. ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్ 6 స్థానాలకు, బీజేపీ 5 స్థానాలకు పరిమితం కాగా, ఒక చోట స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఫలితాలు వెలువడుతున్న కొద్దీ బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది, గులాబీ రంగుతో సిరిసిల్ల పట్టణం మెరిసిపోయింది.

సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ మున్సిపాలిటీలో 16వ వార్డు లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన తన భార్య విజయలక్ష్మీ ఓటమిని తట్టుకోలేక భర్త వెంకట్ రెడ్డి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆయన్ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించారు.

ఖమ్మం జిల్లా మధిరలో 10వ వార్డు కౌన్సిలర్‌గా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బోడేపూడి రేవతి విజయం సాధించారు

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కాంగ్రెస్ మహిళా అభ్యర్థి ఆందోళనకు దిగారు. కౌంటింగ్ కేంద్రంలో బీజేపీ అభ్యర్థి, మాజీ మేయర్ సునీల్‌రావు అధికారులను బెదిరిస్తున్నారని 38వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి దేశబోయిన హారిక ఆరోపించారు. 'తమ ప్రత్యర్థులైతే గెలవాలి.. మీ సంగతి చెబుతాను.. మీకు వాళ్లు ఏమైనా ఇచ్చారా..?' అంటూ సునీల్‌రావు బెదిరిస్తున్నారని కౌంటింగ్ కేంద్రం వద్ద ఆందోళన చేశారు. పోలీసులు కూడా మాజీ మేయర్‌కు వంత పాడుతున్నారని ఆరోపించారు. తాను 38వ డివిజన్‌లో గెలిచినా.. ఓడినా.. పర్వాలేదని, కానీ తన డివిజన్‌కు సంబంధించిన ప్రతి ఒక్క ఓటును మళ్లీ లెక్కించాలని ఆమె డిమాండ్ చేశారు.

# గులాబీ అంతర్మథనం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
బీఆర్ఎస్‌లో అంతర్మథనం మొదలైంది. మున్సిపల్ ఎన్నికల బాధ్యతలను స్థానిక లీడర్లకు అప్పగించడమే పెద్ద తప్పుగా మారింది. కీలక నేతలు కేటీఆర్, హరీశ్ రావు మినహా.. మిగిలిన నేతలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు చేతులేత్తేశారు. సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లల్లో మాత్రం బీఆర్ఎస్ గెలిచింది. మిగలిన చోట హంగ్ లేదంటే రెండో స్థానంలో నిలిచారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి కంచుకోటగా భావించే సూర్యాపేట మున్సిపాలిటీ లో బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైంది. కేవలం సూర్యాపేట లోనే కాకుండా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఏ ఒక్క మున్సిపాలిటీ దక్కలేదు. అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలతో నిత్యం వార్తల్లో ఉండే ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తన సొంత నియోజకవర్గమైన హుజూరాబాద్, జమ్మికుంటలో భంగపాటు తప్పలేదు. వరంగల్ జిల్లాలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రభావం కూడా ఈ ఎన్నికల్లో కనిపించలేదు. ఆయన నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. జనగామలో హంగ్ వచ్చింది. అలంపూర్ లో ఒక్క స్థానం కూడా గెలువలేదు. అటు కోరుట్లలో కాంగ్రెస్, మెట్ పల్లిలో హంగ్ వచ్చింది. హైదరాబాద్ శివారులోనే ఆ పార్టీ పరువు దక్కించుకుంది.

**బీఆర్ఎస్ కు ఇబ్బంది**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ కు ఇబ్బందికరంగా మారుతున్నాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్‌రావు తమ సొంత నియోజకవర్గాల్లో పట్టు నిలుపుకోగలిగినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర అగ్ర నేతలు, మాజీ మంత్రులు పార్టీని గెలిపించలేకపోయారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి కంచుకోటగా భావించే సూర్యాపేట మున్సిపాలిటీ లో బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైంది. గత ఎన్నికల్లో గెలిచిన గులాబీ పార్టీ, ఈసారి కనీస పోటీ ఇవ్వలేకపోయింది. కేవలం సూర్యాపేటలోనే కాకుండా, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఏ ఒక్క మున్సిపాలిటీ , కార్పొరేషన్‌లోనూ బీఆర్ఎస్ అధికారాన్ని దక్కించుకోలేకపోయింది. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయగా, జగదీష్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో పార్టీ క్యాడర్ డీలా పడిపోయింది.

**హుజూరాబాద్‌లో కౌశిక్ రెడ్డికి షాక్**

అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలతో నిత్యం వార్తల్లో ఉండే ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తన సొంత నియోజకవర్గమైన హుజూరాబాద్‌లో భంగపాటు తప్పలేదు. హుజూరాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యతతో విజయం సాధించింది. ఇక్కడ కౌశిక్ రెడ్డి పంతానికి పోయి చేసిన ప్రచారం పనిచేయలేదు. అటు జమ్మికుంట మున్సిపాలిటీలో కూడా బీఆర్ఎస్ వెనుకబడిపోయింది. నియోజకవర్గంలో పట్టు కోల్పోవడం కౌశిక్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**ఎర్రబెల్లి ఇలాకాలోనూ అదే పరిస్థితి**

వరంగల్ జిల్లాలో సీనియర్ నాయకుడైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రభావం కూడా ఈ ఎన్నికల్లో కనిపించలేదు. ఆయన నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. అధికార కాంగ్రెస్ గాలిని తట్టుకోవడంలో ఎర్రబెల్లి వ్యూహాలు ఫలించలేదు.

**సిట్టింగ్ ఎమ్మెల్యేల వైఫల్యం**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలలో మెజారిటీ నేతలు తమ సొంత నియోజకవర్గాల్లో మున్సిపాలిటీలను గెలిపించుకోలేకపోయారు. కేవలం కేటీఆర్, హరీష్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో మాత్రమే పార్టీ తన ఉనికిని చాటుకుంది. మున్సిపల్ ఫలితాల అనంతరం సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల్లో తిరగడం మానేసి, కేవలం విమర్శలకే పరిమితమైన నేతలకు ప్రజలు బుద్ధి చెప్పారు అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. పార్టీలోని అంతర్గత విభేదాలు, ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని విశ్లేషణలు వస్తున్నాయి.

# కాంగ్రెస్‌కు రెబల్స్ దెబ్బ

## క్యాంప్ రాజకీయాల్లో నేతలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష విజయాలు సాధించింది. కానీ కనీసం 34 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడుతోంది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. అధికార కాంగ్రెస్ పార్టీ మెజారిటీ మున్సిపాలిటీల్లో తన జెండా ఎగురవేసినప్పటికీ, సొంత పార్టీ రెబల్స్ రూపంలో గట్టి సవాలునే ఎదుర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30కి పైగా మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ హంగ్ మున్సిపాలిటీల్లో స్వతంత్రులుగా గెలిచిన కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులే కింగ్ మేకర్లుగా మారారు.

**కాంగ్రెస్ హవా.. కానీ రెబల్స్ సెగ**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏకపక్ష విజయాల దిశగా దూసుకెళ్లింది. అయితే, టికెట్ల కేటాయింపులో అసంతృప్తికి లోనై స్వతంత్రులుగా బరిలోకి దిగిన రెబల్ అభ్యర్థులు అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టించారు. ప్రధానంగా ఉమ్మడి నల్గొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని పలు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అధికారిక అభ్యర్థుల కంటే రెబల్ అభ్యర్థులకే ఓటర్లు పట్టం కట్టారు. దీంతో కాంగ్రెస్ గెలవాల్సిన అనేక మున్సిపాలిటీలు హంగ్‌గా మారాయి.

**హంగ్ మున్సిపాలిటీల్లో ఇండిపెండెంట్ల జోరు**

జనగామ, కోహిర్, కేసముద్రం, అలంపూర్ వంటి కీలక మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. ఇక్కడ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలంటే స్వతంత్ర అభ్యర్థుల మద్దతు తప్పనిసరి. గెలిచిన స్వతంత్రులలో అత్యధికులు కాంగ్రెస్ నుంచి వచ్చిన వారే కావడంతో, వారంతా తిరిగి అధికార పార్టీ గూటికి చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ పరిణామం వల్ల హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీలు కూడా అంతిమంగా అధికార పార్టీ ఖాతాలోకే వెళ్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**మజ్లిస్ మ్యాజిక్.. ముస్లిం ఓటు బ్యాంకులో పట్టు**

పాతబస్తీకే పరిమితం కాకుండా జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో కూడా మజ్లిస్ పార్టీ గణనీయమైన ప్రభావం చూపింది. మైనారిటీ ఓట్లు అధికంగా ఉన్న పట్టణాల్లో ఎంఐఎం అభ్యర్థులు చెప్పుకోదగ్గ స్థానాలను దక్కించుకున్నారు. కొన్ని చోట్ల కాంగ్రెస్, ఎంఐఎం కలిసి మున్సిపాలిటీ పాలకవర్గాన్ని దక్కించుకునే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల ఎంఐఎం కింగ్ మేకర్‌గా నిలిచే అవకాశం ఉంది.

**అధికార పార్టీ ఖాతాలోకి హంగ్ మున్సిపాలిటీలు**

హంగ్ ఏర్పడిన చోట స్వతంత్రుల బేరసారాలు అప్పుడే మొదలయ్యాయి. తమకు చైర్మన్ లేదా వైస్ చైర్మన్ పదవులు ఇస్తేనే మద్దతు ఇస్తామని కొందరు డిమాండ్ చేస్తున్నారు. అయితే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎక్స్–అఫీషియో ఓట్ల బలం తోడవనుండటంతో, హంగ్ మున్సిపాలిటీలను చేజిక్కించుకోవడం ఆ పార్టీకి పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. రెబల్ అభ్యర్థులను తిరిగి పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా మెజారిటీని సులభంగా సాధించవచ్చని కాంగ్రెస్ వ్యూహకర్తలు అంచనా వేస్తున్నారు.

**నియోజకవర్గాల్లో మారిన ముఖచిత్రం**

సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పట్టు నిరూపించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, పట్టణ ఓటర్లు ఈసారి భిన్నమైన తీర్పునిచ్చారు. బీఆర్ఎస్ అగ్రనేతల కోటలు బద్దలు కావడం, కాంగ్రెస్ లోని అంతర్గత విభేదాలు బయటపడటం ఈ ఎన్నికల ప్రత్యేకత. మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక ఫిబ్రవరి 16న జరగనుండటంతో, అప్పటి వరకు ఈ రాజకీయ ఉత్కంఠ కొనసాగే అవకాశం ఉంది.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

14.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (YSRCP)**

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలతో గ్రామీణ స్థాయిలో బలమైన పట్టు సాధించింది. ప్రతిపక్ష విమర్శల మధ్య కూడా తన ఓటు బ్యాంక్‌ను నిలుపుకునే ప్రయత్నం చేస్తోంది.

## రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు

- **రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు**
- **ప్రభుత్వం, వివిధ జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులకు చోటు**
- **కమిటీ చైర్మన్ గా శ్రీనివాస రెడ్డి**
- **కో-చైర్మన్‌గా ఐఅండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




రాష్ట్రంలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరు ప్రక్రియను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ సమాచార, పౌర సంబంధాల శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్, 2025 ప్రకారం ఈ కమిటీ పనిచేయనుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఈ కమిటీలో ప్రభుత్వం, వివిధ జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులకు చోటు కల్పించారు. కమిటీకి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. కోచైర్మన్‌గా సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఉంటారు. జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధుల నుంచి తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్ 9), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్ 143), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. బిగ్ డైలీ మీడియా సంస్థల ప్రతినిధులుగా ఈనాడు నుంచి ఎ. రంగారావు, సియాసత్ నుంచి అమీర్ అలీ ఖాన్, 'దిశ' డైలీ నుంచి బ్యూరో చీఫ్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి, పొద్దు నుంచి బైస రామదేవిలను సభ్యులుగా నియమించారు. ఎలక్ట్రానిక్ మీడియా వీ 6 నుంచి మురళీకృష్ణ, ఫోటో జర్నలిస్ట్స్ (డెక్కన్ క్రానికల్) నుంచి బి.హెచ్.కె.గాంధీ, వీడియో జర్నలిస్ట్స్ నుంచి బిగ్ టీవీ నాగేశ్వరరావు, మహిళా జర్నలిస్టులుగా ఎన్టీవీ నుంచి రాధిక, ది హిందూ నుంచి స్వాతి వడ్లమూడి, చివరగా డెస్క్ జర్నలిస్ట్స్ ప్రతినిధిగా ఆంధ్రజ్యోతి నుంచి బి.శ్రీనివాస్ రావు వ్యవహరించనున్నారు.

**ఇతర కీలక సభ్యులు, బాధ్యతలు**

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు, టీజీఆర్టీసీ ప్రతినిధి, దక్షిణ మధ్య రైల్వే ప్రతినిధి కూడా ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఐ అండ్ పీఆర్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. అర్హులైన జర్నలిస్టుల దరఖాస్తులను పరిశీలించి అక్రిడిటేషన్ కార్డులను జారీ చేసే బాధ్యతను ఈ కమిటీ నిర్వహిస్తుంది. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలకు ఆమోదం తెలిపే అధికారాన్ని ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్‌కు ప్రభుత్వం అప్పగించింది.

## ప్రజాపాలనకే ప్రజల ఓటు

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ముద్ర, ఖమ్మం :**



మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల ఫలితాలు ప్రజాపాలనకు ప్రజలు పట్టం కట్టిన తీర్పు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్రం మొత్తం వ్యక్తమైన ఈ ఆదరణ రానున్న మార్పుకు సంకేతమని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా.. వారి అభిమానాన్ని వమ్ము కానివ్వకుండా మరింత బాధ్యతతో, మరింత కట్టుబాటుతో పనిచేస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం విడుదలైన 'పుర' ఫలితాలపై ఆయన ఖమ్మంలో మీడియా ప్రకటన విడుదల చేశారు. నమ్మకం, విశ్వాసం ఉన్నప్పుడు అది ఆదరణగా మారుతుందని ప్రజలు మరోసారి నిరూపించారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లుగా విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు వంటి కీలక రంగాల్లో సాధికారత లక్ష్యంగా అవిశ్రాంతంగా పనిచేస్తోందన్నారు. ఈ గెలుపు ఆ కృషికి లభించిన గౌరవమన్నారు. నిష్కల్మష నాయకత్వం, పారదర్శక పరిపాలన, సమష్టి కృషే ఈ విజయానికి పునాదులని చెప్పారు. ఈ ఎన్నికల్లో కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా శ్రమించారన్న భట్టి... ప్రజలు అభివృద్ధికి మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. మధిర నియోజకవర్గం తనకు రాజకీయ ప్రస్థానం మాత్రమే కాదన్న భట్టి.. తన ప్రాణం అన్నారు. మధిర ప్రజలు చూపించిన అపారమైన ప్రేమ, అచంచలమైన విశ్వాసం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ ఎన్నికల్లో 22 స్థానాల్లో 21 స్థానాల్లో అఖండ విజయాన్ని అందించిందని చెప్పారు. ఈ విజయాన్ని మరింత బాధ్యతగా స్వీకరిస్తున్నట్లు తెలిపారు.



## ప్రియాంక గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- **మున్సిపల్ ఎన్నికల్లో గెలుపుపై సీఎంకు ప్రియాంక అభినందనలు**

**ముద్ర, ఢిల్లీ:**

ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల పైన చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఆమె అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నందున కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం కట్టబెట్టారని రేవంత్ రెడ్డి ప్రియాంక గాంధీకి వివరించారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు గట్టిపోటీ ఇచ్చాం

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**
- **జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఊహించని షాక్ ఇవ్వబోతున్నాం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గట్టి పోటీనిచ్చామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వెల్లడించారు. గత మున్సిపల్ ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తమను గుర్తించారని చెప్పారు.. కొన్నిచోట్ల స్వల్ప మెజారిటీతో ఓడిపోయామని, సంస్థాగతంగా బీజేపీ బలపడటం సంతోషకరమన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందన్న రాంచందర్ రావు.. బీజేపీ ఓటు షేర్ భారీగా పెరిగిందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా బీజేపీ ప్రభావం ఉండబోతోందని జోస్యం చెప్పారు. జనసేన పార్టీతో పొత్తుపై తాము ఇంకా ఏమీ నిర్ణయించుకోలేదన్నారు. అనారోగ్యంతోనే పవన్ కల్యాణ్ ప్రచారానికి రాలేకపోయారని రాంచందర్ రావు వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనన్న విమర్శలను కొట్టిపారేస్తూ.. మైనారిటీ ఓట్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ వైపు మళ్లాయని, బీజేపీ ఒంటరిగానే పోరాడుతుందని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ కు కారే ప్రత్యామ్నాయం

- **పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు**
- **ఇదే ఉత్సాహంతో జడ్పీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తలబడతాం**
- **పోరాడిన బీఆర్ఎస్ కార్యకర్తలకు ధన్యవాదాలు**
- **కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధం**
- **గద్వాలలో ఒక్క ఓటుతో గెలిచాం**
- **మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ మాత్రమేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఇది తేలిపోయిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ కు తామే ప్రత్యామ్నాయం అని గొప్పలు చెప్పుకున్న బీజేపీ పుర ఫలితాల్లో ఘోరపరాజయం పాలైందన్నారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. ఈ ఎన్నికల్లో ఆశించిన మేరకు మంచి ఫలితాలు సాధించామని చెప్పారు. తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని పల్లె, పట్టణ ప్రజలు తేల్చారన్నారు. ఈ ఎన్నికల్లో సాధించిన ఉత్సాహంతోనే రాబోయే జడ్పీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తలబడతామన్నారు. ఈ ఎన్నికల్లో వీరోచితంగా పోరాడిన బీఆర్ఎస్ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. 15 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ స్పష్టమైన గెలుపొందామని, మరో 30 స్థానాల్లో హంగ్ ఉందని వీటిల్లో ఎలా వ్యవహరించాలనేది స్థానిక నేతల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గద్వాలలో నాలుగు సార్లు రీకౌంటింగ్ చేసి చివరికి ఒక్క ఓటుతో గెలిచామన్నారు. ఈ ఎన్నికల్లో చాలా చోట్ల కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు.

**సీపీఐకి ఓపెన్ ఆఫర్:**

కొత్తగూడెం కార్పొరేషన్‌లో హంగ్ పరిస్థితి ఏర్పడటంతో ఇక్కడ మేయర్ సీటు కోసం సీపీఐకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని కేటీఆర్ చెప్పారు. సింగరేణి లో జరిగిన బొగ్గుకుంభకోణాన్ని తాము భయటపెట్టాక పెద్దపల్లి జిల్లా క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు సీపీఐ బహిరంగంగా మద్దతు ఇచ్చిందన్నారు. దాంతో కొత్తగూడెంలో సీపీఐకి తాము మద్దతు ఇచ్చేందుకు సిద్ధమేనన్నారు. ఈ విషయాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో సైతం మాట్లాడానన్నారు. కాంగ్రెస్, బీజేపీని నిలువరించడం కోసం ఈ నిర్ణయంతో ఉన్నామని కేటీఆర్ ప్రకటించారు. మరోవైపు కొత్తగూడెంలో 60 డివిజన్లు ఉంటే కాంగ్రెస్, సీపీఐ చెరో 22 స్థానాల్లో గెలిచాయి. మిగతా చోట్ల బీఆర్ఎస్ 8, బీజేపీ 1, సీపీఎం 1, స్వతంత్రులు ఆరు చోట్ల గెలుపొందారు. ఇక్కడ కూనంనేని, ఎంపీ రఘురామిరెడ్డి ఇద్దరికీ చెరో ఎక్స్ అఫీషియోతో ఉపయోగించుకున్నా హంగ్ పరిస్థితే ఉంది. ఇప్పుడు బీఆర్ఎస్ ఆఫర్ తో సీపీఐ కోర్టులో బంతి ఉంది. అయితే ఇక్కడ బీఆర్ఎస్ ఆఫర్ ను సీపీఐ అంగీకరిస్తే తెలంగాణ రాజకీయాల్లో ఇదో సరికొత్త సమీకరణంగా మారుతుంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి సీపీఐ కాంగ్రెస్ తో పొత్తు లేదా ఫ్రెండ్లీ పోటీలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు బీఆర్ఎస్ తో జత కడితే ఇది ఆసక్తికర పరిణామంగా మారనుంది.

## భారీ మెజారిటీ రావడం ఇదే మొదటిసారి

- **భట్టి, పొంగులేటి**

**ముద్ర, ఖమ్మం:**



మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించిన పట్టణ ప్రాంత ఓటర్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను విశ్వసించారన్నందుకు ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు గాలి కబుర్లు, కట్టు కథలు, ఉన్నది లేనట్టు లేనిది లేనట్టు ప్రచారం చేశాయని విమర్శించారు. అన్ని అంశాలు గమనించిన ప్రజలు.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించారని వివరించారు. ఈ గెలుపుతో తమ ప్రభుత్వంపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. 116 మున్సిపాలిటీల్లో 83 చోట్ల స్పష్టమైన ఆధిక్యంతో కాంగ్రెస్ పార్టీ ముందుందన్నారు. స్వతంత్ర అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నట్లు వెల్లడించారు. సంపూర్ణ సమాచారంతో 90 నుంచి 94 స్థానాలు గెలువబోతున్నామని, గత రెండు.. మూడు దశాబ్దాల్లో ఇంత భారీ మెజారిటీ రావడం ఇదే మొదటిసారి అని ఆనందం వ్యక్తం చేశారు. ఐదు నగర పాలక సంస్థల్లో తాము గెలిచామన్న భట్టి, పొంగులేటి.. రెండు కార్పొరేషన్లలో హంగ్ ఏర్పడినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

## ఆ నాలుగు మున్సిపాలిటీల్లో ఖాతా తెరవని బీఆర్ఎస్

**ముద్ర, తెలంగాణ:**

తెలంగాణలో వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో భారత రాష్ట్ర సమితి 13 పురపాలికలతో సరిపెట్టుకుంది. కోస్గి, మక్తల్, ధర్మపురి, భైంసా మున్సిపాలిటీల్లో ఆ పార్టీ ఖాతా తెరవలేదు. ధర్మపురిలో మొత్తం 15 వార్డులు ఉండగా.. అన్నింటినీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కోస్గిలో 16 స్థానాలు ఉండగా మొత్తం కాంగ్రెస్ ఖాతాలోనే పడ్డాయి.

**13 మున్సిపాలిటీల్లో సింగిల్ డిజిట్**

ఎల్లారెడ్డి, యాదగిరిగుట్ట, వడ్డేపల్లి, సుల్తానాబాద్, పెద్దపల్లి, నందికొండ, మంథని, మధిర, కొడంగల్, హాలియా, చొప్పదండి, భూత్పూర్, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డులో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. 116 మున్సిపాలిటీల్లోని 2,582 వార్డుల్లో శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో కాంగ్రెస్ 1347 వార్డుల్లో విజయం సాధించి 66 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. భారత రాష్ట్ర సమితి 717 వార్డుల్లో గెలుపొంది 13 మున్సిపాలిటీలు దక్కించుకుంది. భాజపా 261 వార్డుల్లో, స్వతంత్రులు 256 వార్డుల్లో విజయం సాధించారు. 36 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ కైవసం చేసుకోవడం గమనార్హం. జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి మద్దతుదారులు స్వతంత్రులుగా పోటీ చేసి అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు.

## వాళ్ల పాచిక పారలేదు..

- **హైదరాబాద్ పై కాషాయ జెండా ఎగరేస్తాం**
- **ఒవైసీ కోసమే జీహెచ్ఎంసీని ముక్కలు**
- **కరీంనగర్ పై బీజేపీ జెండా ఎగరేశాం**

**ముద్ర, కరీంనగర్:**



బీజేపీని ఓడించాలని చేసిన వారి పాచికలు పారలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈరోజు నాకు పట్టలేని సంతోషం ఉందని, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుమ్మక్కై ఎన్నో కుట్రలు చేసిందని అన్నారు. ఓటుకు రూ.7 వేలు ఇచ్చి ప్రలోభ పెట్టేదుకు అనేక కుట్రలు చేసినప్పటికీ వారి పాచిక పారలేదని అన్నారు. అయినా సీఎం రేవంత్ రెడ్డి, ఆయన బడే భాయ్ ఎంఐఎం ఓవైసీ బ్రదర్స్ ను పిలిచి రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా ప్రజలు నమ్మ లేదని గుర్తు చేశారు. తెలంగాణలో తొలిసారి కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేసి రికార్డు సృష్టించాంమని అన్నారు. ''ఒవైసీ కళ్లల్లో ఆనందం చూసేందుకు రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేసి ఒక ముక్క ఒవైసీకి రాసిచ్చారని ఆరోపించారు. అదే రేవంత్ రెడ్డి పాలిట మరణ శాసనం కాబోతోందని అన్నారు. హైదరాబాద్ తోపాటు సైబరాబాద్, మల్కాజ్ గిరి కార్పొరేషన్లపై కాషాయ జెండా ఎగరేయబోతున్నం. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా? అని ఎదురు చూస్తున్నాం''అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావుసహా స్థానిక బీజేపీ నేతలతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండాను ఎగరేయడం చాలా గొప్ప విషయం అని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుమ్మక్కై ఎన్నో కుట్రలు చేసిందని అన్నారు.

**66 డివిజన్లలో 31 గెలిచాం**

కరీంనగర్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కుమ్మక్కై ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంచినా బీజేపీ గెలుపును అడ్డుకోలేకపోయారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లోని చొప్పదండిలో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారన్న కేంద్రమంత్రి... ఎంఐఎం బాస్ అసదొద్దీన్ కూడా వచ్చి వెళ్లారన్నారు. మహామహులు ప్రచారం చేసినా కార్పొరేషన్ ను టచ్ చేయలేకపోయారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకోవడం పట్టలేని సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఈ అద్భుత అవకాశాన్ని ఇచ్చిన ఓటర్లకు కృతజ్ఞతలు చెప్పారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిపైనే పోరాటం చేశామన్న ఆయన విజయం సాధించామని చెప్పారు. కార్పొరేషన్ లో మొత్తం 66 డివిజన్లలో 31 గెలిచామనీ మద్దతు ఇవ్వడానికి మరో ముగ్గురు ఇండిపెండెంట్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అభివృద్ధి కోసం మీతో కలిసి వస్తామని మరో ముగ్గురు తమను సంప్రదించారని చెప్పారు. ఓటర్లు ఇచ్చిన తీర్పుతో కరీంనగర్‌ను అత్యంత అద్భుతంగా అభివృద్ధి చేస్తామని బండి సంజయ్ తెలిపారు.

## కొత్తగూడెంలో కార్పొరేటర్ కిడ్నాప్ కలకలం

**ముద్ర, కొత్తగూడెం:**

కొత్తగూడెంలో బీఆర్ఎస్ పార్టీ తరపున గెల్చిన 32వ డివిజన్ కార్పొరేటర్ గుగులోత్ రాంబాబును ఓ ప్రధాన రాజకీయ పార్టీ కిడ్నాప్ చేసిందనే ప్రచారం కలకలానికి దారి తీసింది. ఈ ఘటనను నిరసిస్తూ మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ధర్నాకు దిగారు. కిడ్నాప్ చేసిన తమ పార్టీ కార్పొరేటర్ ను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా కొత్తగూడెంలో గెల్చిన తమ పార్టీ కార్పొరేటర్లను కాంగ్రెస్, సీపీఐ పార్టీలు క్యాంపులకు తరలిస్తున్నాయి. సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మధ్య కొత్తగూడెంలో స్నేహపూర్వక పోటీ జరిగిందని మంత్రి పొంగులేటి ప్రకటించడం, తమ పార్టీతో చర్చించి కాంగ్రెస్ తో కలిసే అంశంపై నిర్ణయం తీసుకుంటామని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించిన పరిణామాల్లోనే ఇరు పార్టీల నాయకులు వేర్వేరుగా క్యాంపు రాజకీయాలకు తెరలేపడం గమనార్హం.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 14.02.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# పెచ్చరిల్లుతున్న గుట్కా మాఫియా...!

**- గుట్కా మాఫియాకు స్వేచ్ఛ**

తెలంగాణ సమాజం నేడు ఎదుర్కొంటున్న అనేక నిశ్శబ్ద దోపిడీల్లో ఒకటి సిగరెట్లు, గుట్కా, పాన్ మసాలా వ్యాపారం. ఇది కేవలం వ్యసన వ్యాపారం కాదు. ఇది ఒక సమాంతర ఆర్థిక సామ్రాజ్యం. ఇది ప్రజల ఆరోగ్యాన్ని మింగేస్తున్న క్యాన్సర్‌లాంటి దందా. ఇది ప్రభుత్వ వ్యవస్థల బలహీనతను బయటపెడుతున్న బహిరంగ సాక్ష్యం. ఇది రాజకీయ నాయకుల మౌన సహకారాన్ని ప్రశ్నిస్తున్న అద్దం. ఇది పోలీసు యంత్రాంగం చేతులెత్తేసినట్టు చెప్పే నిజం.

ఈ వ్యాపారం కోట్ల రూపాయల టర్నోవర్‌తో నడుస్తోంది. గ్రామాల నుంచి మహానగరాల వరకూ ప్రతి వీధిలో, ప్రతి మూలలో, ప్రతి బస్టాప్ వద్ద గుట్కా, పాన్ మసాలా విక్రయ కేంద్రాలు దర్శనమిస్తాయి. చట్టపరంగా నిషేధం ఉన్నప్పటికీ, అమలులో మాత్రం అది అస్తిత్వమే లేనట్టు వ్యవహరిస్తున్నారు. చిన్నపిల్లల చేతుల్లో గుట్కా ప్యాకెట్లు, యువత నోట్లో పాన్ మసాలా, వృద్ధుల దగ్గర సిగరెట్లు,ఇవి తెలంగాణ సమాజానికి అలవాటైన దృశ్యాలుగా మారిపోయాయి.

గుట్కా, పాన్ మసాలా వినియోగం వల్ల నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు విపరీతంగా పెరుగుతున్నాయి. పేద ప్రజలు తమ కష్టార్జితాన్ని ఈ వ్యసనాల కోసం ఖర్చు చేసి, చివరికి ఆస్పత్రుల చుట్టూ తిరిగే దుస్థితి ఎదుర్కొంటున్నారు. కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయి. ఆరోగ్య భీమా లేని సామాన్యుడు చికిత్స ఖర్చులతోనే జీవితాన్ని కోల్పోతున్నాడు.

ఇంత ఘోరమైన పరిస్థితి ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నాయి. రాజకీయ నాయకులు పన్నుల పేరుతో ఆదాయాన్ని చూసి మౌనంగా ఉండటం, అధికార యంత్రాంగం లంచాల వలలో చిక్కుకోవడం, పోలీసు శాఖ చేతులెత్తేయడం,ఇవి అన్నీ ఈ దందాకు ఊతమిస్తున్నాయి. అక్రమ సరుకు రవాణా, స్మగ్లింగ్, మాఫియా నెట్‌వర్క్‌లు ప్రభుత్వ కళ్లముందే పనిచేస్తున్నాయి.

ఈ వ్యాపారం కేవలం వ్యక్తిగత వ్యసన సమస్య కాదు, ఇది ఒక సామాజిక, రాజకీయ, నైతిక సంక్షోభం. ప్రజల ఆరోగ్యంపై దాడి చేస్తున్న ఈ వ్యాపారంపై ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేయాలి, నిషేధాన్ని కచ్చితంగా అమలు చేయాలి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. లేకపోతే, తెలంగాణ సమాజం ఈ నిశ్శబ్ద దోపిడీలో నెమ్మదిగా కానీ నిర్దయగా నాశనమవుతూనే ఉంటుంది. ఇక

కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో పొగాకు ఉత్పత్తులపై పన్నులు పెంచిన వెంటనే, ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నట్లు ప్రచారం జరిగింది. "సిగరెట్, గుట్కా, పొగాకు వంటివి ఖరీదైనవిగా చేస్తే ప్రజలు వినియోగం తగ్గిస్తారు" అన్నదే ప్రభుత్వ వాదన. కానీ వాస్తవంలో ఈ పన్ను పెంపు ప్రజారోగ్యానికి కంటే మాఫియా దందాలకు కొత్త అవకాశంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉదాహరణకు, ప్రముఖ సిగరెట్ కంపెనీ వంటి సిగరెట్ ప్యాకెట్లు 10 సిగరెట్లకు గరిష్ఠంగా 170 రూపాయలు ఉండాల్సిన చోట, కొందరు వ్యాపారులు 220, 230, 240 రూపాయలకు విక్రయిస్తున్నారు. పాత స్టాక్‌ను కొత్త ధరల పేరిట అమ్ముతూ ఒక్క ప్యాకెట్‌పై 50 నుంచి 70 రూపాయల వరకు అక్రమ లాభం దోచుకుంటున్నారు. వినియోగదారుడికి కొత్త పన్ను పెంపు అర్థం కాక, "ఇది ప్రభుత్వ ధరే" అని భావించి అదనపు డబ్బు చెల్లిస్తున్నాడు.

ఇది ఒక రకంగా నల్లబజారు వ్యవస్థను బలపరుస్తోంది. ప్రభుత్వం పన్నులు పెంచినా, వాటిని పర్యవేక్షించే వ్యవస్థలు బలహీనంగా ఉండటంతో వ్యాపారులు ఇష్టారీతిన ధరలు నిర్ణయిస్తున్నారు. చట్టపరంగా MRP కంటే ఎక్కువ ధరకు అమ్మడం నేరం అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో, బస్టాండ్లు, హైవే దుకాణాల్లో ఈ నిబంధనలను ఎవరూ పట్టించుకోవడం లేదు. వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన అధికారులు నిశ్శబ్దంగా ఉన్నారు.

పన్ను పెంపు లక్ష్యం ఆరోగ్య పరిరక్షణ అయితే, ధరల నియంత్రణతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలి. కానీ ప్రభుత్వం ధరలను మాత్రమే పెంచి, మిగిలిన బాధ్యతను మార్కెట్ చేతుల్లో వదిలేసింది. ఫలితంగా ప్రభుత్వానికి పన్ను ఆదాయం పెరుగుతుండగా, వ్యాపారులకు అక్రమ లాభాలు దక్కుతున్నాయి. బాధితుడు మాత్రం సామాన్యుడు.

కాబట్టి, పొగాకు ఉత్పత్తులపై పన్నులు పెంచడం మాత్రమే కాదు, వాటి విక్రయంపై కఠిన నియంత్రణ, తరచు తనిఖీలు, MRP అమలు, వినియోగదారుల ఫిర్యాదు వ్యవస్థ బలపరచడం అత్యవసరం. లేకపోతే "ఆరోగ్య పరిరక్షణ" పేరుతో తీసుకున్న బడ్జెట్ నిర్ణయం, ప్రజలపై దోపిడీకి చట్టబద్ధ ముసుగుగా మారుతూనే ఉంటుంది.

ఒక్క షాపులోనే రోజుకు 100 ప్యాకెట్లు అమ్మితే 7,000 రూపాయల అక్రమ లాభం. నెలకు లక్షల రూపాయలు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది షాపులు, హోల్‌సేలర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఉంటే, ఇది వేల కోట్ల రూపాయల అక్రమ ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. ఈ దందా ఎక్కడి వరకు విస్తరించిందో, ఎవరి జేబుల్లోకి డబ్బులు వెళ్తున్నాయో, ప్రభుత్వానికి ఎంత పన్ను నష్టం జరుగుతోందో ఎవరికీ తెలియదు. తెలియకపోవడం ప్రభుత్వానికి అనుకూలం. తెలిసినా చర్యలు తీసుకోకపోవడం నేరం.

తెలంగాణ ప్రభుత్వం ప్రజల ముందు ప్రశ్నకు సమాధానం చెప్పాలి. సిగరెట్లు, గుట్కా ధరలు ఎందుకు నియంత్రణలో లేవు? అక్రమ ధరలు వసూలు చేస్తున్న వ్యాపారులపై ఎందుకు కేసులు నమోదు కావడం లేదు? గుట్కాపై నిషేధం ఉన్నా ఎందుకు రాష్ట్రంలో దొరుకుతోంది? ట్రక్కుల ద్వారా అక్రమంగా దిగుమతి అవుతున్న నిల్వలను పోలీసులు ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు? మాఫియా




నేతలు ఎందుకు అరెస్టు కావడం లేదు? చిన్న పాన్ షాపు వాడే బలి అవుతున్నాడు, కానీ పెద్ద మాఫియా రాజులు మాత్రం చట్టానికి అందని ఎత్తుల్లో ఉన్నారు. ఇది పాలనా వైఫల్యమా, లేక పాలనలో భాగస్వామ్యమా?

సిగరెట్లు, గుట్కా వ్యాపారం అనేది భారతదేశంలో బిలియన్ల రూపాయల పరిశ్రమ. చట్టబద్ధమైన కంపెనీలు పన్నులు చెల్లిస్తాయి. ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం వస్తుంది. కానీ అదే సమయంలో నకిలీ ఉత్పత్తులు, అక్రమ దిగుమతులు, పన్ను ఎగ్గొట్టే నెట్‌వర్క్‌లు ప్రభుత్వాన్ని దోచుకుంటున్నాయి. ఈ డబ్బు రాజకీయ ఫండింగ్‌కు, నేరాలకు, అవినీతికి, మాఫియా సామ్రాజ్యాలకు ఉపయోగపడుతుంది. ప్రజల డబ్బు ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తూ, ప్రజలే పన్నులు చెల్లిస్తూ, మాఫియా జేబులు నింపుతున్న విచిత్ర వ్యవస్థ ఇది.

తెలంగాణలో గుట్కా, ఖైనీ, జర్దా వంటి ఉత్పత్తులపై నిషేధం ఉందని ప్రభుత్వం చెబుతుంది. కానీ ప్రతి పాన్ షాపులో అవే ఉత్పత్తులు కనిపిస్తాయి. పోలీసులు అప్పుడప్పుడు దాడులు చేస్తారు, కొన్ని సీజ్‌లు, కొన్ని అరెస్టులు. కానీ ఇవన్నీ నాటకీయ ప్రదర్శనలు మాత్రమే. అసలు మాఫియా నెట్‌వర్క్‌ను తాకే ధైర్యం ఎవరికి లేదు. ఎందుకంటే మాఫియా వెనుక రాజకీయ, మరియు పోలీస్ బాసుల రక్షణ ఉందనే ప్రజల నమ్మకం బలంగా ఉంది.

రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తారు. ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లు, మాఫియా – ఇదే అసలు వాస్తవం. గుట్కా, సిగరెట్ల మాఫియా రాజకీయాలకు నిధులు ఇస్తుందనే ఆరోపణలు కొత్తవి కాదు. ఈ నేపథ్యంలో, ఈ అక్రమ వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకుంటే రాజకీయ నిధుల మార్గాలు మూసుకుపోతాయనే భయం ఉందా? ప్రజల ఆరోగ్యం కన్నా రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా?వినియోగదారుడు ఇక్కడ రెండు విధాలుగా దోపిడీకి గురవుతున్నాడు. ఒకవైపు సిగరెట్లు, గుట్కా వల్ల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం. నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు.. ఇవన్నీ పొగాకు ఉత్పత్తుల ప్రత్యక్ష ఫలితాలు. మరోవైపు అక్రమ ధరలతో జేబు చిల్లు అవుతోంది. పేద కూలీ, డ్రైవర్, చిన్న ఉద్యోగి, యువత తమ కష్టార్జితాన్ని ఈ వ్యసనాలపై ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం ఒకవైపు ఆరోగ్య పన్నులు పెంచి ప్రజల్ని రక్షిస్తున్నట్టు చెప్పుకుంటూ, మరోవైపు మాఫియా ప్రజల్ని దోచుకుంటుంటే మౌనంగా ఉంది.ప్రభుత్వానికి వచ్చే పన్నుల గురించి మాట్లాడితే, పొగాకు ఉత్పత్తులపై వసూలు చేసే పన్నులు నిజంగా ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడుతున్నాయా అనే ప్రశ్న తలెత్తుతుంది. ఆ డబ్బును వ్యసన నివారణ, క్యాన్సర్ చికిత్స, అవగాహన కార్యక్రమాలకు కేటాయిస్తున్నారా? లేక సాధారణ బడ్జెట్‌లో కలిపి ఇతర ఖర్చులకు వినియోగిస్తున్నారా? ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేసే ఉత్పత్తుల నుంచి వచ్చిన డబ్బు ప్రజల ఆరోగ్యానికి ఖర్చు కాకపోతే, అది నైతికంగా ప్రభుత్వంపై పెద్ద మచ్చ.

సిగరెట్లు, గుట్కా మాఫియా ఒక సమాంతర ఆర్థిక వ్యవస్థను సృష్టిస్తోంది. ఇది అధికారిక ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది. పన్నులు ఎగ్గొట్టడం వల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గుతోంది. అదే సమయంలో అక్రమ సంపద పెరుగుతోంది. ఈ సంపద నేరాలకు, అవినీతికి, రాజకీయ మలినానికి ఉపయోగపడుతుంది. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదం.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజల సేవకుడు. ప్రజల ఆరోగ్యం, ఆర్థిక భద్రత, వినియోగదారుల హక్కులు కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత. సిగరెట్లు, గుట్కా మాఫియా ప్రజల్ని దోచుకుంటుంటే ప్రభుత్వం మౌనంగా ఉండటం ప్రజాస్వామ్యానికి చేసిన ఘోర ద్రోహం. ఇది పాలనా వైఫల్యం కాదు, పాలనా నేరం.

సిగరెట్లు, గుట్కా, పాన్ మసాలా అక్రమ వ్యాపారం ఒక చిన్న అంశం కాదు. ఇది తెలంగాణ పాలనకు లిట్మస్ టెస్ట్. ప్రజల పక్షాన ప్రభుత్వం నిలబడుతుందా? లేక అక్రమ దారుల పక్షాన మౌనంగా ఉంటుందా? ఈ ప్రశ్నకు సమాధానం ప్రజలు కోరుతున్నారు. సమాధానం రాకపోతే ప్రజలే సమాధానం చెప్పే రోజు వస్తుంది .

**తెలంగాణ ప్రభుత్వం తక్షణం**

**కఠిన చర్యలు తీసుకోవాలి**

సిగరెట్లు, గుట్కా ధరలపై నియంత్రణ విధానాలు అమలు చేయాలి. అక్రమ ధరలు వసూలు చేసే వ్యాపారులపై కేసులు నమోదు చేయాలి. అక్రమ నిల్వలపై ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి. మాఫియా నేతలను అరెస్టు చేయాలి. వారికి రక్షణ కల్పిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి. రాజకీయ నాయకుల పాత్రపై స్వతంత్ర విచారణ జరపాలి.

**ప్రజలు కూడా మౌనంగా ఉండకూడదు.**

వినియోగదారుడు కేవలం కొనుగోలుదారు కాదు, ప్రజాస్వామ్యంలో ఒక శక్తివంతమైన పౌరుడు. అధిక ధరలు, నకిలీ ఉత్పత్తులు, అక్రమ వ్యాపారం పై ప్రశ్నించడం అతని హక్కు. మీడియా ఈ అంశంపై మౌనాన్ని విడిచిపెట్టి పరిశోధనాత్మక కథనాలు చేయాలి. సామాజిక సంస్థలు, పౌర సమాజం ఉద్యమించాలి.తెలంగాణ సమాజం ఎన్నో ఉద్యమాలతో రాష్ట్రాన్ని సాధించింది. ప్రజల ఆత్మగౌరవం ఈ రాష్ట్రానికి పునాది. ఆ ఆత్మగౌరవాన్ని మాఫియా దోపిడీకి, ప్రభుత్వ మౌనానికి బలి చేయలేం. ప్రజల జేబు, ప్రజల ఆరోగ్యం, ప్రజల గౌరవం – ఇవన్నీ కాపాడటం ప్రభుత్వ ధర్మం. ఆ ధర్మం విస్మరించబడితే ప్రజల ప్రశ్న మరింత గట్టిగా మారుతుంది. ప్రజల కోపం ప్రజాస్వామ్య రాజకీయాలను కదిలిస్తుంది.

**మన్నారం నాగరాజు**
- సామాజిక రాజకీయ విశ్లేషకులు.



## తెలంగాణ తీర్పు.. దేశానికే ఓ సందేశం




తెలంగాణ రాజకీయాల్లో మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడూ కీలక మలుపులు తిప్పుతుంటాయి. సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికలు ఒక విధమైన రాజకీయ ఆధిపత్యాన్ని ప్రతిబింబిస్తే, తాజాగా జరిగిన ఎన్నికలు ప్రజాస్వామ్య విలువలను మరోసారి చాటిచెప్పాయి. ఐదు సంవత్సరాల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో అధికారంలో ఉన్న గులాబీ పార్టీ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. అప్పట్లో పార్టీ కీలక నాయకత్వం ఎన్నికల నిబంధనల్లో మార్పులు చేసి, తమకు అనుకూలంగా వాతావరణాన్ని సృష్టించిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఆ ఎన్నికల్లో గులాబీ పార్టీ భారీ విజయం సాధించింది. ప్రతిపక్షంగా నిలిచిన కాంగ్రెస్ గెలిచిన కొన్ని చోట్ల కూడా ఆర్థిక బలం, రాజకీయ వ్యూహాలతో బలహీనపరిచినట్లు ఆరోపణలు వచ్చాయి. క్యాంపు రాజకీయాలు, అభ్యర్థుల అపహరణ వంటి ఘటనలు అప్పటి రాజకీయ వాతావరణాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ప్రజాస్వామ్యంపై ప్రశ్నలు లేవనెత్తిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పుడు సీన్ పూర్తిగా మారింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన మున్సిపల్ ఎన్నికలు భిన్నమైన దృశ్యాన్ని చూపించాయి. ఇది ఎవరి భజన కోసం కాదు, విమర్శల కోసం కూడా కాదు. బాధ్యత గల మీడియాగా ప్రజలకు నిజమైన చిత్రాన్ని అందించడం మా బాధ్యత. ఈసారి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అధికారం దుర్వినియోగం చేసిందనే విమర్శలు పెద్దగా వినిపించలేదు. ముఖ్యమంత్రి స్వయంగా ప్రజలకు "మీకు మంచి చేసే వారిని ఎన్నుకోండి" అని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను పరిష్కరించే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు.

తెలంగాణ ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు. ఎవరు మంచిగా పని చేస్తే వారిని గౌరవిస్తారు, తప్పు చేస్తే నిర్భయంగా తిరస్కరిస్తారు. ఈ స్వభావం ఈ ఎన్నికల్లో మరింత స్పష్టంగా కనిపించింది. అధికార కాంగ్రెస్ పార్టీకి మంచి స్థానం ఇచ్చారు. బీజేపీకి బలం చేకూర్చారు. గులాబీ పార్టీకి పునర్జీవం ఇచ్చారు. ఇతర పార్టీలకు కూడా గౌరవప్రదమైన ప్రాతినిధ్యం కల్పించారు. ఎవరినీ పూర్తిగా తిరస్కరించలేదు, ఎవరినీ పూర్తిగా ఎత్తిపోసుకోలేదు. సమతుల్యతతో తీర్పు ఇచ్చారు.ఈసారి చాలా మున్సిపాలిటీల్లో హంగ్ ఫలితాలు రావడం గమనార్హం. ఇది ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందనే సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకే పార్టీకి పూర్తి ఆధిపత్యం ఇవ్వకుండా, సమతుల్య శక్తి సమీకరణాన్ని ప్రజలు ఏర్పరిచారు. ఈ ధోరణి 2023 అసెంబ్లీ ఎన్నికలలో కూడా కనిపించింది. కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని అప్పగించినప్పటికీ, భారీ మెజారిటీ ఇవ్వలేదు. అదే సమయంలో గులాబీ పార్టీని పూర్తిగా పక్కన పెట్టలేదు. ప్రతిపక్షాన్ని గౌరవంగా నిలబెట్టారు.

తెలంగాణలో తాజా మున్సిపల్ ఎన్నికలు ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉందో మరోసారి నిరూపించాయి. అధికారానికి నియంత్రణ, ప్రతిపక్షానికి గౌరవం, ప్రజలకు నిర్ణయాధికారం ఈ మూడు విలువలను తెలంగాణ ఓటర్లు సమర్థంగా నిలబెట్టారు.

**తెలంగాణ అంటే ఇదే... ప్రజాస్వామ్యానికి జీవం పోసే నేల.**

## అడవి 'నాయక'త్వం.. ధర్మపోరాటంలో ఆదిమ వీరత్వం!

భారతీయ ఇతిహాసం అంటే కేవలం కురుపాండవుల రక్తపాతం మాత్రమే కాదు.. అది అడవికీ, అగ్రవర్ణ నాగరికతకూ మధ్య జరిగిన అద్భుత సమన్వయం. పట్టు పరుపుల మీద పెరిగిన పాండవ మధ్యముడు 'భీముడు'.. అడవిని నమ్ముకున్న ఆదిమ వీరవనిత 'హిడింబి' పాదాల చెంత మోకరిల్లిన నాడే మహాభారత గమనంలో ఒక నవశకం మొదలైంది. కానీ, దురదృష్టవశాత్తూ మన చరిత్రకారులు అడవి బిడ్డల త్యాగాలను 'రాక్షస' ముద్ర వేసి అగాధంలోకి తొక్కేశారు. నాయక పోడ్లు అనే గిరిజన వీర తెగ ప్రస్తావన లేని పాండవ వనవాసం ఒక అసంపూర్ణ కావ్యం.

### రాక్షసత్వం కాదు.. అది రక్షణ కవచం!

వారణావతపు కుట్రల నుంచి ప్రాణాలతో బయటపడి, నిప్పులు చెరిగే కళ్లతో అడవిలోకి అడుగుపెట్టిన పాండవులకు ఆశ్రయమిచ్చింది పచ్చని ప్రకృతి మాత్రమే కాదు, ఆ ప్రకృతిని కంటికి రెప్పలా కాపాడుకునే నాయక పోడ్లు. హిడింబిని 'రాక్షసి' అని పిలవడం ఆమెను అవమానించడమే. ఆమె ఒక రాజ్యానికి వారసురాలు, ఒక తెగకు ఆశాకిరణం, యుద్ధ తంత్రం తెలిసిన వీరనారి. పరాయి వ్యక్తులు తమ అడవిలోకి అడుగుపెడితే గొడ్డలి పట్టే ఆమె తెగువ రాక్షసత్వం ఎలా అవుతుంది? అది తన మట్టిని కాపాడుకునే మాతృత్వపు ఆవేదన. భీముడి భుజబలాన్ని చూసి మోహించడమంటే, ఒక వీరుడికి మరో వీరవనిత ఇచ్చిన అత్యున్నత గౌరవం.

### పోడు వ్యవసాయం - అక్షయపాత్ర సిద్ధాంతం

నాగరిక ప్రపంచానికి కొండల మీద వ్యవసాయం చేయడం అంటే అద్భుతం కావచ్చు, కానీ నాయక పోడ్లకి అది జీవనవేదం. పాండవుల వనవాస కాలంలో వారికి ఆకలి తీర్చింది అక్షయపాత్ర మాత్రమే కాదు.. ఆ పాత్రలోకి ధాన్యాన్ని, కందమూలాలను చేర్చిన నాయక తెగ శ్రమ. కొండలను పిండి చేసి పంటలు పండించే పోడు సంస్కృతే పాండవుల మనుగడకు ప్రాణాధారమైంది. ద్రౌపదికి సౌగంధిక పుష్పాలు దొరికినా, అర్జునుడికి పాశుపతాస్త్రం లభించినా.. వాటన్నింటి వెనుక అడవి బిడ్డల అడుగుజాడలు ఉన్నాయి. సాక్షాత్తు పరమశివుడు కూడా అర్జునుడి గర్వాన్ని అణచడానికి ఒక 'కిరాతకుడి' (నాయక వేటగాడి) రూపంలో వచ్చాడంటే, ఆ తెగకున్న సామాజిక గౌరవం ఎంతో అర్థం చేసుకోవచ్చు.




### ఘటోత్కచుడు! ఒక జాతి త్యాగ నిరతికి పతాక!

మహాభారత సంగ్రామంలో అత్యంత విషాదకరమైన, వీరోచితమైన ఘట్టం ఏదైనా ఉంటే అది ఘటోత్కచుడి వీరమరణమే. రాజ్యాధికారం కోసం సోదరులు కొట్టుకుంటుంటే, ఏ సంబంధం లేని అడవి బిడ్డ తన తండ్రి పక్షాన నిలిచి కురుసేనను చీల్చి చెండాడాడు. కర్ణుడి వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని తన గుండెకు అడ్డుపెట్టుకుని అర్జునుడిని కాపాడిన ఆ ప్రాణ త్యాగం.. అడవి బిడ్డల విశ్వసనీయతకు నిదర్శనం. హిడింబి తన కొడుకును యుద్ధానికి పంపుతూ అడవి నేర్పిన నీతిని, ధర్మాన్ని గుండెల్లో నింపి పంపింది. ఒక తల్లిగా తన పేగును కోసుకుని ధర్మ సంస్థాపన కోసం ఆహుతి ఇచ్చిన ఆ గొప్పతనం ఏ రాజకుమారికి ఉంటుంది?

### నేటికీ సజీవం.. ఆ వీరగాథ!

తెలంగాణ నుంచి ఒడిశా వరకు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తరించిన నాయక పోడ్ల సంస్కృతి నేటికీ హిడింబిని 'వనదేవత'గా కొలుస్తోంది. పాలకుల నిర్లక్ష్యం వల్ల, చరిత్రకారుల వివక్ష వల్ల ఈ వీర చరిత్ర చీకటిలోనే ఉండిపోయింది. పాండవులకు రక్షణగా నిలిచిన ఆ వీర తెగ నేడు తమ ఉనికి కోసం, పోడు భూముల కోసం పోరాడాల్సి రావడం మన వ్యవస్థకే సిగ్గుచేటు.

మహాభారతం ఒక సముద్రమైతే, అందులో నాయక పోడ్ల చరిత్ర ఒక సునామీ. హిడింబి ఆత్మగౌరవాన్ని, ఘటోత్కచుడి త్యాగాన్ని, పోడు సంస్కృతిలోని శ్రమను గుర్తించిన రోజే భారతదేశానికి తన మూలాల మీద గౌరవం పెరుగుతుంది. అడవి తల్లి సాక్షిగా.. ఈ సత్యం ఎప్పటికైనా వెలుగులోకి రావాల్సిందే!

**వెంక గారి భూమయ్య**
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
14.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



జనసేన పార్టీ
(Janasena)
యువత, కాపు సామాజిక వర్గంలో మంచి ప్రభావం కలిగి ఉంది.
పొత్తుల రాజకీయాలతో ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తోంది.
జనసేన పార్టీ
JANASENA PARTY

## కూకట్‌పల్లిలో కాంగ్రెస్ సంబరాలు

**ముద్ర, హైదరాబాద్ (కూకట్‌పల్లి) :**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడంతో కూకట్ పల్లి నియోజకవర్గంలో సంబరాల వాతావరణం నెలకొంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ఎత్తున విజయోత్సవాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి బండి రమేష్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమాన్ని కాంగ్రెస్ మాజీ యువజన అధ్యక్షుడు షేరి సతీష్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. విజయోత్సవాల్లో భాగంగా కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు.

## జిల్లాలో 4 మున్సిపాలిటీలు కాంగ్రెస్ కైవసం

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

మున్సిపల్ ఎన్నికల్లో వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. జిల్లాలోని కొడంగల్, పరిగి, వికారాబాద్, తాండూర్ మున్సిపాలిటీలలో 100వార్డులకు గాను 54వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ 32వార్డులతో సరిపెట్టుకోగా బిజెపి ఏడు వార్డుల్లో గెలుపొందింది. ఎంఐఎం మూడు వార్డులను సొంతం చేసుకోగా స్వతంత్ర అభ్యర్థులు నలుగురు తమ సత్తాను చాటుకున్నారు. వికారాబాద్ మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 17వార్డులను కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకోగా ఓ ఇండిపెండెంట్ మరో బిఆర్ఎస్ కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంది. చైర్మన్ పదవిని చేపట్టేందుకు కావలసిన మెజారిటీ సమకూరింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తమ కూతురు అనన్యను చైర్ పర్సన్ గా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తాండూరులోనూ 36వార్డులకు గాను 19వార్డులు కాంగ్రెస్ కైవసం చేసుకోగా, పరిగిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చెరో ఎనిమిది వార్డులను గెలుచుకున్నాయి. ఇద్దరు స్వతంత్రులు గెలుపొందగా స్వతంత్రులను తమ వైపు తిప్పుకునేందుకు ఇరుపార్టీల నేతలు రంగంలోకి దిగారు. కాగా కొడంగల్లో 12వార్డులకు గాను 10 వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకోగా ఒక స్థానానికే బిఆర్ఎస్ పరిమితం అయింది. మరోవైపు ఎంఐఎం తన ఖాతాను తెరిచింది. సీఎం ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో పది స్థానాలు గెలుపొందడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్కు టిఆర్ఎస్ గట్టి పోటీనే ఇచ్చింది. అధికార బలం ఉన్నా అత్యధిక స్థానాలు సాధించలేకపోయారు.

## హరి హర క్షేత్రంలో నూతన పాలక మండలి బాధ్యతల స్వీకారం

**ముద్ర, హైదరాబాద్(కూకట్‌పల్లి) :**

కూకట్‌పల్లి మూసాపేట భరత్‌నగర్ కాలనీలోని శ్రీ హరి హర క్షేత్ర దేవస్థానంలో నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, దేవాలయాల అభివృద్ధి మరియు సంస్కృతి పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. నూతన పాలక మండలి సభ్యులు బాధ్యతలు స్వీకరించి, ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పన, పారదర్శక పరిపాలన కొనసాగించడం తమ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రముఖులకు ఎదురుదెబ్బ

**ముద్ర, వనపర్తి :**

వనపర్తి జిల్లాలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రముఖ నాయకులకు ఓటమి తప్పలేదు. కాంగ్రెస్‌కు అనుకూలంగా వీచిన గాలిలో సీనియర్ నేతలు కూడా పరాజయం చవిచూశారు. బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ 30వ వార్డు నుంచి వరుసగా నాలుగుసార్లు గెలుపొందగా, ఐదోసారి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రాచాల క్రాంతి కుమార్ గౌడ్ చేతిలో ఓడిపోయారు. ఇదేవిధంగా కాగితాల లక్ష్మీనారాయణ కుటుంబానికీ నిరాశే ఎదురైంది. ఆయన సతీమణి కాగితాల శారద 1వ వార్డు నుంచి గతంలో మూడుసార్లు విజయం సాధించినప్పటికీ, ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి చుక్క జయశ్రీ చేతిలో ఓటమి చెందారు. 33వ వార్డులో సీనియర్ నాయకుడు ఉంగులం తిరుమల్ కూడా పరాజయం పాలయ్యారు. గతంలో ఆయన సతీమణి అదే వార్డు నుంచి విజయం సాధించినప్పటికీ, ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి మాధవి గెలుపొందారు. మొత్తం మీద జిల్లాలో కాంగ్రెస్ ప్రభావం స్పష్టంగా కనిపించిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## సమన్వయంసాంకేతికతతోనే విజయ సాధన : డీజీపీ

**ముద్ర, శేరిలింగంపల్లి :**




సైబరాబాద్ పోలీస్ 23ఏళ్ల సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం టీహబ్ లో ప్రత్యేక స్మారక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీజీపీ శివధర్ రెడ్డి హాజరుకాగా, సైబరాబాద్ పోలీసు కమిషనర్ డా. ఎం. రమేష్‌తోపాటు మాజీ కమిషనర్లు, సీనియర్ పదవీ విరమణ చేసిన అధికారులు పాల్గొన్నారు. మాజీ డీజీపీ డా. ఎం.మహేందర్ రెడ్డి, ఎస్.ప్రభాకర్ రెడ్డి, ద్వారకా తిరుమలరావు, ప్రత్యేక గృహ కార్యదర్శి సీవీ ఆనంద్, వి.నవీన్ చంద్ర, సందీప్ శాండిల్యా తదితరులు కమిషనరేట్ అభివృద్ధి ప్రయాణాన్ని స్మరించుకున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగర అవసరాలకు అనుగుణంగా సాంకేతిక ఆధారిత ఆధునిక పోలీసింగ్ అమలు చేయడం ద్వారా సైబరాబాద్ పోలీసులకు ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రజలతో సాన్నిహిత్యం, పారదర్శకత, వేగవంతమైన సేవలే సమర్థ పోలీసింగ్‌కు బలమన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ సైబరాబాద్‌లో సేవలందించిన అధికారులు కట్టుదిట్టమైన పనితీరు, సమర్థతతో కమిషనరేట్‌కు విశిష్ట స్థానం తీసుకువచ్చారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా సైబరాబాద్ పోలీసింగ్‌కు గుర్తింపు లభించడం ఇందుకు నిదర్శనమని అన్నారు. 2003లో మహానగర చట్టం కింద కమిషనరేట్ ఏర్పాటుతో ఆధునిక పోలీసింగ్‌కు బలమైన పునాది పడిందని గుర్తుచేశారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ డా. ఎం.రమేష్ మాట్లాడుతూ సమాచార సాంకేతిక కేంద్రంగా అభివృద్ధి చెందిన సైబరాబాద్ ప్రాంతంలో పరిశ్రమలతో సమన్వయం, సైబర్ భద్రత బలోపేతం, సాంకేతిక వినియోగం ద్వారా ప్రజా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సైబరాబాద్ పోలీసుల చరిత్ర, ముఖ్య విజయాలు, ప్రాధాన్య కార్యక్రమాలను ప్రతిబింబించే ప్రత్యేక దృశ్య ప్రదర్శనను నిర్వహించి, అనంతరం అతిథులను సన్మానించారు.

# కాంగ్రెస్సే కింగ్...!

- **13 మున్సిపాలిటీలలో విజయకేతనం**
- **3 మున్సిపాలిటీలలో హంగ్**
- **చెరొకటి బీఆర్ఎస్, బీజేపీ**
- **కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మున్సిపాలిటీలో కాంగ్రెస్ క్వీన్ స్లీప్ 16వార్డుల్లో 16విజయం**
- **గద్వాల, అమరచింత, అలంపూర్లో హంగ్**
- **మంత్రుల, ఎమ్మెల్యేల కృషికి దక్కిన ఫలితం**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

కాంగ్రెస్ పార్టీ కే ఓటర్లు పట్టం కట్టారు. అధిక మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 19 మున్సిపాలిటీలలో 13 స్థానాల్లో చైర్మన్ పదవి కాంగ్రెస్ దక్కించుకుంది. ఐజ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ గెలుపొందగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, నారాయణ పేటలో బీజేపీ విజయం పొందింది. మరో మూడు మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. గద్వాల, అలంపూర్, అమరచింతలో ఏ పార్టీ మేజిక్ ఫిగర్ దాటలేదు. దీంతో ఎంపీ, ఎమ్మెల్యే,స్వతంత్రుల ఓటుతో గట్టెక్కే పరిస్థితి ఉంది.కాంగ్రెస్కు ఊహించని మున్సిపాలిటీ స్థానాలు రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. బీఆర్ఎస్ నేతలకు ఊహించని ఫలితాలు రావడంతో ఖంగుతిన్నారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం అందించారు. వాకిటి శ్రీహరి నియోజకవర్గంలోని అమరచింత మాత్రం హంగ్ లోకి వెళ్లిపోయింది. మక్తల్, ఆత్మకూరు మాత్రం కాంగ్రెస్ ఖాతాలో పడింది. దేవరకద్ర నియోజకవర్గంలో ఉన్న మూడు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగిరింది. ఇక్కడి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తన పరిధిలోని దేవరకద్ర, కొత్తకోట, భూత్పూర్ మున్సిపాలిటీ లలో చైర్మన్ పదవి కి స్పష్టమైన మెజారిటీ వచ్చింది. వనపర్తి నియోజకవర్గంలోని వనపర్తి, పెబ్బేర్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇక్కడ ఎమ్మెల్యే మేఘారెడ్డి కృషితో మేజిక్ ఫిగర్ దాటి రెండు చైర్మన్ పదవులను కాంగ్రెస్ ఖాతాలో జమ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, కోస్గి, మద్దూర్ మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ విజయం దుందుబీ మోగించింది. కోస్గిలో క్వీన్ స్లీప్ చేసింది, 16వార్డులకు గాను 16లో విజయం సాధించి చరిత్ర సృష్టించింది. కొడంగల్ రేవంత్ రెడ్డి అడ్డా అనే పేరును సార్థకం చేశారు ఇక్కడి ఓటర్లు. నారాయణ పేటలో 24వార్డుల్లో బీజేపీ 11స్థానాల్లో గెలుపొందింది. ఇక్కడ బీజేపీ ఎంపీ డీకే అరుణ ఓటుతో బీజేపీ గట్టెక్కనుంది.నాగర్ కర్నూల్లో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ విజయ శిఖరాలకు చేరుకుంది. గద్వాల మున్సిపాలిటీలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జి సరిత మధ్య రాజకీయ సమన్వయం లేకపోవడంతో మేజిక్ ఫిగర్ దాటలేదు. దీంతో ఇక్కడి మున్సిపాలిటీలో హంగ్ ఏర్పడింది. అలంపూర్ లో 10మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్ 5, బీఆర్ఎస్ 5 స్థానాల్లో గెలుపొందాయి. ఇక్కడ ఎక్స్ ఆఫీసియో సభ్యుల ఓటుతో గట్టెక్కాలని ఉన్నా ఇక్కడ బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యే విజయుడు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ మల్లురవి ఉన్నారు. వీరు ఓట్లు వేసినా సమానమైన ఓట్లు ఉంటాయి. ఇది ఫలితం ఎలా ఉంటుందో అని అంతా ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఈ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఃఎస్, బీజేపీ పెద్దగా పోటీ ఇవ్వలేక పోయాయి.

## మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

**ముద్ర, తాండూర్ :**



వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు గాను 19స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుని చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. ఏ ఇతర పార్టీల మద్దతు లేకుండా స్వతహాగా మెజార్టీ స్థానాలను సాధించినందుకు తాండూర్ శాసనసభ్యుడు మనోహర్ రెడ్డి 19మంది కాంగ్రెస్ కౌన్సిలర్లకు అభినందనలు తెలిపారు.

**కాంగ్రెస్ కౌన్సిలర్లు వార్డుల వారీగా :**

2వ వార్డు ప్రత్యూష, 3వ వార్డు తయాబ్ సుల్తానా, 4వ వార్డు మెహరున్నిసా బేగం, 10వ వార్డు అల్లాపూర్ శ్రీకాంత్, 11వ వార్డు బంటు వేణు, 12వ వార్డు నీరజ బాల్‌రెడ్డి, 14వ వార్డు మాయ అంజు, 15వ వార్డు దివిటి ఎల్లప్ప, 16వ వార్డు నారా శ్రీలత, 17వ వార్డు సాయ తపసుం, 19వ వార్డు జుంటుపల్లి వెంకట్, 21వ వార్డు సభ ఫాతిమా, 22వ వార్డు రామ కృష్ణ, 24వ వార్డు బాలకృష్ణారెడ్డి, 26వ వార్డు వైశాలి, 27వ వార్డు ఉప్పరి స్వరూప, 29వ వార్డు అబ్దుల్ రజాక్, 30వ వార్డు మెహరాన్ బేగం, 35వ వార్డు అప్సర్ నూర్ అహ్మద్‌లు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు.

**బీఆర్ఎస్ గెలుపొందిన వారి వివరాలు :**

1వ వార్డు నాగలక్ష్మి, 6వ వార్డు అనిల్, 7వ వార్డు ఇర్షాద్, 8వ వార్డు జావిద్, 9వ వార్డు పట్లోళ్ల దీప, 13వ వార్డు సురేష్ నాయక్, 20వ వార్డు నవీన, 25వ వార్డు నసీరా బాను, 31వ వార్డు యోగానంద్, 32వ వార్డు మహేశ్వరి, 34వ వార్డు సుప్రీత పటేల్, 36వ వార్డు రూప పాటిల్ గెలుపొందారు. మాజీ బీఆర్ఎస్ శాసనసభ్యుడు పైలట్ రోహిత్ రెడ్డి పార్టీ తరపున గెలుపొందిన 12 మంది కౌన్సిలర్లకు అభినందనలు తెలిపారు.

**బీజేపీ నుంచి ముగ్గురు..**

బీజేపీ పార్టీ నుంచి ముగ్గురు అభ్యర్థులు గెలుపొందారు. 23వ వార్డు నుంచి అంతారం కిరణ్, 28వ వార్డు నుంచి నాగరం మల్లేశం, 33వ వార్డు నుంచి శ్రీకాంత్ రెడ్డి గెలుపొందగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్ అభినందించారు. 18వ వార్డు నుంచి ఎంఐఎం అభ్యర్థి మోయిస్ ఖాన్ గెలుపొందగా, 5వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థి జినత్ బేగం విజయం సాధించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్ అభ్యర్థులందరికీ అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

## వనపర్తి జిల్లాలో కాంగ్రెస్ జోరు

- **నాలుగు మున్సిపాలిటీల్లో పూర్తి మెజార్టీ**
- **బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ**

**ముద్ర, వనపర్తి :**

వనపర్తి జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం ప్రదర్శించింది. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో నాలుగు చోట్ల పూర్తి మెజార్టీ సాధించి చైర్మన్ పదవులను దక్కించుకునే స్థితిని కాంగ్రెస్ ఏర్పరుచుకుంది. అధికార బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. వనపర్తి మున్సిపాలిటీలో మొత్తం 33 స్థానాలకు గాను కాంగ్రెస్ 20 సీట్లు గెలుచుకోగా, బీఆర్ఎస్ 8, బీజేపీ 2, సీపీఎం 1, స్వతంత్రులు 2 స్థానాల్లో విజయం సాధించారు. కొత్తకోట మున్సిపాలిటీలో 15 స్థానాల్లో కాంగ్రెస్ 10 సీట్లు దక్కించుకుని పూర్తి మెజార్టీ సాధించింది. బీఆర్ఎస్ 3, బీజేపీ 1, స్వతంత్రుడు 1 స్థానంలో గెలుపొందారు. పెబ్బేరు మున్సిపాలిటీలో మొత్తం 12 స్థానాల్లో కాంగ్రెస్ 7, బీఆర్ఎస్ 5 స్థానాలు గెలుచుకున్నాయి. ఆత్మకూరు మున్సిపాలిటీలో 10 స్థానాల్లో కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 1, బీజేపీ 3 స్థానాలు సాధించాయి. ఈ రెండు మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ పూర్తి ఆధిక్యాన్ని నమోదు చేసింది. అమరచింత మున్సిపాలిటీలో మాత్రం హంగ్ పరిస్థితి నెలకొంది. మొత్తం 10 స్థానాల్లో కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 3, బీజేపీ 3, సీపీఎం 1సీటు గెలుచుకోవడంతో స్పష్టమైన మెజార్టీ ఏ పార్టీకి రాలేదు. మొత్తం మీద జిల్లాలో కాంగ్రెస్ హవా కొనసాగినట్లు ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. నాలుగు మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా, ఒకచోట తేలికపాటి పోటీ పరిస్థితి నెలకొంది.





## అంబీర్ చెరువు అభివృద్ధికి కమిషనర్‌కు వినతి

**ముద్ర, హైదరాబాద్(కూకట్‌పల్లి) :**

ప్రగతి నగర్ పరిధిలో ఉన్న అంబీర్ చెరువు సమగ్ర అభివృద్ధి కోసం స్థానిక కాలనీల నివాసులు సైబరాబాద్ పోలీసు కమిషనర్ సృజనకు వినతిపత్రం సమర్పించారు. లేక్ వ్యూ కాలనీ, ఆదిత్య నగర్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కలిసి ఈ వినతిని అందజేశారు. చెరువు పరిసరాల్లో నెలకొన్న సమస్యలను కమిషనర్ శ్రద్ధగా విని, అభివృద్ధి చర్యలకు తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే చెరువును స్వయంగా సందర్శించి పరిస్థితులను పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబీర్ లేక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఆదిత్య నగర్ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు. చెరువును అభివృద్ధి చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## నారాయణపేటలో 'కమలం' దూకుడు

- **24వార్డుల్లో బీజేపీకి 11స్థానాలు, కాంగ్రెస్‌కు 7**
- **మున్సిపల్ ఎన్నికల్లో అత్త-కోడళ్ల విజయం**

**ముద్ర, నారాయణపేట :**

నారాయణపేట పట్టణం మరోసారి భారతీయ జనతా పార్టీకి కంచుకోటగా నిలిచింది. పట్టణంలోని 24వార్డులకు జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ 11వార్డుల్లో గెలుపొందగా, కాంగ్రెస్ 7స్థానాలు దక్కించుకుంది. భారత రాష్ట్ర సమితి 2, ఏఐఎంఐఎం 2, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 1, స్వతంత్ర అభ్యర్థి 1 స్థానంలో విజయం సాధించారు. జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద ఓట్ల లెక్కింపు నిర్వహించగా, ఉదయం నుంచే అభ్యర్థుల అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మొత్తం మూడు విడతల్లో అధికారులు ఓట్ల లెక్కింపు పూర్తి చేశారు.

**అత్త-కోడళ్ల విజయంతో ప్రత్యేక ఆకర్షణ..**

ఈ ఎన్నికల్లో రెండు వేర్వేరు పార్టీలకు చెందిన అత్త-కోడళ్లు కౌన్సిలర్లుగా గెలవడం విశేషం. 17వ వార్డు నుంచి కర్రే కల్పన బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించగా, ఆమెకు కోడలు వరుసైన శ్వేత 20వ వార్డు నుంచి కాంగ్రెస్ తరపున గెలుపొందారు. గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లుగా పనిచేసిన హరి నారాయణ భట్టాడ్, నందు నామాజీలు ఈసారి ఓటమి చెందారు. కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి ఓటు హక్కు వినియోగించిన 5వ వార్డులో బీజేపీ అభ్యర్థి ఎరుకలి రాఘవేంద్ర విజయం సాధించారు.

వార్డు వారీగా విజేతలు :

1. సుతారి సత్య రఘుపాల్ (బీజేపీ)
2. కె. సౌజన్య (బీజేపీ)
3. కాకర్ల నారాయణమ్మ (బీఆర్ఎస్)
4. కొండా శ్వేత సత్య యాదవ్ (బీజేపీ)
5. ఎరుకలి రాఘవేంద్ర (బీజేపీ)
6. ఎన్. మంజుల (బీజేపీ)
7. భరత్ (బీఆర్ఎస్)
8. కందెనపల్లి సత్యమ్మ (కాంగ్రెస్)
9. యు. మహేష్ (కాంగ్రెస్)
10. జయశ్రీ (స్వతంత్ర)
11. భగవతి (ఏఐఎఫ్‌బీ)
12. అప్పిరెడ్డిపల్లి రాము (బీజేపీ)
13. లక్ష్మప్ప (బీజేపీ)
14. ఎల్. అరుణ (కాంగ్రెస్)
15. బండి రాజేశ్వరి (కాంగ్రెస్)
16. అంబికా శ్రీనివాస్ (బీజేపీ)
17. కర్రే కల్పన (బీజేపీ)
18. రవితేజ (కాంగ్రెస్)
19. బి. నాగమ్మ (బీజేపీ)
20. శ్వేత (కాంగ్రెస్)
21. కమలాపూర్ ప్రభాకర్ (బీజేపీ)
22. రాజు ఘాట్ (కాంగ్రెస్)
23. మహమ్మద్ తాకిచాంద్ (ఏఐఎంఐఎం)
24. మహమ్మద్ తకీ (ఏఐఎంఐఎం).

భారతీయ జనతా పార్టీ
తెలంగాణలో బలపడే దిశగా కృషి చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో మిత్రపక్షాలపై ఆధారపడే రాజకీయ వ్యూహం కొనసాగిస్తోంది.

# కరీంనగర్‌పై ఎగిరిన కాషాయ జెండా..

- మేయర్ పీఠం దిశగా బీజేపీ అడుగులు..





**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ రాజకీయం సరికొత్త మలుపు తిరిగింది. నగరపాలక సంస్థ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ప్రభంజనం సృష్టించి, సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. గత కొంతకాలంగా పట్టు బిగిస్తున్న కాషాయ దళం, తాజా ఫలితాలతో నగరంపై తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

### బండి సంజయ్ 'వన్ మ్యాన్ షో'

ఈ విజయం వెనుక కేంద్ర మంత్రి, స్థానిక ఎంపీ బండి సంజయ్ కుమార్ కృషి అనిర్వచనీయం. గత మూడు నెలలుగా ఆయన విశ్రాంతి లేకుండా క్షేత్రస్థాయిలో పనిచేశారు. నిరంతర సమావేశాలు నిర్వహించారు. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు అన్నీ తానై వ్యవహరించారు. నియోజకవర్గంలోని ప్రతి గల్లీని చుట్టేస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహం నింపి వ్యూహాత్మక ప్రచారం చేశారు.

ఎన్నికల నిర్వహణలో ఎక్కడా తగ్గకుండా, గట్టి పోటీని ఇస్తూ వ్యూహ ప్రతివ్యూహాలతో ప్రత్యర్థులను చిత్తు చేశారు. మొత్తం 66 డివిజన్లలో బీజేపీ మేజిక్ ఫిగర్‌కు చేరువలో నిలిచింది. పార్టీ ల వారీగా బీజేపీ 30, కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9, స్వతంత్రులు 8, ఎంఐఎం 3, ఫా ర్వర్డ్ బ్లాక్ 2 స్థానాలలో గెలుపొందాయి.

### మేయర్ పీఠం ఎవరికి?

బీజేపీ 30 స్థానాల్లో విజయం సాధించగా, మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి మరో 4 స్థానాల అవసరం ఉంది. 8 మంది స్వతంత్రులు గెలవడంతో, వారి మద్దతుతో బీజేపీ మేయర్ కుర్చీని కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆ దిశగా చర్చలు ముమ్మరం చేసింది. మరో వైపు, కాంగ్రెస్ 14 స్థానాలతో రెండో స్థానంలో నిలవగా, ఒకప్పుడు కరీంనగర్‌ను శాసించిన బీఆర్ఎస్ కేవలం 9 స్థానాలకే పరిమితం కావడం గమనార్హం.

కొత్త కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం, మేయర్ ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. 16వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం ఉంటుంది. అనంతరం మధ్యాహ్నం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేస్తారు. నగర అభివృద్ధిని కాంక్షిస్తూ కరీంనగర్ ప్రజలు ఇచ్చిన ఈ తీర్పుతో రాబోయే రోజుల్లో నగర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించనున్నాయి.

# చరిత్రలో గొప్ప విజయం..

- ధర్మపురిలో మొత్తం 15 స్థానాలు కాంగ్రెస్ కైవసం..
- మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ముద్ర, ధర్మపురి:**
మున్సిపల్ ఎన్నికల్లో ధర్మపురి లో 15 స్థానాలకు 15 స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం చరిత్రలో గొప్ప విజయంగా భావించవచ్చని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మీడియాతో మంత్రి అడ్లూరి మాట్లాడారు. గడచిన రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు పట్టం కట్టారని మంత్రి అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాత్రి పగలు కష్టపడి అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన ప్రతి హామీని ఆరు నెలల లోపు పూర్తి చేస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బుద్ధి తెచ్చుకోవాలని మంత్రి అడ్లూరి హితవు పలికారు. ధర్మపురి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై వ్యక్తిగతమైన ఆరోపణలు చేసినప్పటికీ అవి సత్యదూరమని భావించిన ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని మంత్రి పేర్కొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గడిచిన రెండు సంవత్సరాలుగా విద్య, వైద్యం ఆరోగ్యం వంటి అంశాలతో పాటు రైజింగ్ 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని, మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ముఖ్యమంత్రి ఆలోచన విజయతీరాలకు చేర్చిందని మంత్రి అడ్లూరి అన్నారు. మున్సిపల్ ఎన్నికలు ఫలితాలతో పొంగిపోకుండా ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రానున్న మూడు సంవత్సరాల్లో మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు.

## బిఆర్ఎస్ లో ఒకే ఒక్కడు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ బల్దియా ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ పక్షాన గెలిచిన మంచాల శ్రీకాంత్ యాదవ్ ఒకే ఒక్కడిగా మిగిలాడు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి సన్నిహితుడుగా పేరున్న శ్రీకాంత్ యాదవ్ కాంగ్రెస్ పక్షాన టికెట్ ఆశించాడు. కానీ చివరి క్షణంలో అధిష్టానం ఆయనకు టికెట్ ఖరారు చేయక పోవడంతో బిఆర్ఎస్ లోకి చేరాడు. అయితే పార్టీలో చేరి గెలుపొందిన ఒకే ఒక్క బిఆర్ఎస్ అభ్యర్థిగా ఆయన నిలిచారు.

## గురుకుల విద్యార్థులకు మట్టి నమూనా సేకరణపై అవగాహన



**ముద్ర, పెద్దపల్లి:**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని నంది మేడారం తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మట్టి నమూనా సేకరణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ సాయిల్ పథకం కార్యక్రమంలో భాగంగా ఏఈఓ వినీత్ 7, 8, 9 తరగతుల తరగతులు విద్యార్థులకు మట్టి నమూనా సేకరణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి పరీక్షల అనంతరం పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం మట్టిలో ఉన్న పోషకాలను అనుసరించి పంటలు సాగు చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో సాగుచేసిన పంటలు అధిక దిగుబడి ఇస్తాయని పేర్కొన్నారు. నేల సంరక్షణపై విద్యార్థి స్థాయి నుంచి అవగాహన కలిగి ఉండి నాణ్యమైన పంటలు పండిస్తే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని ఏఈఓ వివరించారు.

ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ విజయ, సైన్స్ టీచర్ స్వర్ణలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

## శ్రీసచ్చిదానంద సరస్వతి స్వామీజీకి నివాళులు

స్వామీజీ శివైక్యం తీరని లోటు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ముద్ర, ధర్మపురి:**
ధర్మపురి మఠాధీశులు శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శివైక్యం (మరణం) తీరని లోటని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శుక్రవారం శివైక్యం కావడంతో ధర్మపురిలోని శ్రీలక్ష్మి నర్సింహాస్వామి ఆలయం వద్ద ఆలయ అర్చకులు, అధికారులు మంత్రితో కలిసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శివైక్యం ధర్మపురి శ్రీలక్ష్మి నర్సింహాస్వామి ఆలయానికి తీరని లోటని అన్నారు. ధర్మపురి క్షేత్రంలో చేసే ప్రతి కార్యక్రమం స్వామి వారి ఆలోచనతోనే ముందుకు సాగాయని అన్నారు. ధర్మపురి బ్రహ్మోత్సవాల నుంచి మొదలుకొని శివ కల్యాణం, వైకుంఠ ఏకాదశి ఇలా ప్రతి కార్యక్రమం స్వామి సూచన ప్రకారం ముందుకు సాగామని మంత్రి అడ్లూరి అన్నారు. ధర్మపురి క్షేత్రంలో వారి పేరు చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొన్ని కారణాల వలన తాను అంతిమ యాత్రకు హాజరు కాలేకపోతున్నప్పటికీ తన కుమారుడిని పంపించినట్లు మంత్రి తెలిపారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి పేర్కొన్నారు.

## జగిత్యాల జిల్లాలో రెండు మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలోకి

**ముద్ర, జగిత్యాల:**
జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల ఫలితాలు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి. ధర్మపురి, కోరుట్ల మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోగా రాయికల్, మెట్పల్లిలో హంగ్ పరిస్థితులు నెలకొన్నాయి. ధర్మపురిలో మొత్తం 15 వార్డులన్నింటినీ గెలుచుకుని కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయగా, కోరుట్లలో 33 వార్డుల్లో 18 స్థానాలు సాధించి మ్యాజిక్ ఫిగర్ దాటింది. దీంతో రెండు బల్దియాలు కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి.

రాయికల్‌లో 12 వార్డుల్లో బీజేపీ 5, కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 3, ఒక ఇండిపెండెంట్ గెలవడంతో ఏ పార్టీకి 7 మ్యాజిక్ ఫిగర్ రాలేదు. బీజేపీ–బీఆర్ఎస్ కూటమి ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మెట్‌పల్లిలో 26 వార్డులకు బీజేపీ 10, కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 6, ఇండిపెండెంట్లు 4 స్థానాలు గెలిచారు.

జగిత్యాలలో మొత్తం 50 వార్డుల్లో కాంగ్రెస్ 23 స్థానాలు కైవసం చేసుకుంది. మ్యాజిక్ ఫిగర్ 26 దాటనప్పటికీ ఇద్దరు ఎంఐఎం నుండి గెలిచిన కౌన్సిలర్ల మద్దతుతో పాటు ఇండిపెండెంట్ గా గెలిచిన నలుగురు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరులు కూడా కాంగ్రెస్ పార్టీకే మద్దతు ప్రకటించే అవకాశం ఉంది.

## లక్సెట్టిపేటలో బీజేపీ అభ్యర్థి మృతి..



**ముద్ర, మంచిర్యాల:**
మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ వేళ శుక్రవారం లక్షెట్టిపేటలో విషాదం నెలకొంది. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 10వ వార్డులో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి బత్తిని ఎల్లమ్మ మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కౌంటింగ్ రోజే పరిస్థితి విషమించి కన్నుమూయడంతో కుటుంబీకులు విషాదంలో మునిగిపోయారు.

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్

- నిర్మల్ కాంగ్రెస్ కైవసం.. - భైంసాలో ఇండిపెండెంట్లు కీలకం.. - ఖానాపూర్ లో హంగ్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
గత రెండు రోజులుగా మున్సిపల్ ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ప్రజలు శుక్రవారం ఫలితాలు వెలువడటంతో ఊపిరి పీల్చుకున్నారు. నిర్మల్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోగా ఖానాపూర్ లో హంగ్ ఏర్పడింది. భైంసా పీఠాన్ని ఎంఐఎం కైవసం చేసుకునేందుకు 2 సీట్లు తక్కువ కావటంతో ఇండిపెండెంట్లు కీలక పాత్ర పోషించనున్నారు.

శుక్రవారం ఉదయం కలెక్టర్ అభిలాష అభినవ్ సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తెరిచి కౌంటింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్ లను తరలించారు. రెండు రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించారు. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించారు. అందులో బీజేపీకి 53, కాంగ్రెస్ కు 52, బిఆర్ఎస్ కు 7, ఎంఐఎంకు 10 ఓట్లు వచ్చాయి. నిర్మల్ లో తొలి నుంచి బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ కొనసాగుతూ వచ్చింది. భైంసాలో ఎంఐఎం, ఇండిపెండెంట్ల మధ్యే పోటీ కొనసాగింది. కాగా ఫలితాలు ఆసక్తికరంగా వెలువడటం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ నేత శ్రీహరి రావు నివాసం ఉంటున్న వార్డులో అదే పార్టీ అభ్యర్థి అడపా శ్రీకాంత్, బీజేపీ అభ్యర్థి ఖమ్మం సురేందర్ చేతిలో ఓటమి చవి చూసారు. కాగా బీజేపీ ఎంఎల్ఏ మహేశ్వర్ రెడ్డి వార్డులో బీజేపీ అభ్యర్థి సంధ్యారాణి ఓటమి పాలయ్యారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి నివాసం ఉంటున్న వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఎలుగు సుధాకర్ పై బీజేపీ అభ్యర్థి వినిషా లక్ష్మీ గెలుపొందారు. బీజేపీ నుంచి రాజీనామా చేసి బిఆర్ఎస్ నుంచి పోటీ చేసిన అయ్యన్నగారి రాజేందర్ దంపతులు ఓడిపోయారు. బీజేపీ నేతలు రావుల రాంనాథ్ కూతురు రమ్య 13వ వార్డు నుంచి గెలుపొందారు. మరో బీజేపీ నేత సాదం అరవింద్ సతీమణి స్వప్న గెలుపొందారు. సీనియర్ నేత ఒడిసెల శ్రీనివాస్ సతీమణి, ఒడిసెల అర్జున్ తల్లి లక్ష్మీ విజయం సాధించారు. బీజేపీ నేతలు అలివేలు మంగ, మెడిసిమ్మె రాజు కుటుంబ సభ్యులు ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ పక్షాన బరిలో ఉన్న అప్పాల గణేష్ చక్రవర్తి, ఆయన సతీమణి కావ్య గెలుపొందారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నాందేడపు చిన్ను కుటుంబ సభ్యులు విజయం సాధించారు. కాంగ్రెస్ పక్షాన తౌహుద్దీన్ రఫ్ఫు, ఆయన సతీమణి ఆయేషా కౌసర్ వరుసగా రెండోసారి విజయం సాధించారు.

పార్టీల వారీగా చూస్తే బీజేపీ 14, ఎంఐఎం2, కాంగ్రెస్ 25, బిఆర్ఎస్ 1 చొప్పున గెలుపొందాయి. గతంలో కేవలం ఒక స్థానం కైవసం చేసుకున్న బీజేపీ ఈ సారి 14 సీట్లను గెలుచుకోవడం విశేషం.

### ఖానాపూర్ లో..

ఖానాపూర్ లో ఫలితాలు హంగ్ కు దారి తీసాయి. తొలి ఫలితాల్లో బీజేపీ, బిఆర్ఎస్ చెరో 4 స్థానాలు, కాంగ్రెస్ 3, ఇండిపెండెంట్ 1 స్థానం కైవసం చేసుకున్నారు. ఐతే ఇండిపెండెంట్ అభ్యర్థి సైదా బేగం ఎంఎల్ఏ వెడ్మా బొజ్జు సమక్షంలో కాంగ్రెస్ లో చేరడంతో మూడు ప్రధాన పార్టీలు చెరి 4 స్థానాలు కైవసం చేసుకున్నట్లయింది. దీంతో అధ్యక్ష పీఠం ఏ పార్టీని వరించనుందోనని ఆసక్తి నెలకొంది.

# వైభవంగా ఓదెల 'మల్లన్న' కల్యాణం..

పాల్గొన్న ఎమ్మెల్యే కుటుంబీకులు, అడిషనల్ కలెక్టర్ వేణు



**ముద్ర, పెద్దపల్లి:**
పెద్దపల్లి జిల్లాలోని ప్రాచీన శైవ క్షేత్రం స్వయంభు ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల కోలాహలం నడుమ ఓదెల మల్లికార్జున స్వామి కళ్యాణం కన్నుల పండువగా సాగింది. స్వామి వారి కళ్యాణాన్ని వీక్షించేందుకు ప్రజా ప్రతినిధులు, దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణం కన్నుల పండువగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే విజయ రమణారావు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

ఈ సందర్భంగా భక్తులందరికీ అన్నదానం చేశారు. కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయం తరఫున ప్రసాదం, కండువాలు, జాకెట్ పీసులను పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలకవర్గం, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య, అడిషనల్ కలెక్టర్ వేణు, మాజీ జడ్పీటిసి గంట రాములు యాదవ్, ఈవో సదయ్య, ఆలయ డైరెక్టర్లు, అధికారులు, సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
14.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



భారతీయ జాతీయ కాంగ్రెస్
(Congress)
తెలంగాణలో అధికారంలో ఉండటంతో మళ్లీ పుంజుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో పునరుద్ధరణ కోసం ప్రయత్నాలు సాగుతున్నాయి.

## విజయోత్సవాలకు అనుమతి లేదు

- **పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ముద్ర, ఖమ్మం:**
మున్సిపల్ ఎన్నికల ఫలితాలను పురస్కరించుకొని ఖమ్మం కమిషనరేట్ పరిధిలో విజయోత్సవ ర్యాలీలు, వేడుకలు నిర్వహించడానికి అనుమతి లేదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ఖమ్మం కమిషనరెట్ పరిధిలో సెక్షన్ 163 BNSS అమల్లో ఉన్నందున ఎలాంటి విజయోత్సవాలు, ర్యాలీలు జరుపకూడదన్నారు. బాణాసంచా కాల్చడం, డీజే వినియోగం, బైక్ ర్యాలీలు, ఇతర ర్యాలీలతో పాటు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వాహణ, గుంపులుగా తిరగడం నిషేధం అని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు, కార్యకర్తలతో పాటు ఓటమి పాలైన పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం సమన్వయంతో వ్యవహరిస్తూ పోలీసులకు పూర్తి సహకారాన్ని అందించాలన్నారు. పోలీసుల నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల నేథ్యంలో అల్లర్లు సృష్టిస్తే ఎవ్వరినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమన్నారు. ఆడంభరాలకు దూరంగా ఉండాలన్నారు. పోలీసుల సూచనలను పాటించి ప్రశాంతంగా ఉండాలని కోరారు

## లెక్కింపు ప్రశాంతం

**ముద్ర, మోత్కూర్:**
శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగిందని మున్సిపల్ కమిషనర్ కే సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ 1, 2, 6, 7, 8, 9, 11, 12 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులు, 3,4,10 వార్డులలో బిఆర్ఎస్ అభ్యర్థులు, 5 వార్డు స్వతంత్ర అభ్యర్థి గెలుపొందినట్లు ఆయన తెలిపారు. ఒకటో వార్డులో టీఆర్ఎస్ అభ్యర్థి సొల్లేటి నరేష్ పై కాంగ్రెస్ అభ్యర్థి పల్లెర్ల వెంకన్న ఎనిమిది వందల ఆరు ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రెండవ వార్డు టిఆర్ఎస్ అభ్యర్థి మర్రి జయమ్మ పై కాంగ్రెస్ అభ్యర్థి కురిమిళ్ళ ప్రమీల 27 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు మూడో వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి సుల్తానా మనోజ్ కుమార్ పై టీఆర్ఎస్ అభ్యర్థి సుల్తానా స్వామి 116 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నాల్గో వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి జ్యోతిపై టిఆర్ఎస్ అభ్యర్థి కొండా శోభ సోంమల్లు 126 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.5 వ వార్డు టిఆర్ఎస్ అభ్యర్థి కోకా రేణుకపై ఇండిపెండెంట్ అభ్యర్థి మొగుళ్ల అనురాధ 55 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.6 వ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి దాసరి తిరుమలేష్ పై కాంగ్రెస్ అభ్యర్థి గద్దం స్వప్న 173 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఏడవ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి గుంటూర్ శ్రీలతపై కాంగ్రెస్ అభ్యర్థి గణగాని శైలజ 394 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు 8వ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి ఎడ్ల రమాదేవి సిపిఐ అభ్యర్థి కూరపాటి జయంమలపై కాంగ్రెస్ అభ్యర్థి పొన్నాల శ్రీవిద్య 839 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. తొమ్మిదవ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి మన్నె బీమాయపై కాంగ్రెస్ అభ్యర్థి బీసు శ్రీకాంత్ గౌడ్ 240 కోట్ల మెజార్టీతో విజయం సాధించారు. పదవ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి వర్రే మహేందర్ పై బీఆర్ఎస్ అభ్యర్థి నల్ల మధు 53 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 11వ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి పసల మరి అన్నపై కాంగ్రెస్ అభ్యర్థి కారుపోతుల వెంకన్న 284 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 12వ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి కూరెల్ల పద్మపై కాంగ్రెస్ అభ్యర్థి మెంట రమణ 141 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారని అన్నారు.

## కోదాడ మున్సిపల్ పీఠం హస్తగతం

- **35 కు 27 వార్డులు హస్తం కైవసం**
- **కారు పార్టీకి 3 , స్వతంత్రులకు 5 స్థానాలు**



**ముద్ర ప్రతినిధి:**
కోదాడ మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. మొత్తం 35 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 3 వార్డులు ముందే ఏకగ్రీవం కాగా మిగిలిన 32 వార్డులకు ఎన్నిక జరుగగా 24 వార్డులను కాంగ్రెస్ గెలుచుకుని మొత్తం 27 వార్డులు కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంది . బీఆర్ఎస్ పార్టీ కేవలం 3 వార్డుల్లో విజయం సాధించగా, స్వతంత్ర అభ్యర్థులు 5 వార్డుల్లో గెలిచి తమ సత్తా చాటుకున్నారు. ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచే కాంగ్రెస్ అభ్యర్థులు అనేక వార్డుల్లో ఆధిక్యంలో కొనసాగి చివరకు భారీ మెజారిటీలతో విజయం సాధించారు. పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రచారంలో ప్రధానంగా తీసుకెళ్లిన కాంగ్రెస్‌కు ఓటర్లు స్పష్టమైన మద్దతు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఎక్కడా గట్టి పోటీ ఇవ్వలేకపోవడం ఆశ్చర్యం. మరోవైపు స్వతంత్ర అభ్యర్థులు 5 వార్డుల్లో విజయం సాధించడం గమనార్హం. ఈ ఎన్నికల ఫలితాలతో మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ పదవి కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లడంతో కాంగ్రెస్ లో ఇప్పుడు చైర్‌పర్సన్ అభ్యర్థి ఎవరనే దానిపై ఆసక్తి నెలకొంది .

## పరకాలపై కాంగ్రెస్ జెండా



**ముద్ర, పరకాల:**
పరకాల మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను దక్కించుకొని అతిపెద్ద పార్టీగా నిలిచింది. పరకాల మున్సిపాలిటీలోని 22 వార్డులలో 13 వార్డులను తెలుసుకొని చైర్మన్ వైస్ చైర్మన్ స్థానాలను దక్కించుకుంది.శుక్రవారం పరకాల పట్టణంలోని గణపతి డిగ్రీ కాలేజ్ ఆవరణలో పరకాల మున్సిపాలిటీ ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మొదటి రౌండులో బిజెపి పార్టీ మూడు స్థానాలను గెలుచుకొని కాంగ్రెస్ బిజెపి పార్టీలకు గట్టి షాక్ ఇచ్చింది. మొదటి రౌండులో కాంగ్రెస్ రెండు స్థానాలు టిఆర్ఎస్ రెండు స్థానాలు దక్కించుకున్నాయి. రెండు మూడు నాలుగు రౌండ్లలో కాంగ్రెస్ పార్టీ దూసుకు పోయింది. ప్రతి రౌండ్ కు 7 వార్డులను లెక్కించగా రెండు మూడు రౌండ్లలో కాంగ్రెస్ పార్టీకి ఎదురు లేకుండా పోయింది. కాంగ్రెస్ పార్టీకి ఏ దశలోను బిజెపి బీఆర్ఎస్ పార్టీలు పోటీ ఇవ్వలేకపోయాయి.

# భువనగిరి కాంగ్రెస్ కైవసం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**
మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించింది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం. మొత్తం 35 వార్డులకు కాంగ్రెస్22, బిఆర్ఎస్4, బిజెపి4, ఇండిపెండెంట్ 5 స్థానాల్లో విజయం సాధించారు.



| వార్డు | పార్టీ | గెలుపొందిన అభ్యర్థి |
|---|---|---|
| 1 | బిఆర్ఎస్ | ఏలేభువనేశ్వరి |
| 2 | కాంగ్రెస్ | పోలిశెట్టి అనిల్ |
| 3 | కాంగెస్ | పాల్ల్య వెంకటేష్ |
| 4 | స్వతంత్ర అభ్యర్థి | అరుణ పూర్ణ చందర్ |
| 5 | బిజెపి | తుమ్మల నరేష్ యాస్మిన్ |
| 6 | కాంగ్రెస్ | జంగిటి వినోద్ |
| 7 | కాంగ్రెస్ | కుక్కదువు పద్మ సోమయ్య |
| 8 | స్వతంత్ర | తాహీరా బబ్లు |
| 9 | కాంగ్రెస్ | బొంతల నరసింహ |
| 10 | కాంగ్రెస్ | బింగి నరేష్ |
| 11 | కాంగ్రెస్ | గంజి శ్రీవాణి గణేష్ రెడ్డి |
| 12 | కాంగ్రెస్ | తోటకూరి విజయలక్ష్మి వెంకటేశం |
| 13 | కాంగ్రెస్ | గుర్రాల సంతోష శ్రీనివాస్ |
| 14 | స్వతంత్ర అభ్యర్థి | తుమ్మేటి పాండు |
| 15 | కాంగ్రెస్ | నాజియా రెహమాన్ |
| 16 | బిజెపి | శారద |
| 17 | బిఆర్ఎస్ | చెన్న స్వాతి మహేష్ |
| 18 | స్వతంత్ర | పాశంఅమర్నాథ్ |
| 19 | బిజెపి | బండారి స్వర్ణలత |
| 20 | కాంగ్రెస్ | జగన్మోహన్ |
| 21 | బిజెపి | వంగేటి సుచరిత |
| 22 | కాంగ్రెస్ | జాలిగం విగ్నేష్ |
| 23 | కాంగ్రెస్ | బర్రె పూజిత |
| 24 | కాంగ్రెస్ | చల్లగురుగుల కృష్ణవేణి రఘుబాబు |
| 25 | కాంగ్రెస్ | బెండస్వరూప లాల్ రాజు |
| 26 | బీఆర్ఎస్ | చిమల రాజు |
| 27 | కాంగ్రెస్ | బురాన్ |
| 28 | కాంగ్రెస్ | సుధగాని సరిత |
| 29 | కాంగ్రెస్ | పొతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు |
| 30 | కాంగ్రెస్ | లయిక్ అహ్మద్ |
| 31 | కాంగ్రెస్ | సుమయ్య తపస్సుం |
| 32 | స్వతంత్ర | బర్రె సంఘవి కరుణాకర్ |
| 33 | బీఆర్ఎస్ | నాకోటి నాగేష్ |
| 34 | కాంగ్రెస్ | రాజ్యలక్ష్మి అమర్ |
| 35 కాంగ్రెస్ | తంగళ్లపల్లి | శ్రీవాణి రవికుమార్ |

## నిజమైన మహారాజ్ సేవాలాల్

- **ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్**
- **బంజారా న్యాయవాదుల ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కోర్టులో శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ జయతి వేడుకలు**



**ముద్ర, ఖమ్మం:**
శ్రీ శ్రీ శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ కేవలం బంజారాలకే మహారాజ్ కాదు గాని యావత్ ప్రపంచానికి మహారాజ్ అని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలో సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా బంజారా న్యాయవాదులు సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి భోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. నేటి సమాజం పరిస్థితులను సుమారు మూడు వందల సంవత్సరాల క్రితమే ఆలోచించ గలగడం ఒక సామాన్య వ్యక్తికి సాధ్యం కాదని, సేవాలాల్ మహారాజ్ ఒక ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు గాని ఒక సామాజిక వ్యక్తాన్ని అన్నారు. ఒకసారి జీవనాన్ని జీవించడం అహింసా మార్గాన్ని అవలంబించాలని చెప్పడం గొప్ప విషయమని, మాత జగదాంబ (మెరమ్మ భవాని) ఆశీస్సులతో ఎన్నో సమాజ హితం కోసం చేసిన కార్యక్రమాలు ఉన్నాయని గుర్తు చేశారు. నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్న తరుణంలో నాడే సేవాలాల్ మహారాజ్ మత్తుకు దూరంగా ఉండాలని, జూదానికి దూరంగా ఉండాలని సమాజ హితాన్ని కోరుకోవాలని బోధించిన మహనీయుడు అని అన్నారు. ఖమ్మం బార్లో సుమారు 50 మంది బంజారా న్యాయవాదులు ఉండడం సంతోషించదగిన విషయమని, చేస్తున్న వృత్తిలో విషయ పరిజ్ఞానాన్ని, జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, జాతి ప్రజల కోసం పాటుపడాలని ఈ సందర్భంగా సూచించారు. బంజారా న్యాయవాదు లు ఇలాంటి సమాజ హితమైన కార్యక్రమాలు చేపట్టడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ గద్దల దిలీప్ మాట్లాడుతూ.. బంజారాల ఐక్యతను చాటే విధంగా సమైక్య జీవనాన్ని గడిపిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఖమ్మం జిల్లా కోర్టులో నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. బంజారాల కోసం మాత్రమే కాకుండా యావత్ మానవాళి, జీవకోటి రక్షణ కోసం సేవాలాల్ మహారాజ్ ఆనాడే అనేక కార్యక్రమాలను చేపట్టారని వివరించారు. అనంతరం సీనియర్ న్యాయవాది కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ. మహనీయుల చరిత్రను గుర్తుంచుకొని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. అనంతరం మాజీ బార అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిజమైన సనాతనవాది శ్రీ సంత సేవాలాల్ అని అన్నారు. హిందూ ధర్మాన్ని చాటి చెప్పిన వ్యక్తి అలాంటి వ్యక్తిని గుర్తు చేసుకోవడం కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

**జిల్లా ప్రధాన న్యాయమూర్తికి బంజారా న్యాయవాదుల సన్మానం.**
శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ను బంజారా న్యాయవాదులు తలపాగాతో పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు బంజారా న్యాయవాదులు మాట్లాడుతూ తమపై అభిమానంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇలాంటి కార్యక్రమానికి హాజరు కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా న్యాయవాదులు ధారావత్ వీరన్న నాయక్, భూక్య హరి నాయక్, ధారావత్ రాందాస్ నాయక్, ధరావత్ ప్రసాద్, జరపల బాలకృష్ణ, బానోత్ అనంత్, బానోత్ దేవేందర్, సునావత్ రవీందర్, జి. విక్రమ్, బి. నాగులు, డి. చందు, జి. కిషన్,జి.వరుణ్, జి.రవీందర్, సునీల్, నందితా దేవి, మణిమాల, ఇందిరా, ప్రమీల, పావని, ఉపేంద్రమ్మ, దుర్గ పాల్గొన్నారు.



## సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ర్యాలీ

**ముద్ర, ఖమ్మం:**
శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలను పురష్కరించుకుని సేవాలాల్ సేన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా సాయి మాట్లాడుతూ... లంబాడీల ఆరాధ్య దైవం, మూల పురుషుడు, గొప్ప దార్శనికుడు సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రతి తండాలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సుమారు వెయ్యి మంది గిరిజన విద్యార్థిని, విద్యార్థులతో నిర్వహించిన ఈ ర్యాలీకి మంచి స్పందన వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీజీటీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా రాంబాబు నాయక్, భూక్యా మంగ్యాజి నాయక్, భావ్ సింగ్ నాయక్, సాయి కుమార్, సాగర్ చౌహన్, బానోతు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేష్ మృతికి కారకుడైన ఎస్సైని సస్పెండ్ చేయాలి

- **మాదిగ ఎమ్మెస్పీ జాతీయ నాయకులు చిలుకూరు మండల ఇంచార్జ్ వంగూరి ఆనందరావు**



**ముద్ర, చిలుకూరు :**
కర్ల రాజేష్ మృతికి ప్రధాన కారకుడైన చిలుకూరి ఎస్సై సురేష్ రెడ్డి సస్పెండ్ అయ్యేంతవరకు పోరాటం ఆగదని ఎంఎస్పీ జాతీయ నాయకులు వంగూరి ఆనందరావు మాదిగ స్పష్టం చేశారు. చిలుకూరు మండల పరిధిలోని మాధవ్ గూడెంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిలక నాగరాజు మాదిగ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.., కర్ల రాజేష్ మరణించి ఇప్పటికీ రెండు నెలలు దాటిన స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి గాని మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి గాని రాజేష్ మృతి పట్ల కనీస స్పందన లేకుండా ఉండటం అనేది సరైనది కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆగ మేఘాల మీద సిఐని సస్పెండ్ చేసిన అధికార యంత్రాంగం గాని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి గాని మంత్రి కుమార్ రెడ్డి గాని ఎస్సై సురేష్ రెడ్డిని ఇంతవరకు ఎందుకు సస్పెండ్ చేయలేకపోతున్నారని అన్నారు. కర్ల రాజేష్ మృతికి కారకులైన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా శాఖ పరంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19వ తేదీన, చిలుకూరు మండల కేంద్రంలో కర్ల రాజేష్ మాదిగ సంతాప సభ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సభలొ పద్మశ్రీ అవార్డు గ్రహీత మహాజననేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడతారని ఆనందరావు మాదిగ తెలియజేశారు. ఈ గ్రామ సభలో మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షులు మాతంగి వీరస్వామి మాదిగ, మరియు గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీ బాధ్యులు మాదిగ పెద్దలు మాదిగ మహిళలు యువకులు మాదాసు గోపి , రాంపండు రామారావు, మాదాసు ఆదినారాయణ, జగ్గంపల్లి బాబు రెడపంగు సుజాత, మాదాసు లక్ష్మి, చిలుక కవిత, మాదాసు వెంకటమ్మ, మాదాసు గురమ్మ, మాదాసు రాధ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనకు ప్రజా ఆమోదం

- **నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**ముద్ర, కోదాడ:**
పురపాలక సంఘం ఎన్నికల్లో ప్రజలు ప్రజా పాలనకే అమోదం తెలిపారని రాష్ట్ర నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సన్న బియ్యం పంపిణీ ఈ ఎన్నికల్లో గేమ్ చెంజర్ గా మారిందని ఆయన చెప్పారు. పురపాలక సంఘాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక జరుగుతున్న అభివృద్ధి, అమలు అవుతున్న సంక్షేమ పథకాలకు ప్రజామోదం లభించిందని అన్నారు. ఈ విజయం పూర్తిగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కష్టంతో సాధించిందని అందుకు తోడ్పాటు నందించిన ఆయా పురపాలక సంఘాల ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2023 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో సూర్యాపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సాధించిన సంచలన విజయాల వరవడి ఆ తరువాత జరిగిన లోక సభ ఎన్నికల్లో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తాజాగా జరిగిన పురపాలక సంఘాల ఎన్నికల్లోనూ కొనసాగిందని ఆయన వ్యాఖ్యానించారు. లోక సభ ఎన్నికల్లో సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ, హుజూర్ నగర్ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఓట్లు భారతదేశ చరిత్రలోనే ప్రత్యేక రికార్డ్ గా నమోదు అయిందని ఆయన గుర్తు చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
14.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**భారత్ రాష్ట్ర సమితి (BRS)**

తెలంగాణలో గతంలో అధికారంలో ఉండి బలమైన కేడర్ కలిగిన పార్టీ.
ప్రస్తుతం తిరిగి అధికారంలోకి రావడానికి వ్యూహాలు సిద్ధం చేస్తోంది.




## మెదక్ లో విజేతలు

చెప్యాల రాజవ్వ (బీఆర్ఎస్),
ఎరుకల నర్సింలు (కాంగ్రెస్),
కోటాల లలితమ్మ (బీఆర్ఎస్),
ధర్మశెట్టి స్వరూప (బీఆర్ఎస్),
మామిళ్ల ఆంజనేయులు (బీఆర్ఎస్),
కొడకంటి హరిత (కాంగ్రెస్),
శంసున్నీసా (కాంగ్రెస్),
మాయా గంగామణి (బీఆర్ఎస్),
జుబేర్ (బీఆర్ఎస్),
చింతల లక్ష్మి స్వరాగిణి (కాంగ్రెస్),
నస్రీన్ బేగం (కాంగ్రెస్),
అనీస్ ఫాతిమా (బీఆర్ఎస్),
చెదల్ సంధ్య (బీఆర్ఎస్),
దొంతి లక్ష్మి (కాంగ్రెస్),
దొంతి నరేష్ గౌడ్ (కాంగ్రెస్),
అవారి రాజ శేఖర్ (బీఆర్ఎస్),
బుజ్జరంపేట అరుణ (బీఎస్పీ)
పాత శశాంక్ (కాంగ్రెస్),
గంటా సంపత్ (కాంగ్రెస్),
మహ్మద్ మన్సూర్ అహ్మద్ (కాంగ్రెస్),
పబ్బా రాజమణి (బీజేపీ).
మహ్మద్ గౌస్ (బీఆర్ఎస్),
మద్దిబోయిన శృతి (బీఆర్ఎస్),
కనుగు రాధిక (కాంగ్రెస్),
ఖాజా సోహెల్ మొహియుద్దీన్ (బీఆర్ఎస్),
మ్యాదరి దీపక్ కుమార్ (బీఆర్ఎస్),
అస్తర్లపల్లె రాణి (బీఆర్ఎస్),
బొడికే అఖిల (బీజేపీ)
బట్టి ఉదయ కుమార్ (బీఆర్ఎస్),
అరుణార్తి వెంకట రమణ (కాంగ్రెస్),
తొడుపునూరి శివ రామ కృష్ణ (కాంగ్రెస్),
గోదల మానస (కాంగ్రెస్)

## మున్సిపల్ కౌంటింగ్ ప్రశాంతం

- కలెక్టర్ రాహుల్ రాజ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ శ్రీనివాసరావు అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదన్నారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా కౌంటింగ్ ప్రక్రియ జరిగిందని పేర్కొన్నారు. ఆర్డీవో రమాదేవి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి డీఎస్పీ ప్రసన్న కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

## సిద్ధిపేట అభివృద్ధిపై కాంగ్రెస్ పగబట్టింది..

**ఎమ్మెల్యే హరీశ్ రావు**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిద్ధిపేట అభివృద్ధిని అడ్డుకుంటోందని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. సిద్దిపేట పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవన్ లో బీజేపీ నుంచి పలువురు యువకులు మాజీ మంత్రి హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ సిద్దిపేట అభివృద్ధిలో తాము భాగస్వాములం అవుతామంటూ బీఆర్ఎస్ లో చేరిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులను వెనక్కి తీసుకెళ్లి అభివృద్ధిని అడ్డుకుంటుందని ధ్వజమెత్తారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకు మంత్రులు, ఎంపీలు సిద్దిపేట అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ ను విమర్శించారన్నారు. ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ ను ఇక్కడే ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. ఆ తరువాత ఉద్యమాన్ని మలుపు తిప్పిన చరిత్ర ఉందన్నారు. అందుకే సిద్దిపేటకు ప్రత్యేకత ఉందని వివరించారు



## కాంగ్రెస్ నాయకుల సంబరాలు

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

జిల్లాలోని ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడాన్ని హర్షిస్తూ ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జోగిపేట చౌరస్తా లోని మహాత్మా బసవేశ్వర స్వామి, బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అందోల్ జోగిపేట మున్సిపాలిటీ లోని 20 వార్డుల్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ నాయకత్వం లో 16 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీ సాధించందన్నారు. భారీ ర్యాలీ లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలను అభినందించారు.

## బిఎస్పీ బీ ఫాంపై గెలుపు

- ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ లో చేరిక

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ మున్సిపాలిటీలోని 17వ వార్డులో బిఎస్పీ తరపున అరుణ పోటీ చేసి 3 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వెంటనే ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ తదితరులు ఉన్నారు.



# మెదక్, నర్సాపూర్ లో హంగ్

- రామాయంపేట పీఠం కాంగ్రెస్,
- తుప్రాన్ బీఆర్ఎస్ కైవసం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ రాగా, మరో రెండింట్లో హంగ్ ఏర్పడింది. శుక్రవారం మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ లో ఓట్లు లెక్కించారు. మెదక్ లో ఒక వార్డు ఏకగ్రీవం కాగా, 31 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఇందులో బీఆర్ఎస్ 15, కాంగ్రెస్ 14, బీజేపీ 2, బిఎస్పీ ఒక చోట విజయం సాధించారు. అయితే బిఎస్పీ నుంచి గెలుపొందిన అరుణ కాంగ్రెస్ లో చేరారు. దీంతో బలం ఇద్దరికీ సమానమైంది. బీజేపీ మద్దతు కీలకంగా మారింది.

**రామాయంపేటలో..**

రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించింది. మొత్తం 12 వార్డులున్నాయి. ఇందులో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 3, బీజేపీ ఒక స్థానంలో గెలుపొందారు. చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలు కాంగ్రెస్ దక్కించుకోనుంది.
నర్సాపూర్ లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 5, బీజేపీ 4 స్థానాల్లో విజయం సాధించారు.

**తూప్రాన్ లో..**

తూప్రాన్ మున్సిపాలిటీలో 16 వార్డులుండగా బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 4, బీజేపీ 3 స్థానాలు గెలుపొందారు. చైర్మన్ పీఠం బీఆర్ఎస్ దక్కించుకోనుంది.

**టాస్, ఒకటి, మూడు ఓట్లతో విజయం**

మెదక్ లో 6వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కే. హరిత బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్ రావు (బీఆర్ఎస్) పై కేవలం ఒక్క ఓటుతో విజయం సాధించారు. రీకౌంటింగ్ చేసిన అదే ఫలితం వచ్చింది. 17వ వార్డులో బీఎస్పీ అభ్యర్థి భుజరంపేట అరుణ కాంగ్రెస్ అభ్యర్థి వైష్ణవిపై కేవలం 3 ఓట్లతో గెలుపొందారు. నర్సాపూర్ 15వ వార్డులో ఇద్దరికి సమానంగా ఓట్లు రావడంతో టాస్ వేయగా బీఆర్ఎస్ అభ్యర్థి పంబాల లలితకు విజయం వరించింది.

**తల్లి, తనయుడు గెలుపు**

14వ వార్డులో దొంతి లక్ష్మి మూడోసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. తనయుడు దొంతి నరేష్ సమీప బంధువు గాయత్రిపై గెలుపొందారు. వీరు కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశారు.

**తనయుడి గెలుపు, తల్లి ఓటమి**

29వ వార్డులో బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన బట్టి ఉదయ్ కుమార్ గెలుపొందారు. 17వ వార్డులో పోటీ చేసిన తల్లి బట్టి లలిత ఓటమిపాలయ్యారు. గత ఎన్నికల్లో తల్లి గెలవగా, తనయుడు ఓటమి చవి చూశాడు.

**రెండోసారి గెలిచింది వీళ్లే..**

దొంతి లక్ష్మి హ్యాట్రిక్ విజయం సాధించారు. 14వ వార్డు నుంచి వరుసగా మూడు సార్లు విజయం సాధించారు. అలాగే 5వ వార్డు నుంచి మామిళ్ల ఆంజనేయులు, 7వ వార్డు నుంచి శంసున్నీసా వరుసగా గెలుపొందగా, 22 వార్డులో గౌస్ ఖురేషీ, 25వ వార్డులో సొహైల్ సైతం ఇది వరకు గెలవగా ఈసారి మళ్లీ గెలిచారు. మిగతా కౌన్సిలర్లు కొత్తవారే గెలుపొందారు.





# వదిన, మరదలు గెలుపు







**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ మున్సిపాలిటీలో వదిన, మరదలు కౌన్సిలర్లుగా గెలుపొందారు. మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో కొట్టాలా లలిత, నాలుగో వార్డులో స్వరూప బీఆర్ఎస్ తరపునన పోటీ చేసి విజయం సాధించారు, వీరు స్వయాన వదిన, మరదలు కావడం.
ఏడో వార్డు నుంచి మాయ అనురాధ, ఎనిమిదో వార్డు నుంచి మాయ గంగమణి బీఆర్ఎస్ తరపున పోటీ చేయగా గంగమణి విజయం సాధించారు. వీరిద్దరూ తోటి కోడళ్లు కావడం విశేషం.

**అబ్బాయ్, బాబాయ్ ఓటమి..**

29వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిగా బొద్దుల కృష్ణ, 20వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థిగా బొద్దుల నవీన్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

**భార్య, భర్తలు గెలుపు..**

రామయంపేట మున్సిపాలిటీలో భార్యాభర్తలు కౌన్సిలర్ లుగా విజయం సాధించారు. గజవాడ నాగరాజు 7వ వార్డు నుంచి అయన సతీమణి లావణ్య 1వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు. లావణ్య మున్సిపల్ చైర్ పర్సన్ అయ్యే అవకాశం ఉంది.

## ఘనంగా ఏడుపాయల జాతర

- కలెక్టర్ రాహుల్ రాజ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఏడుపాయల జాతరను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏ డుపాయల జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్, త్రాగునీరు, పార్కింగ్ పార్కింగ్, సంస్కృతిక కార్యక్రమాలు, దర్శన ఏర్పాట్లు, ఇతర పెండింగ్ లో ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సంవత్సరం జాతరకు దాదాపు పది లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి జాతరను ప్రశాంతంగా ముగించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆలయ ఈవో వీరేశం, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



# అందోల్–జోగిపేట హస్తగతం..

- అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్న కాంగ్రెస్

**సంగారెడ్డి, ముద్ర:**

అందోల్‌జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పోటీ ఉంటుందని అందరు భావించారు. కాని వెలువడ్డ ఫలితాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. అదోల్‌జోగిపేట మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి. ఇందులో కాంగ్రెస్16 స్థానాలు కైవసం చేసుకోగా, మరో స్థానంలో ఆ పార్టీ రెబల్ అభ్యర్థి ఊర్మిళ దుర్గేష్ గెలుపొందారు. రెబల్ అభ్యర్థి గెలుపుతో కాంగ్రెస్ మొత్తం 17 స్థానాల్లో పాగావేసింది. కాగా కేవలం బీఆర్ఎస్ మూడు స్థానాలకే పరిమితమైంది. ఎ న్నికలకు మూడు రోజుల ముందు మంత్రి పట్టణంలో ప్రతి వార్డులో మహిళలతో సమానంగా నేలపై కూర్చొని చేసిన అభివృద్ధి గురించి వివరించారు. ఓటర్ల నాడి కనిపెట్టడంతో మంత్రి సఫలీకృతులు అయ్యారు. చివరిసారి 14 స్థానాలు గెలుపొంది చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకున్న బీఆర్ఎస్ ఈ సారి గల్లంతయింది. 12, 14వ వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పరిమితమైంద.



**చైర్మన్ గా ఎస్. క్రిష్ణారెడ్డి..**

**అందోల్- జోగిపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 16 స్థానాలు గెలుచుకుంది. మంత్రి దామోదర్ ముందుగానే 20వ వార్డు అభ్యర్థి ఎస్. క్రిష్ణారెడ్డిని చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించారు.**



**ఎప్పుడు గెలిచినా ప్రతిపక్షంలోనే..**

13వార్డు నుంచి బీఆర్ ఎస్ కౌన్సిలర్ గా ఎన్నికయిన పట్లూరి శివశేఖర్ కు ప్రతిసారి ప్రతికూలంగా ఉంటుంది. ఆయన గతంలో కాంగ్రెస్ లో మంత్రి దామోదర్ కు నమ్మిన బంటుగా పేరగుగాంచారు. పట్టణంలో మెజార్టీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడం, సేవా కార్యక్రమాలకు ముందుండే నాయకుడిగా మంచి పేరుంది. న్యాయవాది కావడంతో ఆయన వాక్చాతుర్యంతో ఎదుటువారిని కట్టిపడేసే తెలివితేటలు ఉన్నా.. రాజకీయ యోగం కలిసిరావడం లేదు. 2004లో ఎంపీటీసీగా ఓటమి చెందగా అదే పార్టీ మండలంలో మెజార్టీ స్థానాలు గెలుపొంది అధికారం చేజిక్కిచ్చుకుంది. ఆ తర్వాత జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో శివశేఖర్ గెలుపొందగా ఆ పార్టీ మాత్రం తక్కువ స్థానాలకే పరిమితం కావడంతో అధికారం దక్కలేదు. 2014లో ఆయన బీఆర్ ఎస్ లో చేరారు. అప్పుడే నగరపంచాయతీ ఏర్పాటైంది. మొదటి సారిగా చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు తన వదినను బరిలో నిలిపి గెలిపించుకున్నాడు. కాని పార్టీ అభ్యర్థులు గెలువలేకపోయారు. ప్రతిపక్షానికి పరిమితం అయ్యారు. ఈ విధంగా ఆయన గెలిచినా అధికారం మాత్రం ప్రతికూలంగా ఉంటుండటం గమనార్హం.

**13వ వార్డు ప్రతిసారి ప్రతిపక్షమే..**

నగర పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి 13వ వార్డులో ఎవరు గెలిచినా ప్రతిపక్ష పాత్రనే పోషిస్తున్నారు. మొదటి సారి జరిగిన ఎ న్నికల్లో పట్లూరి రజని బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందగా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. రెండోసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున రంగ సురేష్ గెలుపొందగా బీఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టింది. ఈ సారి జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పట్లూరి శివశేఖర్ గెలుపొందగా కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్తానాలు చేజిక్కించుకుంది.

## అందోల్–జోగిపేటలో విజేతలు వీళ్లే

**సంగారెడ్డి, ముద్ర:**

అందోల్ జోగిపేట మున్సిపాలిటీలో గెలుపొందిన అభ్యర్థులు వీరే: 1వ వార్డు గడ్డం అరుణ్ కుమార్, 2వ వార్డు కోశికే రాజశేఖర్. 3వ వార్డు మర్రి అరుణకుమారి, 4వ వార్డు కల్పన రామక్రిష్ణాగౌడ్, 5వ వార్డు కొత్తగొల్ల మాధవి శ్రీనివాస్, 6వ వార్డు రాచకొండ జ్యోతి, 7వ వార్డు తోట్ల రామక్రిష్ణ, 8 వార్డు రాయకొండ నాగరత్నంగౌడ్, 9వార్డు హన్మంత్ రావుపేట శోభారాణి, 10వ వార్డు పట్లోళ్ల రేఖ, 11వ వార్డు కల్పననాగరాజు, 12వ వార్డు కోరబోయిన సరస్వతి,13వ వార్డు పట్లూరి శివశేఖర్, 14వ వార్డు ఊర్మిళ, 15వ వార్డు ఆకుల సత్యనారాయణ, 16వ వార్డు పట్లోళ్ల శ్రీనివాస్, 17వ వార్డు మెఘావత్మేఘరాణి, 18వ వార్డు బేగరి శశిరేఖ, 19వ వార్డు అల్లె మంజుల, 20వ వార్డు ఎస్, క్రిష్ణారెడ్డి గెలుపొందారు. మొత్తం 20 స్థానాల్లో 16 కాంగ్రెస్, 3స్థానాలు బీఆర్ఎస్, 1 స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
14.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**సీపీఐ (CPI)**

వామపక్ష రాజకీయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభావం ఉంది. ఇతర పార్టీలతో కలిసే రాజకీయ వ్యూహాన్ని అనుసరిస్తోంది.





## బంగ్లాదేశ్‌లో అధికారం చేపట్టనున్న బీఎన్‌పీ

- **భారత్‌కు అనుకూల పార్టీనా..?**

**ముద్ర న్యూస్:**

బంగ్లాదేశ్‌లో 18 నెలల మహ్మద్ యూనస్ పాలన ముగియనుంది. తాజాగా నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ నేతృత్వంలోని కూటమి విజయం సాధించింది. ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమవుతోంది. బీఎన్‌పీ చీఫ్ తారీఖ్ అహ్మద్ ప్రధాని కాబోతున్నారు. 18 నెలలుగా భారత వ్యతిరేక విధానాలు అవలంబించిన మహ్మద్ యూనస్ ప్రభుత్వం కారణంగా రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. దీంతో కొత్త ప్రభుత్వం ఎలా ఉంటుంది అన్న ఆసక్తి నెలకొంది. అయితే విశ్లేషకులు మాత్రం బీఎన్‌పీ అధికారంలోకి వస్తున్న నేపథ్యంలో భారత్‌తో సంబంధాలు సానుకూలంగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు.

**పార్టీ చరిత్రలో భారత సంబంధాలు..**

బీఎన్‌పీ మునుపటి పాలనల్లో భారత్‌తో సమతుల్య వాతావరణాన్ని నిర్వర్తించింది. 2001-2006 మధ్య ప్రధాని ఖాలిదా జియా నేతృత్వంలో వాణిజ్యం, ఆర్థిక సహాయం, సరిహద్దు సమస్యలపై చర్చలు సక్రమంగా సాగాయి. అవామీ లీగ్‌తో పోలిస్తే బీఎన్‌పీ తక్కువ ఉద్రిక్తతలు సృష్టించి, పొరుగు దేశాలతో ఆర్థిక సహకారం పొందింది.

**తారీఖ్ రహ్మాన్ వైఖరి..**

తారీఖ్ రహ్మాన్ నేతృత్వం ఆర్థిక పునరుద్ధరణకు భారత వాణిజ్యాన్ని ఆశ్రయిస్తుందని తెలుస్తోంది. ఎన్నికల్లో విజయం సాధించిన తారీఖ్ రహ్మాన్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రెండు దేశాల సత్సంబంధాలు మెరుగుపడేలా సంకేతం ఇచ్చారు. విద్యుత్ సరఫరా, ఆర్థిక సాయం పునరావృతానికి మార్గం తీసుకొస్తుందని అంచనా. క్రికెట్, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా సహజంగా పునరుద్ధరించబడతాయని అంచనా.

**సవాళ్లు, అవకాశాలు..**

జమాత్ మద్దతు కొంత అనిశ్చితిని తెచ్చినప్పటికీ, బీఎన్‌పీ దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా భారత్‌తో సహకారాన్ని పెంచుతుంది. హిందూ సమాజ రక్షణపై ప్రాధాన్యత ఇస్తూ విశ్వాసాన్ని తిరిగి పొందుతుంది. దీర్ఘకాలంలో వాణిజ్యం, రక్షణ, మౌలిక సదుపాయాల్లో ద్విపక్ష బంధాలు బలపడే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. ఈ పార్టీ భారత్‌కు అనుకూల వాతావరణం పెంపొందించే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి.

## బోణీ కొట్టన సింహం..

**ముద్ర డెస్క్:**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఈసారి ఓ సంచలనం నమోదైంది. అధికా కాంగ్రెస్ హవా కొనసాగింది. అయితే ఈ ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీల మధ్య పోటీ ఉంటుందని అంచనా వేశారు. అయితే ఈ ఎన్నికల్లో జనసేన పోటీ చేసింది. ఇక బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన మాజీ సీఎం కేసీఆర్ కూతురు, జాగృతి అధినేత కల్వకుంట్ల కవిత మున్సిపల్ ఎన్నికల్లో ఆలిండియా ఫార్వడ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ)కు మద్దతు ఇచ్చారు. కవిత నేతృత్వంలోని జాగృతి మద్దతుతో ఏఐఎఫ్‌బీ పోటీ చేసింది.

**వడ్డేపల్లి మున్సిపల్ కైవసం..**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఏఐఎఫ్‌బీ సంచలనం నమోదు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో ఎన్నడూ ఏఐఎఫ్‌బీ పెద్దగా ప్రభావం చూపలేదు. రామగుండం ఎమ్మెల్యేగా కోరుకంటి చందర్ 2018లో పోటీచేసి గెలిచారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒకటి, రెండు వార్డులు మాత్రమే గెలిచేది. కానీ ఈసారి కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని జాగృతి మద్దతుతో పోటీ చేసిన ఏఐఎఫ్‌బీ బోణీ కొట్టింది. ఆలంపూర్ నియోజకవర్గం పరిధిలోని వడ్డేపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. ఇక్కడ పది వార్డులు ఉండగా, 8 వార్డుల్లో ఏఐఎఫ్‌బీ అభ్యర్థులు విజయం సాధించారు.

**మిగతా చోట్ల స్వల్ప ప్రభావం..**

ఏఐఎఫ్‌బీ ప్రభావం ఇప్పటి వరకు వడ్డేపల్లి మినహా ఎక్కడా పెద్దగా కనిపించలేదు. పెద్దపల్లిలో 5 వార్డుల్లో గెలిచింది. ఇక సుల్తానాబాద్, మంథనిలో స్వల్పంగా పోటీ ఇచ్చింది. మంచిర్యాల కార్పొరేషన్‌లో కూడా స్వల్పంగా ప్రభావం చూపింది.

**కనిపించని జనసేన ప్రభావం..**

ఇక మున్సిపల్ ఎన్నికల్లో జనసేన కూడా కొన్నిచోట్ల పోటీ చేసింది. ఖమ్మం జిల్లాలో ఎక్కువ స్థానాల్లో హైదరాబాద్ శివారు మున్సిపాలిటీల్లో కొన్నిచోట్ల జనసేన తరఫున అభ్యర్థులు బరిలో నిలిచారు. జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉంది. టీడీపీ, బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలనుకుంది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కూడా ప్రచారానికి రావాలనుకున్నారు. కానీ బీజేపీ సూచనతో చేయలేదు. దీంతో మున్సిపల్ ఎన్నికల్లో జనసేన ఒక్క వార్డులో కూడా గెలవలేదు.

## దటీజ్ మోదీ..

**ముద్ర డెస్క్ :**

మన దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్టైలే వేరు.. ఎవడికి ఎక్కడ చెక్ పెట్టాలో.. ఎవరిని ఎలా అణచివేయాలో ఆయనకు తెలిసినంత ఎవరికీ తెలియదు. దేశం కోసం ఆయన ఏమైనా చేస్తారు. దేశం ఫస్ట్ నినాదాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తారు. తనను ద్వేషించినా, ధూషించినా పట్టించుకోరు. సంపాదించాలనే యావ లేని వ్యక్తి. గతంలో చైనాకు లొంగిపోయాడని కాంగ్రెస్ మోదీపై ఆరోపణలు చేసింది. ఇక అంబానీ అదానీకి దోచి పెడుతున్నాడని ఆరోపిస్తోంది. గతంలో రఫేల్ కొనుగోలుపైనా రాద్ధాంతం చేసింది కాంగ్రెస్.

**సియాచెన్‌తో కీలక ఒప్పందం..**

సియాచెన్ కశ్మీర్‌కు 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న ద్వీపం. గతంలో దీనిపై చైనా ఆధిపత్యం చెలాయించింది. బెదిరిస్తూ వాడుకుంది. మోజాంబిక్ ఛానల్‌కు కీలకమైన సియాచెల్స్‌లో ఇప్పుడు మోదీ చక్రం తిప్పబోతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సియాచెన్‌కు 175 మిలియన్ డాలర్ల ఆర్థికసాయం ప్రకటించారు. అక్కడ నావీ బేస్ ఏర్పాటు చేయబోతున్నారు.

**స్థానికులకు వసతులు..**

భారత్ ఆర్థికసాయంతో గృహ నిర్మాణం, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ఉన్నాయి. మోజాంబిక్ ఛానెల్ వైపు చైనా షిప్పింగ్ రాకపోకలను గమనించేలా భారత నేవీ బేస్ ఏర్పాటు అవుతుంది. గతంలో చైనా బెదిరింపులు విఫలమైన నేపథ్యంలో ఈ అడుగు వ్యూహాత్మకం.

**చైనాకు వ్యూహాత్మక దెబ్బ..**

చైనా భారత చుట్టూ నౌకల మోహర్ వేస్తుంటే, సియాచెన్ బేస్ దాని ఆధిపత్యాన్ని ఎదుర్కొంటుంది. ఇది హిందూ మహాసముద్రంలో భారత పత్రిక స్థిరపడుతుందన్న సంకేతం. మోదీ దీర్ఘకాలిక దృష్టితో ఆర్థిక సహాయం ద్వారా మిత్రత్వాలు పెంచుకుంటూ, రక్షణ ప్రాంగణాన్ని బలోపేతం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత ఆధిపత్యం పెరుగుతుంది.





## బండి సంజయ్ 'వన్ మ్యాన్ షో'

- **కరీంనగర్ కంచుకోటపై 'బండి' ముద్ర**

**ముద్ర, కరీంనగర్:**

రాజకీయం అంటే కేవలం లెక్కలు మాత్రమే కాదు, అంతకు మించిన ప్రజా క్షేత్ర పోరాటం అని కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ మరోసారి నిరూపించారు. ఇటీవల పరిణామాలను గమనిస్తే ఈ విజయం కేవలం పార్టీ విజయంగా కాకుండా, బండి సంజయ్ వ్యక్తిగత చొరవ, వ్యూహరచన ఫలితంగానే కనిపిస్తోంది. అక్షరాలా ఇది ఒక 'వన్ మ్యాన్ షో'.

**క్షేత్రస్థాయిలో అలుపెరుగని పోరాటం..**

ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి ఫలితాలు వచ్చే వరకు బండి సంజయ్ విశ్రాంతి అనే పదానికి చోటు ఇవ్వలేదు. మూడు నెలలుగా ఆయన గడిపిన తీరు ఒక కేస్ స్టడీలా నిలుస్తుంది. ఢిల్లీలో కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, గల్లీలో సామాన్య కార్యకర్తలా తిరగడం ఆయనకే చెల్లింది.

**నిరంతర పర్యవేక్షణ..**

అభ్యర్థుల ఎంపికలో మొండితనం, గెలుపు గుర్రాలను గుర్తించడంలో ఆయన చూపిన చొరవ అద్భుతం.

**కార్యకర్తలే బలం..**

ప్రతి గల్లీని చుట్టేస్తూ నిరుత్సాహంలో ఉన్న కార్యకర్తల్లో సైతం కొత్త ఊపిరి పోశారు. నాయకుడు వెన్నంటి ఉంటే సైన్యం ఎలా పోరాడుతుందో ఈ ఎన్నికల్లో స్పష్టమైంది.

**వ్యూహమే ఆయుధంగా..**

ప్రత్యర్థి పార్టీలు బలమైన ఆర్థిక, అంగ బలంతో ఉన్నప్పటికీ, సంజయ్ తనదైన వ్యూహ ప్రతివ్యూహాలతో వారిని ఉక్కిరిబిక్కిరి చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడా రాజీ పడకుండా, వనరుల సమీకరణలోనూ, ప్రచార పర్వంలోనూ ఆయన చూపిన దూకుడు ప్రత్యర్థులను ఆత్మరక్షణలో పడేసింది.

"నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు, ముందుండి నడిపించడం." బండి సంజయ్ సరిగ్గా ఇదే చేశారు. కేవలం సభలకే పరిమితం కాకుండా, వ్యూహాత్మక సమావేశాలు నిర్వహిస్తూ శత్రువు ఎత్తులను చిత్తు చేశారు.

ఈ విజయం బండి సంజయ్ రాజకీయ ప్రస్థానంలో ఒక మైలురాయి. స్థానిక ఎంపీగా తన పట్టును నిరూపించుకోవడమే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో తన ప్రాధాన్యతను మరోసారి చాటిచెప్పారు. కష్టపడితే ఫలితం దక్కుతుందని, దానికి నిరంతర శ్రమ తోడవ్వాలని ఆయన పనితీరు చాటిచెబుతోంది. ఈ 'వన్ మ్యాన్ షో' రాబోయే రోజుల్లో మరిన్ని రాజకీయ సమీకరణాలకు నాంది కానుంది.

## డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో నివసించకపోతే రద్దు

- **అర్హులైన ఇతరులకు కేటాయింపు..**
- **హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతం**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

డబల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో లబ్ధిదారులు నివసించక పోతే, వాటి కేటాయింపును రద్దు చేస్తామని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి. పి. గౌతమ్ స్పష్టం చేశారు. వివిధ దశల్లో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పఠాన్ చెరు అసెంబ్లీ నియోజకవర్గం లోని పలు డబల్ బెడ్ రూమ్ కాలనీ లను సందర్శించి, పనుల పురోగతిని సమీక్షించారు. హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్య కూమార్, సంగారెడ్డి ప్రాజెక్టు డైరెక్టర్ సి. చలపతి రావు, ఎగ్జుక్యూటివ్ ఇంజనీర్లు రవీందర్, డి.నర్సయ్య తదితరులతో కలిసి కర్దనూరు, పోచారం, అమీన్ పూర్, రామేశ్వరం బండ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఆయా కాలనీల్లోని స్థితిగతులను తెలుసుకున్నారు. ఇళ్లలో నివసించకపోతు రద్దు చేసి అర్హులైన ఇతరులకు మంజూరు చేస్తామని తెలిపారు. తొలుత కర్దనూనార్ లో సుమారు 9 ఎకరాల విస్తీర్ణం లో దాదాపు రూ. 140 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న కాలనీ లోని పనులన్నీ నెల రోజుల్లో పూర్తి చేసి నివాస యోగ్యంగా తీర్చిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించారు. ఇక్కడ ప్రధానంగా మౌలిక వసతుల పనులు మాత్రమే మిగిలి ఉన్నందున, వాటన్నిటిని పూర్తి చేసి, వచ్చే నెలలో లబ్ధిదారులకు కేటాయించేలా చూడాలన్నారు. శంకరపల్లి ప్రధాన రహదారిలో, అవుటర్ రింగ్ రోడ్డుకు అత్యంత సమీపంలో ఉన్న ఈ కాలనీ మంచి ల్యాండ్ మార్క్ గా రూపొందుతుందని తెలిపారు. కాలనీలో మెరుగైన వసతులతో పాటు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. మొదటి ఫేస్ లో పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించిన 540 ఇళ్ల కాలనీని తనిఖీ చేశారు. ఇక్కడ లబ్ధిదారులే నివసిస్తున్నారా, లేదా అన్న అంశం పై సమాచారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ అసోసియేషన్ సీసీ కెమెరా లు ఏర్పాటు చేసుకుని, సెక్యూరిటీ సిబ్బందిని కూడా నియమించుకోవడంపై అభినందించారు. ఆయ బ్లాక్ లో ఏ ఫ్లాట్ లో ఎవరు ఉంటున్నారన్న లిస్టును కూడా ఏర్పాటు చేసుకోవడాన్ని ప్రశంసించారు. ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఇళ్లల్లో నివసించకుండా కేవలం తాళాలు వేసుకుని, లేదా అద్దెకు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడితే కఠింగా వ్యవహస్తామని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని బల్డింగ్ అసోసియేషన్ వారు సభ్యులందరికీ చెప్పాలన్నారు. అనంతరం పోచారంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.62 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 720 ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ పనులన్నీ వచ్చే నెలలో పూర్తి కానున్న నేపథ్యంలో, పాఠశాలలు, అంగన్ వాడీ సెంటర్, కమ్యూనిటీహాల్ వంటివి కూడా నిర్మించాలని అధికారులకు సూచించారు. అమీన్ పూర్ లో ఇప్పటకే లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్ రూం కాలనీలో విస్తృతంగా పర్యటించారు. నిర్మాణంలో ఉన్న పనులపై సమీక్షించారు. రామేశ్వరం బండ లోని జెఎన్ ఎన్ యుఆర్ ఎం కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



## 'ఎలివేటెడ్' నిర్వాసితులకు న్యాయం చేస్తాం
### హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసర




**ముద్ర, హైదరాబాద్:**

ఎలివేటెడ్ కారిడార్ భూ నిర్వాసితులకు న్యాయం చేస్తామని హైదరాబాద్ కలెక్టర్ హరి చందన దాసరి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ కమిటీ సభ్యులతో భేటీ అయ్యారు. భూ నిర్వాసితులతో మాట్లాడి వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశానికి హైదరాబాద్ పరిధిలోని ప్యారడైజ్ నుంచి లోతుకుంట పరిధి వరకు 11.70 కిలోమీటర్ల భూ సేకరణకు సంబంధించి తిరుమలగిరి, కాకాగుడా, తోకట్ట, మచ్చ బొల్లారం గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ భూ నిర్వాసితులకు పరిహారం విషయంలో ప్రభుత్వ విధివిధానాలు తెలియజేశారు. హైదరాబాద్ లోని పారడైజ్ జంక్షన్ నుంచి షామీర్ పేట ఓ ఆర్ ఆర్ జంక్షన్ వరకు 18.70 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు భూ సేకరణ ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎలివేటెడ్ కారిడార్ మార్గంలో ట్రాఫిక్ తగ్గింపు, కనెక్టివిటీ మెరుగుదల, పట్టణ మౌలిక సదుపాయాల బలోపేతానికి ఈ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ ఎంతో అవసరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భూ సేకరణ అధికారి అపర్ణ, హెచ్ఎండిఏ భూసేకరణ అధికారి అర్చన, ఆర్ అండ్ బీ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



## ఆ హైదరాబాద్ వాడిని అడ్డుకోండి..

- **అతడు యూపీకి వస్తే మనల్ని ఖతం చేస్తాడు**
- **ఎంపీ అసదొద్దీన్ పై ఏఐసీసీ చీఫ్ పరోక్ష వ్యాఖ్యలు**
- **యూపీ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ కు హెచ్చరిక**

**ముద్ర, న్యూఢిల్లీ:**

ఆ హైదరాబాద్ వాడిని యూపీకి అస్సలు రానీయొద్దు.. అతను వస్తే మనల్ని ఖతం చేసి పోతాడని ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా.. హైదరాబాద్ అంటేనే షేర్వానీ. బిర్యానీ, పరేషానీ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో యూపీకి చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్‌తో పాటు మరో ఇద్దరు నేతలతో ఖర్గే సంభాషించారు. ఇందులో హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదొద్దీన్ ఓవైసీని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. నేరుగా అసదొద్దీన్ పేరును ప్రస్తావించకుండానే ఆయనతో జాగ్రత్తగా ఉండాలని ఇమ్రాన్ మసూద్ ను అప్రమత్తం చేశారు. అసదొద్దీన్ ను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. ముస్లిం ఓటు బ్యాంకు కలిగిన ఇమ్రాన్ మసూద్ వంటి నేతలతో ఖర్గే మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేయడం వెనుక రాజకీయ ప్రాధాన్యత నెలకొన్నది. దీంతో ఖర్గేకు హైదరాబాద్ అంటే ఎందుకంత భయం? అని నెటిజన్లు ప్రశ్నించారు. ఓవైసీ పేరు ఎత్తకుండానే ఖర్గే తనలోని భయాన్ని బయటపెట్టారని విమర్శిస్తున్నారు. ఖర్గే చేసిన ఈ 'ఆఫ్ ది రికార్డ్' సంభాషణ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

ముద్ర
14.02.2026 శనివారం, హైదరాబాద్



సీపీఎం (CPM)
కార్మిక, రైతు ఉద్యమాల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ఎన్నికల్లో పొత్తుల ద్వారా ప్రాధాన్యత పెంచుకునే ప్రయత్నం చేస్తోంది.



## మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఫలితాలు

**ముద్ర ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. 60 డివిజన్ల లో ఇప్పటి వరకు 58 డివిజన్ల ఫలితాలు వచ్చాయి. ఇందులో కాంగ్రెస్ కు 29, బీఆర్ఎస్ కు 14, బీజేపీకి 7, ఏంఐఎం కు 3, ఇండిపెండెంట్లు ఐదుగురు విజయం సాధించారు. ఇక్కడ మేజిక్ ఫిగర్ 31 డివిజన్ల లో గెలుపొందితే మేయర్ పీఠం కైవసం చేసుకోవచ్చు. ఈ మేజిక్ ఫిగర్ కు స్వల్ప దూరం లో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఇంకా రెండు డివిజన్ల ఫలితాలు వెల్లడికావాల్సి ఉంది.

## నగరంలో పార్కుల పరిరక్షణకు హైడ్రా చర్యలు

- **మొత్తం 3,041 గజాల స్థలం స్వాధీనం**
- **రూ.34.12 కోట్ల విలువైన భూమికి రక్షణ**

**ముద్ర, హైదరాబాద్ :**

నగరంలో పార్కులపై జరుగుతున్న ఆక్రమణలను హైడ్రా అధికారులు కఠినంగా పరిగణిస్తూ వరుస చర్యలు చేపట్టారు. శుక్రవారం ఒక్కరోజే రెండు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించి మొత్తం 3,041 గజాల పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూముల అంచనా విలువ సుమారు రూ.34.12 కోట్లుగా అధికారులు తెలిపారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల గ్రామంలోని సుభాష్‌నగర్ పరిధి భాగ్యలక్ష్మి కాలనీలో 1968లో ఏర్పాటు చేసిన విభజన ప్రణాళికలో 10 పార్కులకు స్థలం కేటాయించారు. కాలక్రమేణా వాటిలో ఆరు పార్కులు ఆక్రమణకు గురయ్యాయి. ఫిర్యాదుల మేరకు హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాలపై అధికారులు పరిశీలన చేపట్టి, వరుసగా ఉన్న ఆరు పార్కులలో ఆక్రమణలను తొలగించారు. సుమారు 2,260 గజాల విస్తీర్ణంలో కంచె వేసి, పార్కు స్థలంగా బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్‌లోని ఏజీ ఆఫీస్ సహకార గృహ నిర్మాణ సంఘం విభజన ప్రణాళికలో పార్కుగా కేటాయించిన స్థలం కూడా ఆక్రమణకు గురైంది. స్థానికుల ఫిర్యాదుతో క్షేత్రస్థాయి విచారణ నిర్వహించిన అధికారులు సుమారు 1,152 గజాల స్థలాన్ని ఖాళీ చేయించి కంచె వేశారు. దీంతో ఆయా ప్రాంతాల నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎవరి చేతికి అధికారం..?

- **హంగ్ మున్సిపాలిటీల్లో ఎవరికి అడ్వాంటేజ్?**
- **స్వతంత్రులు అధికార పార్టీకే జై కొడతారా?**
- **మెజారిటీ లేకున్నా మేయర్ పీఠాలపై కాంగ్రెస్ దృష్టి... వ్యూహాలు వేగం!**
- **ఇండిపెండెంట్ల మద్దతు, ఎక్స్ అఫీషియో ఓట్లతో అధికారానికి దగ్గరలో కాంగ్రెస్**
- **హంగ్ ఫలితాల్లో 'హస్తం'కు లాభం... రెబల్స్ తిరిగి గూటికి?**
- **ఫిరాయింపులు, మద్దతులతో మున్సిపల్ పీఠాలపై ఆధిపత్యం కోసం పార్టీల పోటీ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సరికొత్త మలుపు తిప్పాయి. దాదాపు 30కు పైగా మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో హంగ్ ఏర్పడినప్పటికీ, అధికార కాంగ్రెస్ పార్టీ పక్కా వ్యూహంతో ఆ పీఠాలను కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ప్రజా తీర్పులో అనిశ్చితి కనిపించిన చోట కూడా రాజకీయ చదరంగంలో పైచేయి సాధించి, మున్సిపల్ కోటలపై తన జెండాను ఎగురవేయడానికి హస్తం పార్టీ సిద్ధమైంది.

**అధికార పార్టీ వైపే ఇండిపెండెంట్లు**

ఈ రాజకీయ అనిశ్చితిలో స్వతంత్ర అభ్యర్థులే నిర్ణయాత్మక శక్తి మారారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే, గెలిచిన స్వతంత్రులలో అత్యధికులు కాంగ్రెస్ రెబల్స్ కావడమే ఆ పార్టీకి పెద్ద ఊరటనిస్తోంది. టికెట్ రాలేదన్న అసంతృప్తితో బరిలోకి దిగి గెలిచిన వీరంతా, ఇప్పుడు తిరిగి తమ సొంత గూటికి చేరుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో హంగ్ ఏర్పడిన మెజారిటీ పురపాలికలు అధికార పార్టీ ఖాతాలో చేరడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

**ఎక్స్ అఫీషియో ఓట్లు అదనం**

మెజారిటీకి స్వల్ప దూరంలో నిలిచిన చోట్ల కాంగ్రెస్ తన అత్యంత బలమైన ఎక్స్అఫీషియో ఓట్ల అస్త్రాన్ని ప్రయోగించబోతోంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఉండే ఈ ఓటు హక్కు, హంగ్ మున్సిపాలిటీల్లో ఫలితాన్ని తారుమారు చేసే సామర్థ్యం కలిగి ఉంది. రాష్ట్రంలో అధికారంలో ఉండటం వల్ల మెజారిటీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రతినిధులే ఉండటం ఆ పార్టీకి కలిసివచ్చే అంశం. ఇప్పటికే గెలిచిన స్థానాలకు తోడు, స్వతంత్రుల మద్దతు, ఎక్స్అఫీషియో ఓట్లతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100కు పైగా మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పీఠాలను దక్కించుకునేలా ప్రణాళికలు రచిస్తోంది.

**కొన్ని ఫిరాయింపులు కూడా ఉండొచ్చు..!**

క్షేత్రస్థాయిలో గెలిచిన స్వతంత్ర అభ్యర్థులు కూడా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రతిపక్షంలో ఉంటే వార్డుల అభివృద్ధికి నిధులు రావడం కష్టమనే భావన వారిలో బలంగా ఉంది. అధికార పార్టీతో ఉంటేనే అభివృద్ధి సాధ్యం అనే సూత్రాన్ని నమ్ముతున్న స్వతంత్రులు, ప్రభుత్వానికి మద్దతు తెలపడం ద్వారా తమ రాజకీయ భవిష్యత్తును సుస్థిరం చేసుకోవాలని భావిస్తున్నారు. ఇదే సూత్రంతో కొన్ని ఫిరాయింపులు ఉండవని కూడా అనుకోలేం. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి అయాచిత వరంగా మారింది. ఫిబ్రవరి 16న కొత్తగా ఎన్నికైన అభ్యర్థుల ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అప్పటి వరకు గెలిచిన అభ్యర్థులను కాపాడుకోవడం, స్వతంత్రులను సమన్వయం చేసుకోవడంపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఫలితాల్లో హంగ్ కనిపించినా, అంతిమంగా అధికార బలంతో మున్సిపల్ పాలనపై కాంగ్రెస్ పూర్తి పట్టు సాధించే దిశగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.



## రంగారెడ్డి జిల్లా మున్సి 'పోల్స్ 'లో మిశ్రమ ఫలితాలు

- **ప్రధాన పార్టీలకు పట్టణ ఓటర్ల భిన్న తీర్పు**
- **అధికార కాంగ్రెస్‌కు స్వల్ప ఆధిక్యత**
- **అన్నిచోట్లా గట్టిపోటీతో పరువు నిలుపుకున్న బీఆర్ఎస్**
- **వార్డుల్లో గెలిచి ఉనికిని చాటుకున్న బీజేపీ**
- **కాంగ్రెస్ ఖాతాలో షాద్‌నగర్, శంకర్‌పల్లి, చేవెళ్ల మున్సిపాలిటీలు**
- **ఇబ్రహీంపట్నం, ఆమన్‌గల్ మున్సిపాలిటీలపై గులాభీ జెండా**
- **మొయినాబాద్ మున్సిపాలిటీలో హంగ్... ఇక్కడ కింగ్ మేకర్‌గా ఇండిపెండెంట్లు**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**



జిల్లాలో మున్సిపోల్స్‌పై తీవ్ర ఉత్కంఠ వీడింది. ఎగ్జిట్ పోల్ సర్వేలు, రాజకీయ పార్టీల అంచనాలకు భిన్నంగా శుక్రవారం ఓట్ల లెక్కింపులో మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. అధికార కాంగ్రెస్‌కు అధిక స్థానాలు కట్టబెడుతూనే బీఆర్ఎస్‌ను సైతం ఆదరించారు. మరో ప్రధాన పార్టీ బీజేపీకి కూడా గతంలో కంటే మెరుగైన ఫలితాలను అందించారు. అయితే, పోటీకి దిగిన అన్నిస్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఎంతో శ్రమించిన ప్రధాన రాజకీయ పార్టీలకు జిల్లా మున్సిపల్ ఓటర్ల తీర్పు కొంతమేర నిరాశను కలిగించిందనే చెప్పుకోవాలి. మొత్తానికి అంచనాలకు తగ్గట్టుగా కాకున్నా.. పుర పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ ఇటు చైర్మన్ పీఠాల్లో, వార్డు స్థానాల్లోనూ స్వల్ప ఆధిక్యతను కనబర్చింది. ఈమేరకు జిల్లాలో ఎన్నికలు జరిగిన 6 మున్సిపాలిటీల్లో 3 చోట్లా చైర్మన్ పీఠాలను ఆ పార్టీ గెలుపొందింది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సైతం ఈ ఎన్నికల్లో కొంత వెనుకబడింది. కాకపోతే అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీనిచ్చి 2 మున్సిపల్ చైర్మన్ పీఠాలను గెలుపొంది రెండోస్థానంలో నిలిచింది. ఇక కేంద్రంలో అధికార పార్టీగా ఉంటూ క్రమేపీ బలపడుతూ వస్తున్న బీజేపీ జిల్లాలో ఒక మున్సిపాలిటీపై కూడా కాషాయ జెండాను ఎగుర వేయలేకపోయింది. గతంలో కంటే ఎక్కువ మున్సిపల్ వార్డులను దక్కించుకోవడంలో కమలనాథులు కొంతమేర సఫలీకృతులయ్యారనే చెప్పుకోవాలి. మొత్తంగా జిల్లాలో మున్సిపాలిటీ ప్రజలు ఇచ్చిన భిన్నమైన తీర్పుతో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌తోపాటు బీజేపీల గెలుపు లెక్కలు తప్పాయి. జిల్లాలో 2020 సంవత్సరంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఒక్క చోట కూడా చైర్మన్ పీఠాన్ని గెలుపొందలేదు. అయితే తాజాగా షాద్‌నగర్, శంకర్‌పల్లితో పాటు కొత్తగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీల చైర్మన్ పీఠాలను కైవసం చేసుకొని ఆధిక్యత కనబర్చింది. మొయినాబాద్‌లో అధిక వార్డులు గెలిచిన పార్టీగా ముందుకు వచ్చింది. ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్‌కు గట్టి పోటీనిచ్చి రెండోస్థానంలో నిలిచింది. ఆమన్‌గల్ మున్సిపాలిటీలో మాత్రం ఒకే ఒక్క వార్డుతో సరిపెట్టుకొని కాంగ్రెస్ పూర్తిగా చతికిలపడింది. ఇక బీఆర్ ఎస్ విషయానికొస్తే.. గత మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీగా బీఆర్ఎస్ జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లోనూ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆదిబట్ల, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, శంకర్‌పల్లి మున్సిపాలిటీల్లో కారు పార్టీ ఘన విజయం సాధించి తిరుగులేని సత్తా చాటింది. అయితే, తాజాగా ఎన్నికలు జరిగిన ఆరు మున్సిపాలిటీల్లో షాద్‌నగర్, శంకర్‌పల్లి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ ఓటమి చెందింది. కాకపోతే, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని తిరిగి నిలబెట్టుకొని, గతంలో బీజేపీ చేతిలో ఉన్న ఆమన్‌గల్ మున్సిపాలిటీలోనూ పాగా వేసి అధికార కాంగ్రెస్‌కు ధీటుగా ఎన్నికల్లో నిలబడింది. అయితే తాజా ఎన్నికల ఫలితాలు బీజేపీని తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఆరు మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్, బీఆర్ ఎస్‌తో పోటాపోటీగా ఎన్నికల బరిలో నిలిచినా ఆశించిన ఫలితాలు రాకపోగా, గతంలో తమ చేతిలో ఉన్న ఆమన్‌గల్ మున్సిపాలిటీని సైతం బీజేపీ కోల్పోయింది.

**కాంగ్రెస్‌కు 3, బీఆర్ఎస్‌కు 2 చైర్మన్ పీఠాలు**

మున్సిపల్ ఎన్నికల్లో జిల్లా ఓటర్లు అధికార కాంగ్రెస్‌కు కొంతమేర ఆధిక్యతను కట్టబెట్టారు. ఎన్నికలు జరిగిన 6 మున్సిపాలిటీల్లో ఆమన్‌గల్, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, శంకరపల్లి గతంలో ఉన్నవే. కాకపోతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొయినాబాద్, చేవెళ్లను కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు. ఈనెల 11న ఈ మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించగా, శుక్రవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ మేరకు జిల్లా ఓటర్లు 3 చోట్లా కాంగ్రెస్‌ను, 2 చోట్లా బీఆర్ఎస్‌ను గెలిపించారు. మొయినాబాద్ మున్సిపాలిటీలో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ వార్డులు దక్కకపోవడంతో ఇక్కడ హంగ్ ఏర్పడింది. అయితే కాంగ్రెస్ స్వల్ప ఆధిక్యతను సాధిస్తూ వచ్చింది. ఈ క్రమంలో షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి మున్సిపాలిటీల్లో అధికార పార్టీ స్పష్టమైన మెజార్టీ వార్డు స్థానాలను గెల్చుకొని చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుంది. షాద్‌నగర్ మున్సిపాలిటీలో 28 వార్డులకు గాను కాంగ్రెస్ 15 వార్డుల్లో, బీఆర్ఎస్ 11 వార్డుల్లో, బీజేపీ, స్వతంత్రుడు 1 వార్డుల్లో గెలిచారు. చేవెళ్ల మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను కాంగ్రెస్ 11వార్డులు, బీఆర్ఎస్ 4 వార్డులు, బీజేపీ 3వార్డులు దక్కించుకున్నాయి. శంకర్‌పల్లి మున్సిపాలిటీలో 15 వార్డుల్లో కాంగ్రెస్‌కు 9 వార్డులు, బీఆర్ ఎస్‌కు 4 వార్డులు, ఇండిపెండెంట్లకు 2 వార్డులు దక్కాయి. మరోవైపు ఇబ్రహీంపట్నం, ఆమన్‌గల్ మున్సిపాలిటీలు బీఆర్ ఎస్ ఖాతాలో చేరాయి. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులుంటే బీఆర్ఎస్ 13, కాంగ్రెస్ 8, బీజేపీ 2వార్డుల చొప్పున గెలుపొందాయి. ఆమన్‌గల్ మున్సిపాలిటీలో మొత్తం 15వార్డులకు గాను బీఆర్ఎస్ 8, బీజేపీ 6, కాంగ్రెస్ 1 వార్డును దక్కించుకున్నాయి.

**మొయినాబాద్‌లో 'హంగ్'తో అనిశ్చితి..!**

కొత్తగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీలో ఏ పార్టీకి మెజార్టీ వార్డు స్థానాలు దక్కలేదు. ఇక్కడ మొత్తం 26 వార్డులు ఉండగా, చైర్మన్ పీఠం దక్కించుకోవడానికి మ్యాజిక్ ఫిగర్ 14 వార్డులు. అయితే కాంగ్రెస్ 10స్థానాల్లో గెలిచి అతి పెద్ద పార్టీగా నిలబడింది.బీఆర్ఎస్ 7 స్థానాల్లో, బీజేపీ 4 స్థానాల్లో, ఇండిపెండెంట్లు 5స్థానాల్లో గెలుపొందారు. దీంతో ఇక్కడ చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు ఏ పార్టీకి బలం లేకపోవడంతో అనిశ్చితి(హంగ్ )ఏర్పడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ చేతికి మున్సిపల్ పీఠం చిక్కాలంటే గెలిచిన మరో నలుగురు వార్డు కౌన్సిలర్లు అవసరం ఉంటుంది. అయితే గెలిచిన 5 మంది ఇండిపెండెంట్లను తమ వైపుకు తిప్పుకొని మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తారా? అన్నది ఉత్కంఠగా మారింది. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ నుంచి గెలిచిన 11మంది వార్డు కౌన్సిలర్లు మరో 5 మంది ఇండిపెండెంట్ కౌన్సిలర్ల మద్దతుతో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకొని అధికార కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇస్తారా? లేదా?అన్నది వేచిచూడాలి. కాగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఈనెల 16న జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో గెలపొందిన మున్సిపల్ కౌన్సిలర్లతో పాటుగా ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు రాజ్యసభ ఎంపీలు, ఎమ్మెల్సీలకు సైతం ఓటు హక్కు ఉంటుంది. ఈ నేపథ్యంలో చైర్మన్, వైఎస్ చైర్మన్ పదవులను గెల్చుకునేందుకు ఆయా మున్సిపాలిటీల్లో పార్టీల కౌన్సిలర్ల బలాబలాలను బట్టి కాంగ్రెస్, బీఆర్ ఎస్, బీజేపీలు ఎత్తులు, పై ఎత్తులతో వ్యూహాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి.

## కుర్చీ కోసం డీల్ పాలిటిక్స్

- **మున్సిపాలిటీల్లో స్వతంత్రుల హవా**
- **ఒక్క సీటుతో కీలక పాత్ర**
- **మద్దతు కోసం పార్టీల పరుగులు**
- **గొంతెమ్మ కోరికలు మొదలు**
- **కుర్చీ కోసం కఠిన షరతులు**
- **హంగ్ మున్సిపాలిటీల్లో హై టెన్షన్**
- **పార్టీలకు కొత్త తలనొప్పి**
- **క్యాంప్ పాలిటిక్స్ వేడెక్కింది**
- **అలియాబాద్‌లో కీలక గేమ్**
- **జనగామలో ఉద్రిక్తత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత దాదాపు 34 మున్సిపాలిటీల్లో స్వతంత్రులుగా గెలిచిన వారి మద్దతు తప్పనిసరి అవుతోంది. ఇదే అదునుగా భావిస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థులు గొంతెమ్మ కోరికలకు దిగుతున్నారు. తమకు మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలని, తమ మద్దతు కావాలంటే తామే మున్సిపల్ చైర్మన్ కుర్చీలో కూర్చుంటామని తేల్చి చెబుతున్నారు. లేదంటే డిప్యూటీ చైర్మన్, భారీగా నగదు డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఆయా పార్టీలు తలలు పట్టుకుంటున్నాయి. ఇన్ని రోజులు తమ పార్టీ కోసం పనిచేసి పార్టీ గుర్తు మీద ఎన్నికల్లో పోటీ చేసిన వారిని కాదని.. ఇప్పుడు మద్దతు తెలిపిన వ్యక్తికి మున్సిపల్ చైర్మన్ పదవిని ఎలా కట్టబెడతామని అయోమయంలో పడ్డాయి.

**కొత్తగా తలనొప్పి**

మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ప్రధాన పార్టీలకు స్వతంత్ర అభ్యర్థుల రూపంలో కొత్త తలనొప్పులు వచ్చి పడ్డాయి. ఆయా మున్సిపాలిటీల్లో తమ పార్టీ అభ్యర్థులు గెలిచినప్పటికీ.. విజయానికి కావాల్సిన సీట్లు రాకపోవడంతో.. ఇప్పుడు ఆ పార్టీలకు స్వతంత్రుల మద్దతు అవసరమైంది. ఈ నేపథ్యంలోనే ఇండిపెండెంట్లుగా పోటీ చేసి గెలిచిన వారికి బాగా డిమాండ్ పెరిగింది. దీంతో వాళ్లు.. తమకు ఏ పార్టీ అయితే చైర్మన్ పదవి ఇస్తుందో ఆ పార్టీకే మద్దతు తెలుపుతామని గొంతెమ్మ కోరికలు కోరుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని.. మున్సిపాలిటీలను సొంతం చేసుకుంది. అదే సమయంలో కార్పొరేషన్లలో కూడా అధిక వార్డులను హస్తం పార్టీ నేతలే గెలుచుకున్నారు. కానీ కొన్ని మున్సిపాలిటీలు మాత్రం హంగ్ వచ్చాయి. ఆ మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ఓటర్లు అటు కాంగ్రెస్ పార్టీకి కాకుండా.. ఇటు బీఆర్ఎస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వకపోవడంతో.. సందిగ్ధ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆ మున్సిపాలిటీల్లో గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థుల మద్దతు ఇప్పుడు తప్పనిసరిగా మారింది. తమ మద్దతు అవసరం కావడంతో.. స్వతంత్ర అభ్యర్థులకు భారీగా డిమాండ్ నెలకొంది.

మరోవైపు.. ఈ మున్సిపల్ ఎన్నికల్లో క్యాంపుల రాజకీయాలు ఇప్పటికే తారస్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే గెలిచిన వారు చేజారిపోకుండా ఉండేందుకు అన్ని పార్టీలు తమ అభ్యర్థులను క్యాంపులకు తరలించాయి. ఎవరికీ తెలియకుండా రహస్య ప్రాంతాలకు తీసుకెళ్లాయి. ఇక హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీల్లో మెజారిటీ మార్కును అందుకునేందుకు ఇతర పార్టీలు, మరీ ముఖ్యంగా స్వతంత్ర అభ్యర్థులకు గాలం వేస్తున్నాయి. తమ పార్టీకి మద్దతు తెలిపిన వారికి భారీగా ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. ఏది అడిగినా చేసే విధంగా వారిని బుజ్జగిస్తూ.. తమ వైపు లాక్కునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి.

**మాకే కుర్చీ**

అయితే.. ఇదే అదునుగా భావిస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థులు.. గొంతెమ్మ కోరికలకు తెరలేపుతున్నారు. తమకు మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమ మద్దతు కావాలంటే.. తామే మున్సిపల్ చైర్మన్ కుర్చీలో కూర్చుంటామని తేల్చి చెబుతున్నారు. దీంతో ఆయా పార్టీలు తలలు పట్టుకుంటున్నాయి. ఇన్ని రోజులు తమ పార్టీ కోసం పనిచేసి.. తమ పార్టీ గుర్తు మీద ఎన్నికల్లో పోటీ చేసి కౌన్సిలర్లుగా గెలిచిన వారిని కాదని.. ఇప్పుడు మద్దతు తెలిపిన వ్యక్తికి మున్సిపల్ చైర్మన్ పదవిని ఎలా కట్టబెడతామని అయోమయంలో పడ్డాయి. అంతేకాకుండా ఒకవేళ వారికి మున్సిపల్ చైర్మన్ పదవిని అప్పగించినా.. ఆ తర్వాత తమ పార్టీ నుంచి జంప్ అయితే పరిస్థితి ఏంటి అనేది కూడా ఆలోచన చేస్తున్నాయి.

**అంతమందిని గెలిపించుకున్నా..**

మెజార్టీ మార్కును అందుకోకపోవడంతో.. ఆయా మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పరిస్థితి చాలా దారుణంగా మారింది. దాదాపు ఇప్పటివరకు వెల్లడైన ఫలితాలను బట్టి చూస్తుంటే.. రాష్ట్రవ్యాప్తంగా 12 మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడింది. దీంతో ఆ మున్సిపాలిటీ పరిధిలో జోరుగా అభ్యర్థులను కొనుగోలు చేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అలియాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో మొత్తం 11మంది ఇండిపెండెంట్లు పోటీ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ధీటుగా ప్రచారం చేసిన ఏడో వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్.. తన సీటులో గెలుపొందారు. అలియాబాద్ మున్సిపాలిటీలో.. మొత్తం 20 వార్డులు ఉండగా.. అందులో కాంగ్రెస్ పార్టీ 8 వార్డులు.. బీఆర్ఎస్ 7 వార్డులు, బీజేపీ 3 వార్డులు.. ఒక వార్డులో బీఎస్పీ విజయం సాధించాయి. ఎవరికీ స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన గాదె వెంకటేష్ మద్దతు కీలకంగా మారింది. దీంతో ఆయనను ఒప్పించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రయత్నాలు చేయగా.. మున్సిపల్ చైర్మన్ పదవిని తనకు ఏ పార్టీ ఇస్తే వారికే తాను మద్దతు తెలుపుతానని గాదె వెంకటేష్ తేల్చి చెప్పడంతో పార్టీలకు పెద్ద షాక్ తగిలినట్లయింది.

**జనగామ మున్సిపాలిటీలోనూ..**

మరోవైపు.. జనగామ మున్సిపాలిటీలోనూ ఇదే రకమైన పరిస్థితి నెలకొంది. జనగామలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సమాన వార్డుల్లో విజయం సాధించగా.. 15వ వార్డులో గెలిచిన స్వతంత్ర అభ్యర్థి పాండు మద్దతు రెండు పార్టీలకు కీలకంగా మారింది. దీంతో అతడి మద్దతు పొందేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు.. పాండును తమ వాహనాల్లో ఎక్కించుకుని తీసుకెళ్లేందుకు ఘర్షణకు దిగడంతో అక్కడ ఉద్రిక్తత చెలరేగింది. అయితే తనకు మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తానంటేనే ఏ పార్టీకైనా మద్దతు పలుకుతానని చెప్పడంతో వారు షాక్‌కు గురయ్యారు.

AIMIM
హైదరాబాద్ మరియు పాతబస్తీలో బలమైన ఓటు బ్యాంక్ ఉంది. ముస్లిం మైనారిటీల రాజకీయ ప్రతినిధిగా నిలుస్తోంది.



# టీ20 వరల్డ్‌కప్‌లో సంచలనం..

# ఆసీస్ ఓటమి

## బలమైన ఆసీస్‌ను కూల్చిన జింబాబ్వే




- **ముజారాబాని మెరుపులు.. ఆసీస్ పతనం**
- **బెన్నెట్ హాఫ్ సెంచరీతో బలమైన స్కోర్**
- **19 ఏళ్ల తర్వాత చరిత్ర తిరగరాసిన జింబాబ్వే**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

టీ20 ప్రపంచకప్‌లో అంచనాలు తలకిందులయ్యాయి. బలమైన ఆస్ట్రేలియాను జింబాబ్వే 23 పరుగుల తేడాతో ఓడించి అరుదైన విజయాన్ని నమోదు చేసింది. కొలంబో వేదికగా జరిగిన ఈ గ్రూప్ మ్యాచ్‌లో పట్టుదలతో ఆడిన జింబాబ్వే అన్ని విభాగాల్లో ఆధిపత్యం చాటింది.
టాస్ గెలిచిన ఆస్ట్రేలియా ఫీల్డింగ్ ఎంచుకోవడంతో ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 20 ఓవర్లలో 2 వికెట్లకే 169 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ 56 బంతుల్లో 64 పరుగులతో అజేయంగా నిలిచి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. చివర్లో కెప్టెన్ సికందర్ రజా వేగంగా పరుగులు జోడించి స్కోరును పోటీ స్థాయికి చేర్చాడు.
170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు ప్రారంభం నుంచే ఇబ్బందులు ఎదురయ్యాయి. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో జింబాబ్వే బౌలర్లు ఆసీస్ బ్యాటర్లను కట్టడి చేశారు. ముఖ్యంగా బ్లెస్సింగ్ ముజారాబాని నాలుగు వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. బ్రాడ్ ఎవాన్స్ మూడు వికెట్లు పడగొట్టడంతో ఆస్ట్రేలియా 19.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. ట్రావిస్ హెడ్, గ్లెన్ మాక్స్‌వెల్ వంటి కీలక బ్యాటర్లు స్వల్ప స్కోర్లకే పరిమితమయ్యారు.
అద్భుత ప్రదర్శనకు ముజారాబాని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ప్రపంచకప్ వేదికపై ఆస్ట్రేలియాను జింబాబ్వే ఓడించడం దాదాపు 19 ఏళ్ల తర్వాత కావడం విశేషం. ఈ ఫలితంతో గ్రూప్ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి.

# కెనడాను చిత్తు చేసిన యూఏఈ




- **ఆర్యాంశ్ మెరుపులతో యూఏఈ విజయం.**
- **కెనడాపై 5 వికెట్ల గెలుపు**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

టీ20 ప్రపంచకప్‌లో ఫిబ్రవరి 13న జరిగిన పోరులో యూఏఈ జట్టు కెనడాపై ఐదు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. సమతూకంగా సాగిన ఈ మ్యాచ్‌లో చివర్లో యూఏఈ బ్యాటర్లు చెలరేగి మ్యాచ్‌ను ముగించారు.
టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన కెనడా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. హర్ష్ ఠాకూర్ అర్ధశతకంతో ఇన్నింగ్స్‌కు బలాన్నిచ్చాడు. నవ్నీత్ ధలీవాల్, శ్రేయస్ మొవ్వ ఉపయోగకర పరుగులు జోడించారు. అయితే మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. యూఏఈ తరఫున జునైద్ సిద్దిఖీ ఐదు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేయగా, ముహమ్మద్ జవాదుల్లా మద్దతు ఇచ్చాడు.
151 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ ప్రారంభంలో ఒత్తిడికి లోనై 66 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో ఆర్యాంశ్ శర్మ, షోయబ్ ఖాన్ జట్టును నిలబెట్టారు. ఆర్యాంశ్ శర్మ అజేయంగా 74 పరుగులు చేయగా, షోయబ్ ఖాన్ అర్ధశతకంతో తోడ్పడ్డాడు. వీరి భాగస్వామ్యం ఫలితంగా యూఏఈ 19.4 ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకుంది.
కెనడా బౌలర్లలో సాద్ బిన్ జాఫర్ మూడు వికెట్లు తీసి పోరాడినా, ఆర్యాంశ్-షోయబ్ పట్టుదల ముందు అది సరిపోలలేదు. ఈ విజయంతో యూఏఈ టోర్నీలో కీలక అడుగు వేసింది.

# మిలాన్–కోర్టినా వింటర్ ఒలింపిక్స్‌లో విచిత్ర పరిస్థితి

- **మూడు రోజుల్లోనే కండోమ్ స్టాక్ ఖాళీ**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

ఒలింపిక్స్ అంటే సాధారణంగా పతకాల పోరు, రికార్డుల వేట గుర్తుకు వస్తాయి. అయితే ఇటలీలో జరుగుతున్న 2026 Milan-Cortina Winter Olympics సందర్భంగా క్రీడా గ్రామంలో మరో అంశం చర్చనీయాంశంగా మారింది. అథ్లెట్ల కోసం అందుబాటులో ఉంచిన కండోమ్‌లు కేవలం మూడు రోజుల్లోనే పూర్తిగా వినియోగించబడినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.
కోర్టినా డి అంపెజోలో ఏర్పాటు చేసిన అథ్లెట్ల గ్రామంలో సుమారు 2,900 మంది క్రీడాకారులు నివసిస్తున్నారు. ముందస్తు ఏర్పాట్లలో భాగంగా దాదాపు పది వేల ప్యాకెట్లను నిర్వాహకులు సిద్ధం చేశారు. అయితే ఆటలు ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే మొత్తం నిల్వ ఖాళీ కావడంతో అదనపు సరఫరా కోసం చర్యలు ప్రారంభించినట్లు సమాచారం.
గత ఒలింపిక్స్‌లతో పోలిస్తే ఈసారి కేటాయింపు తక్కువగా ఉండటమే డిమాండ్ పెరగడానికి కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు 2024 Paris Olympics సమయంలో వేలాది అథ్లెట్లకు లక్షల సంఖ్యలో కండోమ్‌లు పంపిణీ చేసినట్టు నివేదికలు సూచిస్తున్నాయి.
ఒలింపిక్ క్రీడా గ్రామాల్లో సురక్షిత సంబంధాలపై అవగాహన కల్పించడం చాలా ఏళ్లుగా కొనసాగుతున్న విధానం. గతంలో కోవిడ్ ఆంక్షల కారణంగా కఠిన నిబంధనలు అమలులో ఉన్నప్పటికీ, ప్రస్తుతం అలాంటి పరిమితులు లేవు. ఈ నేపథ్యంలో డిమాండ్ ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో కొత్త స్టాక్‌ను అత్యవసరంగా తెప్పించే చర్యలు కొనసాగుతున్నాయి. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని నిర్వాహకులు తెలిపారు.



# దంచికొట్టిన యూఎస్ఏ

- **సాయితేజ హాఫ్ సెంచరీ..**
- **నెదర్లాండ్స్ టార్గెట్ 197 పరుగులు**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

చెన్నై వేదికగా జరుగుతోన్న మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌కు యూఎస్ఏ 197 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూఎస్ఏ 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. సాయితేజ ముక్కామల (79) హాఫ్ సెంచరీ చేయగా.. శుభమ్ రంజనె (48*) దూకుడు ప్రదర్శించాడు. కెప్టెన్ మోనాంక్ పటేల్ (36), షయాన్ జహంగీర్ (20) రాణించారు. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డి లీడే 3.. వాన్‌బీక్, కైల్, ఫ్రెడ్ క్లాసెన్ తలో వికెట్ తీశారు.




# అభిషేక్‌పై క్లారిటీ ఇచ్చిన వరుణ్

**పాక్ మ్యాచ్‌కు ఓపెనర్ సిద్ధమవుతున్నాడని సంకేతం**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

భారత్–పాకిస్తాన్ కీలక పోరుకు ముందు జట్టు నుంచి ఆశాజనక సమాచారం వచ్చింది. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ గాయస్థితిపై స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్పందించాడు. పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్ సమయానికి అభిషేక్ అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని సూచించాడు.
ఇటీవల వైరల్ ఫీవర్‌తో బాధపడిన అభిషేక్, ఆ తరువాత స్వల్ప అస్వస్థతకు గురైనట్టు సమాచారం. అందువల్ల గత మ్యాచ్‌లో అతడు తుది జట్టులో చోటు దక్కించుకోలేదు. అయితే ప్రస్తుతం కోలుకునే దిశగా ఉన్నాడని, ప్రాక్టీస్‌లో పాల్గొంటున్నాడని వరుణ్ తెలిపాడు. పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌పై తుది నిర్ణయం జట్టు నిర్వహణదే అని కూడా పేర్కొన్నాడు.
అమెరికాతో జరిగిన మ్యాచ్ అనంతరం అస్వస్థతకు గురైన అభిషేక్, నమీబియాతో జరిగిన రెండో మ్యాచ్‌ను బయట నుంచి వీక్షించాడు. డగౌట్‌లో కనిపించిన అతని హావభావాలు అభిమానుల్లో ఆందోళన కలిగించాయి. అయితే తాజా సమాచారం ప్రకారం అతడు చురుకుగా ఉన్నాడని, మ్యాచ్‌కు సిద్ధమవుతున్నాడని తెలుస్తోంది.
ఫిబ్రవరి 15న భారత్–పాకిస్తాన్ మధ్య జరిగే పోరు కీలకంగా మారింది. ఇప్పటికే భారత్ వరుస విజయాలతో జోరు మీద ఉంది. ఈ నేపథ్యంలో అభిషేక్ తిరిగి జట్టులో చేరితే బ్యాటింగ్ బలం మరింత పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.







# గాయాల బెడద.. టీ20 ప్రపంచకప్‌లో జట్లకు వరుస షాక్‌లు

- **కీలక ఆటగాళ్లు టోర్నీకి దూరం.. లీగ్ దశలోనే మారిన సమీకరణాలు**

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

టీ20 ప్రపంచకప్ లీగ్ దశ ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్న వేళ అనేక జట్లకు గాయాలు పెద్ద సమస్యగా మారాయి. కీలక ఆటగాళ్లు ఒక్కొక్కరుగా టోర్నీ నుంచి వైదొలుగుతుండటంతో జట్ల వ్యూహాల్లో మార్పులు తప్పడం లేదు.
భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీలో ఇప్పటికే భారత పేసర్ హర్షిత్ రానా గాయంతో దూరమయ్యాడు. శ్రీలంకకు చెందిన ఇషాన్ మలింగ, వనిందు హసరంగలు కూడా అందుబాటులో లేరు. తాజాగా ఐర్లాండ్, జింబాబ్వే జట్లకు కూడా ఎదురుదెబ్బ తగిలింది.
ఐర్లాండ్ కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ లీగ్ తొలి మ్యాచ్‌లో గాయపడ్డాడు. ఆస్ట్రేలియాతో జరిగిన పోరులో ఫీల్డింగ్ చేస్తూ ఎడమ మోకాలి లిగమెంట్ దెబ్బతినడంతో అతడు టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. అతని స్థానంలో యువ ఆటగాడు సామ్ టాపింగ్‌ను జట్టులో చేర్చారు.
ఇక జింబాబ్వేకు చెందిన సీనియర్ ఆటగాడు బ్రెండన్ టేలర్ కూడా మిగతా మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదు. ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తూ కండరాల నొప్పితో ఇబ్బంది పడ్డ టేలర్ 31 పరుగుల వద్ద రిటైర్ట్ హర్ట్‌గా మైదానం విడిచాడు. వైద్యుల సూచన మేరకు అతడికి విశ్రాంతి అవసరమని తేలడంతో టోర్నీ నుంచి వైదొలిగాడు. జట్టు కెప్టెన్ సికందర్ రజా ఈ విషయాన్ని వెల్లడించాడు.
లీగ్ దశలోనే కీలక ఆటగాళ్లు దూరమవుతుండటంతో చిన్న జట్ల అవకాశాలపై ప్రభావం పడుతోంది. ముందున్న మ్యాచ్‌లు మరింత కీలకంగా మారిన నేపథ్యంలో ఈ గాయాలు టోర్నీ గమనాన్ని ఎలా మార్చుతాయో చూడాలి.

# యూఏఈ చేతిలో భారత్ ‘ఎ’ జట్టుకు ఓటమి

**ముద్ర. స్పోర్ట్స్ డెస్క్**

ఏసీసీ మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్-2026 టోర్నీ ఆరంభంలోనే భారత మహిళల ‘ఎ’ జట్టుకు నిరాశ ఎదురైంది. బ్యాంకాక్‌లో జరిగిన మ్యాచ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.
టాస్ గెలిచిన భారత్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నప్పటికీ ఆ నిర్ణయం ఫలించలేదు. ఓపెనర్లు హమైరా ఖాజీ, వ్రిందా దినేశ్ త్వరగానే ఔటయ్యారు. వన్‌డౌన్ తేజల్ హసబ్నిస్ కూడా పెద్దగా నిలవలేదు. కెప్టెన్ రాధా యాదవ్, మిన్ను మణి, మమత మడివాలా కూడా నిరాశపరిచారు.
ఇలాంటి పరిస్థితిలో అనుష్క శర్మ స్థిరంగా ఆడి 47 పరుగులు చేసింది. తనూజ కన్వార్ వేగంగా 34 పరుగులు జోడించి స్కోరు బోర్డును కదిలించింది. అయితే మిగతా బ్యాటర్ల నుంచి సహకారం లేకపోవడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 130 పరుగులకే పరిమితమైంది.
యూఏఈ బౌలర్లలో సమైరా ధర్నిధార్క మూడు వికెట్లు తీసి ఆకట్టుకోగా, ఇషా ఓజా, వైష్ణవి మహేశ్ చెరో రెండు వికెట్లు సాధించారు.
131 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ ఆత్మవిశ్వాసంతో ఆడింది. కెప్టెన్ ఇషా ఓజా అద్భుతంగా బ్యాటింగ్ చేసి అజేయంగా 72 పరుగులు చేసింది. సమైరా 34 పరుగులతో కీలక భాగస్వామ్యం నెలకొల్పింది. చివరికి 19.2 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి యూఏఈ లక్ష్యాన్ని చేరుకుంది.
ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించిన ఇషా ఓజాకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. భారత సంతతి ఆటగాళ్లు అధికంగా ఉన్న యూఏఈ జట్టు ఈ విజయంతో టోర్నీలో బలమైన సందేశం ఇచ్చింది.





# మహిరా శర్మ ఫ్యాషన్ ఫీవర్!

మహిరా శర్మ తాజా ఫొటోల్లో ఆధునిక గ్లామర్‌కు కొత్త అర్థం ఇచ్చింది. ట్రెండీ సిల్హౌట్స్, క్లాసిక్ అవుట్‌ఫిట్స్ మేళవింపుతో ఆమె ప్రతి లుక్ ప్రత్యేకంగా మెరిసింది. షార్ప్ బ్లేజర్ స్టైల్‌లో పవర్‌ఫుల్ వైబ్ చూపిస్తే, ఫ్లోయింగ్ గౌన్‌లో సాఫ్ట్ ఎలిగెన్స్‌ను ప్రతిబింబించింది. టెక్స్చర్స్, కట్స్, మూడ్స్‌తో చేసిన ప్రయోగాలు ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరింత హైలైట్ చేశాయి. బోల్డ్ ఎంపికలు చేసినా, ఓవర్ కాకుండా క్లాస్‌ను కాపాడుకోవడం మహిరా స్టైల్‌లో ప్రత్యేకతగా నిలిచింది.ఈ ఫొటో సిరీస్‌లో ఆమె కాన్ఫిడెన్స్, గ్లామర్, స్టైల్—అన్నీ కలిపి ఒక ఫ్రేమ్‌గా కనిపిస్తున్నాయి.





### థియేటర్ల తర్వాత ఓటీటీలోనూ

## చిరంజీవి జోరు

మెగాస్టార్ చిరంజీవి- మాస్ దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందిన మనశంకరవరప్రసాద్ గారు సంక్రాంతి సందర్భంగా విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించింది. సుమారు రూ.375 కోట్ల కలెక్షన్లతో ఇది చిరంజీవి కెరీర్‌లో ప్రముఖ హిట్‌గా నిలిచింది.ఇటీవల ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చి అక్కడ కూడా అదే ఊపు కొనసాగిస్తోంది. ఫిబ్రవరి 11న *ZEE5*లో స్ట్రీమింగ్ ప్రారంభమైన ఈ సినిమా, మొదటి 24 గంటల్లోనే 200 మిలియన్ల వ్యూయింగ్ మినిట్స్ సాధించినట్లు సమాచారం. థియేటర్లలో సృష్టించిన రికార్డుల తరువాత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పైనా ఈ స్థాయి స్పందన రావడం విశేషమని సినీ వర్గాలు చెబుతున్నాయి.మెగాస్టార్ క్రేజ్ పెద్ద తెరపైనే కాదు, చిన్న తెరపైనా సమానంగా కొనసాగుతుందనే విషయం ఈ విజయంతో మరోసారి స్పష్టమైంది.

## ‘వీరా రాజ వీరా’ పాట వివాదం సుప్రీం కోర్టులో



ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ‘పొన్నియిన్ సెల్వన్ 2’ చిత్రంలోని ‘వీరా రాజ వీరా’ గీతంపై వివాదం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ పాట తమ కుటుంబానికి చెందిన శివస్తుతి స్వరరచన ఆధారంగా రూపొందించబడిందని ఉస్తాద్ ఫయాజ్ వసిఫుద్దీన్ డగర్ పిటిషన్ దాఖలు చేశారు.విచారణ సందర్భంగా డగర్ కుటుంబానికి గుర్తింపు అంశాన్ని కోర్టు ప్రస్తావించి, తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది. ముందుగా ఢిల్లీ హైకోర్టు రూ.2 కోట్లు జమ చేయాలని, క్రెడిట్స్‌లో పేరు ఇవ్వాలని ఆదేశించగా, ఆ ఉత్తర్వులను ఏఆర్ రెహమాన్ సవాల్ చేశారు. కేసు విచారణ కొనసాగుతోంది.



## మెరిసే చీరలో కవ్విస్తున్న అందాల నిధి

నిధి అగర్వాల్ తాజాగా మరోసారి సంప్రదాయ లుక్‌లో మెరిసిపోయింది. పాస్టెల్ న్యూడ్ షేడ్‌లో సున్నితమైన షిమ్మర్, నాజూకైన ఎంబ్రాయిడరీతో ఉన్న చీర ఆమెకు ఎంతో అందంగా నప్పింది. చీరపై ఉన్న సీక్విన్ వర్క్ లైట్‌లో మృదువుగా మెరుస్తూ లుక్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చింది. స్లీవ్‌లెస్ హెవీ ఎంబెలిష్డ్ బ్లౌజ్‌తో మోడ్రన్ టచ్ జోడించిన ఆమె, హెయిర్‌ను సాఫ్ట్ వేవ్స్‌లో వదిలి, మినిమల్ మేకప్‌తో నేచురల్ గ్లోను హైలైట్ చేసింది. స్టేట్‌మెంట్ ఇయరింగ్స్ ఆమె స్టైల్‌కు ఫైనల్ టచ్ ఇచ్చాయి. గ్లామర్, ఎలిగెన్స్ రెండింటినీ సమతుల్యం చేస్తూ నిధి ఈ ఫొటోల్లో సింపుల్‌గా స్టన్నింగ్‌గా కనిపించింది



## ఫాంటసీ—పౌరాణిక మేళవింపు ‘వారణాసి’.. జానర్‌పై రాజమౌళి క్లారిటీ

మహేశ్ బాబు కథానాయకుడిగా రూపొందుతున్న ‘వారణాసి’ సినిమా గురించి మొదటి నుంచే విపరీతమైన ఆసక్తి నెలకొంది. టైటిల్ గ్లింప్స్ విడుదలైన తర్వాత ఇది ఏ తరహా కథతో వస్తుందన్న చర్చ సోషల్ మీడియాలో విస్తరించింది. ముఖ్యంగా ప్రతినాయక పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ ఆటోమేటిక్ వీల్‌చైర్‌లో కనిపించిన లుక్ కారణంగా ఈ చిత్రం సైన్స్ ఫిక్షన్ కేటగిరీకి చెందినదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.అయితే ఈ ప్రచారాలపై దర్శకుడు రాజమౌళి స్పష్టత ఇచ్చారు. సినిమాలో కొన్ని సన్నివేశాలు సైఫై వాతావరణాన్ని గుర్తు చేసినా, ఇది పూర్తిగా సైన్స్ ఫిక్షన్ కథ కాదని ఆయన తెలిపారు. ఫాంటసీ అంశాలు, పౌరాణిక నేపథ్యం కలగలిపిన కథగా ఈ చిత్రం రూపొందుతోందని చెప్పారు.

**రుద్ర పాత్ర ఎంట్రీ ప్రత్యేక ఆకర్షణ**

తన గత చిత్రం “ఆర్‌ఆర్‌ఆర్” విజయంతో ఎలాంటి ఒత్తిడి అనిపించలేదని రాజమౌళి పేర్కొన్నారు. కొత్త ప్రాజెక్ట్ ప్రారంభించినప్పుడు గత విజయాలను దృష్టిలో పెట్టుకోనని తెలిపారు.‘వారణాసి’లో మహేశ్ బాబు పోషిస్తున్న ‘రుద్ర’ పాత్ర సినిమాకి ప్రధాన బలం అవుతుందని చెప్పారు. వృషభంపై రుద్ర ఎంట్రీ సన్నివేశం ప్రేక్షకులకు గుర్తుండిపోయే అనుభూతి ఇస్తుందని, అది చిత్రంలో అత్యంత ప్రభావవంతమైన క్షణంగా నిలుస్తుందని వెల్లడించారు. విజువల్ వైభవంతో పాటు భావోద్వేగాలను సమానంగా ప్రతిబింబించేలా చిత్రాన్ని మలుస్తున్నట్టు చెప్పారు.సినిమా నిడివి మూడు గంటలకు లోపుగానే ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు కూడా వెల్లడించారు.

**ఐమ్యాక్స్‌లో కొన్ని కీలక దృశ్యాలు**

మొత్తం సినిమాను ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తెరకెక్కించాలని భావించినప్పటికీ, సాంకేతిక పరిమితుల దృష్ట్యా కొన్ని ముఖ్యమైన సన్నివేశాలనే ఆ వెర్షన్‌లో చిత్రీకరిస్తున్నట్టు తెలిపారు. రామాయణం ఆధారంగా ఉన్న భాగాల చిత్రీకరణ ఇప్పటికే పూర్తయిందని, వాటికి సంబంధించిన విజువల్ ఎఫెక్ట్స్ పనులు సవాలుగా మారాయని పేర్కొన్నారు.అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న విడుదలకు సిద్ధమవుతోంది.




## మెగా ఇంట్లో డబుల్ సంబరం... మనవళ్ల పేర్లు ప్రకటించిన చిరంజీవి

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన దంపతుల కవలల పేర్లపై ఎదురుచూస్తున్న అభిమానులకు మెగాస్టార్ చిరంజీవి స్వయంగా సర్‌ప్రైజ్ ఇచ్చారు. సోషల్ మీడియాలో కుటుంబ సభ్యులతో కలిసి ఉన్న ముద్దు ఫోటోను షేర్ చేస్తూ మనవడు, మనవరాలి పేర్లను ప్రకటించారు.బాబుకు ‘శివరామ్ కొణిదెల’, పాపకు ‘అన్వీరా దేవి కొణిదెల’ అని నామకరణం చేసినట్లు తెలిపారు. ‘శివరామ్’ అనే పేరులో చిరంజీవి అసలు పేరులోని ‘శివ’, రామ్ చరణ్ పేరులోని ‘రామ్’ కలిసిన ప్రత్యేకత ఉంది. ‘అన్వీరా దేవి’ పేరు ధైర్యం, దైవిక శక్తిని సూచించేలా ఎంపిక చేశారని వివరించారు. పెద్దల ఆశీస్సులతో సాంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుక మెగా కుటుంబంలో ఆనందాన్ని రెట్టింపు చేసింది. ప్రస్తుతం రామ్ చరణ్ తన కొత్త ప్రాజెక్ట్‌తో బిజీగా ఉండగా, చిరంజీవి ‘విశ్వంభర’ పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

## ‘డాన్ 3’పై క్లారిటీ ఇచ్చిన హృతిక్ రోషన్

బాలీవుడ్ యాక్షన్ ఫ్రాంచైజీ Don 3 విషయంలో జరుగుతున్న ఊహాగానాలకు స్టార్ హీరో Hrithik Roshan చెక్ పెట్టారు. రణ్‌వీర్ సింగ్ స్థానంలో ఆయన నటించబోతున్నారన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు.ఈ ప్రాజెక్ట్ గురించి చిత్రబృందం తనను ఎప్పుడూ సంప్రదించలేదని, సోషల్ మీడియాలో వచ్చిన ప్రచారం కేవలం పుకార్లేనని హృతిక్ తెలిపారు. అధికారిక ప్రకటనలకే ప్రాముఖ్యత ఇవ్వాలని, నిర్ధారణ లేని వార్తలను వ్యాప్తి చేయవద్దని మీడియాను ఆయన కోరారు.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com